ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 15.10.2025 | సంపుటి : 12 సంచిక : 85 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## ఈడీ అన్ని హద్దులూ దాటుతోంది



- సమాఖ్య పాలన భావనను ఉల్లంఘిస్తోంది
- దర్యాప్తు సంస్థ తీరుపై సుప్రీం మరోసారి అసంతృప్తి

న్యూఢిల్లీ(జనంసాక్షి):తమిళనాడు మద్యం కుంభకోణం ఆరోపణలపై దర్యాప్తు జరుపుతోన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌పై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి అసహనం వ్యక్తం చేసింది. ఈ విషయంలో దర్యాప్తు చేస్తున్న రాష్ట్ర పోలీసుల హక్కులను లాగేసుకోవడం లేదా? అని ప్రశ్నించింది. ఈ సందర్భంగా సమాఖ్య వ్యవస్థ సంగతేంటని మరోసారి నిలదీసింది."రాష్ట్ర పోలీసుల హక్కులను ఉల్లంఘించడం లేదా? మీకు అనుమానం వచ్చినప్పుడల్లా మీ సొంతంగా దర్యాప్తు చేస్తారా? సమాఖ్య వ్యవస్థకు ఏమైంది..? ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేయడం లేదా? శాంతి భద్రతలను ఎవరు నియంత్రిస్తారు. గత ఆరేళ్లలో ఈడీకి సంబంధించి ఎన్నో కేసులు చూశాను. మళ్లీ నేనేం చెప్పదలచుకోలేదు" అని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. తమిళనాడులో మద్యం రిటైలర్ 'టాస్మాక్‌'లో అవకతవకలకు సంబంధించి మిగతా 2లో..

### తప్పిపోయిన పిల్లల కేసుల పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించండి

కేంద్రానికి సుప్రీం ధర్మాసనం ఆదేశం

2లో..



# మల్లోజుల లొంగుబాటు

వెంటరాని కేంద్రకమిటీ సభ్యులు

- మహారాష్ట్రలోని గడ్చిరోలిలో పోలీసుల ఎదుట సరెండరైన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు
- పార్టీ అనుసరిస్తున్న తీరుపై కొంతకాలంగా అసంతృప్తి

ముంబై(జనంసాక్షి):మావోయిస్టు పార్టీకి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోనూ పోలీసులకు లొంగిపోయారు. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఆయన పోలీసులకు లొంగిపోయారు. కొద్దిరోజుల కిందట తన సోదరుడు మల్లోజుల కోటేశ్వరరావుకు కిషన్‌జీ పేరుతో వేణుగోపాల్‌రావు ఒక లేఖ మిగతా 2లో..



## బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టేను


# నిలువరించండి

### సుప్రీంలో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిన తెలంగాణ ప్రభుత్వం



- బీసీలకు 42% రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించుకొనేందుకు అనుమతివ్వాలని అభ్యర్థన
- గురువారం లేదా శుక్రవారం విచారణ
- అంశంపై సమగ్ర, శాస్త్రీయ అధ్యయనం నిర్వహించాం
- ప్రత్యేక కేసుగా పరిగణించాలని అత్యున్నత ధర్మాసనంకు వినతి

న్యూఢిల్లీ(జనంసాక్షి):బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం సడలని సంకల్పంతో ముందుకు వెళ్తుంది. జీవో 9పై స్టే విధిస్తూ హైకోర్టు ఈ నెల 9న జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. రిజర్వేషన్లను 50 శాతానికి పరిమితం చేస్తూ రాజ్యాంగంలో ఎక్కడా పరిమితులు విధించలేదని, కేవలం సుప్రీంకోర్టు మాత్రమే దాన్నో మార్గదర్శక సూత్రంగా నిర్దేశించిందని పేర్కొంది




.అయితే కొన్ని ప్రత్యేక సందర్భాల్లో అంతకుమించి రిజర్వేషన్లు కల్పించవచ్చని ఇందిరా సాహ్ని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, జనహిత్ అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుల్లో సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తు చేసింది. రిజర్వేషన్ల అమలు కోసం ట్రిపుల్ టెస్ట్ నిర్వహించాలని వికాస్ కిషన్ రావ్ గావ్లీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో పేర్కొంది. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే మిగతా 2లో..

### సుప్రీంలో బీసీలకు న్యాయం జరుగుతుంది

- రిజర్వేషన్లకు అనుకూలంగా తీర్పు రావచ్చు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఆశాభావం
- హైకోర్టు తీర్పు నిరాశ కలిగించిందని వెల్లడి

2లో..

### హైకోర్టు స్టే ఏకపక్షం


- బీసీ రిజర్వేషన్ల ఆశలపై నీళ్లు చల్లారు
- బంద్‌తో బిసిల ఆకాంక్షను వెల్లడిస్తాం:ఆర్. కృష్ణయ్య

# బనకచర్లను ఆపండి

- ప్రాజెక్టుపై ముందుకెళ్లకుండా ఏపీ ప్రభుత్వాన్ని నిలువరించండి
- కేంద్రానికి తెలంగాణ లేఖ



హైదరాబాద్(జనంసాక్షి):పోలవరం- బనకచర్ల లింకు ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వాన్ని నిలువరించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాశారు. బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో గతంలోనే ఫిర్యాదు చేసినట్లు లేఖలో గుర్తు చేశారు. డీపీఆర్ తయారీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే, నిబంధనలు, విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల లింక్ ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డులకు లేఖ రాసింది. తాజాగా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. పోలవరం - బనకచర్ల విషయంలో ఏపీ ముందుకెళ్లకుండా నిలువరించాలని కోరారు.టెండర్, భూసేకరణ విషయంలో ముందుకెళ్లకుండా చూడాలని కోరారు.




## గ్రూప్-2 విజేతలకు 18న నియామక పత్రాలు

సీఎం రేవంత్ చేతుల మీదుగా శిల్పకళా వేదికలో అందచేత

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన గ్రూప్-2 అభ్యర్థులకు ఈనెల 18 తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచే నియామక పత్రాలు అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. 18 తేదీ సాయంత్రం శిల్పకళా వేదికలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత ఉన్నతాధికారులతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సి.ఎస్. సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రూప్-2 ద్వారా ఎంపికైన 783 మంది అభ్యర్థులకు రాష్ట్ర మిగతా 2లో..

## మంత్రుల మధ్య విభేదాలు అబద్ధం

మీడియా చిట్‌చాట్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



నల్గొండ(జనంసాక్షి):ఇరిగేషన్ శాఖలో అవినీతి ఆరోపణలు అవాస్తవమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తన శాఖ, తన జిల్లా అభివృద్ధి పనులపై తాను ఫోకస్ పెట్టానని వ్యాఖ్యానించారు. మంత్రుల మధ్య సమన్వయం ఉందని.. విబేధాలు లేవని క్లారిటీ ఇచ్చారు. మంగళవారం ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. తన శాఖలో బదిలీలు నిబంధనల ప్రకారం జరిగాయని.... ప్రాసెస్ అంతా తానే దగ్గరుండి చూశానని చెప్పుకొచ్చారు. నీటి వాటాల్లో తెలంగాణ హక్కుల కోసం పోరాటం చేస్తూనే ఉన్నామని ఉద్ఘాటించారు. కర్ణాటకలో కాంగ్రెస్, మహారాష్ట్రలో మిగతా 2లో..

## 'సిట్'కు సహకరించాల్సిందే

- అధికారులు అడిగిన సమాచారం ఇవ్వాల్సిందే..
- ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావుకు సుప్రీం ఆదేశం
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామం



న్యూఢిల్లీ(జనంసాక్షి): తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సిట్ అధికారులు అడిగిన సమాచారం ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు ఇవ్వాల్సిందేనని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసులో క్లౌడ్, యాపిల్ క్లౌడ్ సమాచారం మిగతా 2లో..



## ప్రజా ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా విద్యారంగం

ప్రతీ విద్యార్థి పాఠశాలలో ఉండాలి

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్(జనంసాక్షి): ప్రజా ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతిష్టాత్మంగా తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బెస్ట్ అవైలబుల్ స్కీం ప్రగతిని సమీక్షించారు.బెస్ట్ అవైలబుల్ స్కీం కింద నిధులకు సంబంధించిన ఒప్పందం పాఠశాల యాజమాన్యాలు, జిల్లా యంత్రాంగం మధ్యన జరిగింది. ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే పాఠశాల యాజమాన్యాలు జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించాలి తప్ప విద్యార్థులను బయటికి పంపడానికి వీలులేదని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, డీఈవోలు, సంక్షేమ శాఖల అధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా మిగతా 2లో..

## నీటిపారుదల శాఖలో 106మంది ఇంజనీర్ల బదిలీ

హైదరాబాద్(జనంసాక్షి):నీటిపారుదల శాఖలో అవినీతి అధికారుల వ్యయహారం కలకలం రేపుతు న్న తరుణంలో ..హైదరాబాద్ సర్కిల్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా 106 మంది ఇంజినీర్లను బదిలీ చేస్తూ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌వోసీల జారీ విషయంలో ఇంజినీర్లపై వచ్చిన ఆరోపణల ఆధారంగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. బదిలీ అయిన ఇంజినీర్లలో ఈఈలు, డీఈఈలు,ఏఈఈలు ఉన్నారు. గతంలో వచ్చిన ఆరోపణ లతోపాటు, క్షేత్ర స్థాయిలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు రావడం తో సమూల ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం క్షేతస్థాయి మిగతా 2లో..

### గురుకులాలకు గ్రీన్ ఛానెల్‌లో నిధులు..

## సీఎం మాటలు నమ్మలేం: హరీశ్

2లో..

## ప్రభుత్వాధికారిపై కులవివక్ష విషాదకరం

పూరన్ ఆత్మహత్యకు కారకులపై వెంటనే చర్యలు తీసుకోవాలి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్



చండీగఢ్(జనంసాక్షి):హరియాణాలోని సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పూరన్ కుమార్ కుటుంబాన్ని కలిశారు. ఈ సందర్భంగా పూరన్‌కు నివాళులర్పించిన ఆయన.. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు.అనంతరం రాహుల్ విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాధికారిపై ఇలాంటి వివక్ష చోటుచేసుకోవడం విషాదకరమన్నారు. ఈ కేసుకు సంబంధించి స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా విచారణ జరుపుతామని స్వయంగా హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ హామీ ఇచ్చారన్నారు. కానీ, రోజులు గడుస్తున్నా.. అది నెరవేరటం లేదని విమర్శించారు. తండ్రిని పోగొట్టుకున్న పూరన్‌కుమార్ ఇద్దరు పిల్లలు చాలా ఒత్తిడిలో ఉన్నారన్నారు. పూరన్ కుమార్ కెరీర్‌ను, ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఇతర అధికారులు సంవత్సరాలుగా వివక్ష కొనసాగించారని స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఇది కేవలం ఒక దళిత కుటుంబానికి సంబంధించినది మిగతా 2లో..



### హరియాణాలో మరో పోలీసు అధికారి ఆత్మహత్య

- తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ ఏఎస్సై సందీప్‌కుమార్
- సూసైడ్ నోట్‌లో ఐపీఎస్ అధికారి పూరన్ పేరు

చండీగఢ్(జనంసాక్షి): హరియాణాలో ఇటీవల సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ బలవన్మరణానికి పాల్పడటం తీవ్ర కలకలం సృష్టించిన సంగతి మిగతా 9లో..

## బస్సులో 20 మంది సజీవ దహనం

- రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం
- మృతుల్లో మహిళలు, చిన్నారులు



జైసల్మేర్(జనంసాక్షి): రాజస్థాన్‌లో ఘోర బస్సు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రైవేట్ ట్రావెల్ బస్సులో మంటలు చెలరేగి ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. మంగళవారం (అక్టోబర్14)జైసల్మేర్ నుంచి జోధ్‌పూర్ వెళ్తున్న ప్రైవేట్ బస్సులో మంటలు వ్యాపించారు.ఈ దుర్ఘటనలో 20 మంది ప్రయాణికులు సజీవ దహన మైనట్లు తెలుస్తోంది. మిగిలి న ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. బస్సు ప్రమాద సమయంలో మొత్తం 57మంది ప్రయాణిస్తున్నట్లు సమాచారం.ప్రైవేట్ ట్రావెల్ బస్సు జైసల్మేర్ నుంచి జోధ్‌పూర్ వెళ్తుండగా మార్గం మధ్యలో బస్సు ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. దీంతో వేగంగా వ్యాపించిన మంట లు బస్సు మొత్తాన్ని అంటుకున్నాయి. ఈ ఘటనలో భయాందోళనకు మిగతా 2లో..

## సామాజిక న్యాయం కోసం రాహుల్ కృషిచేస్తున్నారు

ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం: మీనాక్షి నటరాజన్

జూబ్లీహిల్స్‌లో బిఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు: మంత్రి పొన్నం



హైదరాబాద్(జనంసాక్షి): సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పనిచేస్తున్నారని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని చెప్పారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో వెంగళరావునగర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆమె మిగతా 2లో..



## మాగంటి సునీతకు బీఫామ్

- అందించిన కేసీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దిగిన మాగంటి సునీతా గోపీనాథ్ కు పార్టీ అధినేత కేసీఆర్ బీ ఫామ్ అందజేశారు. అదేవిధంగా ఎన్నికల ఖర్చు నిమిత్తం పార్టీ తరపున రూ.40 లక్షల చెక్కును కూడా అందించారు. ఈ సందర్భంగా మాగంటి సునీతా గోపినాథ్ వెంట ఆమె కూతుళ్లు, కుమారుడు, మాజీ మంత్రి, మహేశ్వరం మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
15.10.2025

## తప్పిపోయిన పిల్లల కేసుల పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించండి

### కేంద్రానికి సుప్రీం ధర్మాసనం ఆదేశం

**న్యూఢిల్లీ (జనంసాక్షి):** తప్పిపోయిన పిల్లల కేసుల విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మిస్సింగ్ కేసుల పర్యవేక్షణకు ప్రతి రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నోడల్ అధికారులను నియమించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్రాల్లో పిల్లల మిస్సింగ్, అక్రమ రవాణాపై 'గురియా స్వయం సేవి సంస్థాన్' అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఈమేరకు ఆదేశాలిచ్చింది. తప్పిపోయిన పిల్లల కేసులను పర్యవేక్షించ డానికి నియమించిన నోడల్ అధికారుల వివరాలను ఆన్‌లైన్ సహా అన్ని మాధ్యమాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఇందుకోసం ఒక పోర్టల్ రూపొందించి... దానిలో అన్ని వివరాలు పొందుపరచాలని ఆదేశించింది. పోర్టల్‌లో అదృశ్యమైన పిల్లల గురించి ఫిర్యాదు అందిన వెంటనే నోడల్ అధికారులు చర్యలు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. పోర్టల్‌లో వచ్చే ఫిర్యాదుల ఆధారంగా పిల్లలను కిడ్నాప్ చేసే నేరస్థులపై కేసులు నమోదు చేసి..తగిన చర్యలు తీసుకోవచ్చని సూచించింది.

## మాగంటి సునీతకు బిఫామ్

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావు తదితరలు ఉన్నారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక జరుగుతున్నది. ఈ సందర్భంగా కెసిఆర్ వారిని ఆశీర్వదించారు.

## గ్రూప్-2 విజేతలకు 18న నియామక పత్రాలు

ముఖ్యమంత్రి నియామక పత్రాలు అందిస్తారని తెలిపారు. వీరిలో దాదాపు 16 శాఖలకు చెందిన అభ్యర్థులు ఉన్నారని. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులందరినీ ఆహ్వానిస్తున్నట్లు సి.ఎస్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి అభ్యర్థితో పాటు వారి కుటుంబ సభ్యులను సాయంత్రం 4 గంటల లోపు శిల్పకళా వేదికలో అనుమతించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నియామకాల్లో అత్యధికంగా, సాధారణ పరిపాలన, రెవిన్యూ, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన వారే అధికంగా ఉన్నందున, రెవిన్యూ, హోం, జిఎడి కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సి.ఎస్. ఆదేశించారు. నియామక పత్రాలు పొందే అభ్యర్థులు రాబోయే 30 సంవత్సరాలలో సర్వీస్ లో ఉంటారు కాబట్టి, వీరికి ప్రభుత్వ సర్వీస్ పట్ల ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శులు బెనహర్ మహేష్ దత్ ఎక్కా, రిజ్వి, సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు లోకేష్ కుమార్, టీకే శ్రీదేవి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక తదితర అధికారులు పాల్గొన్నారు.

## 'సిట్'కు సహకరించాల్సిందే..

ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. యూజర్, పాస్‌వర్డ్‌ల సమాచారం ఇవ్వాలని జస్టిస్ నాగరత్న ధర్మాసనం ఆదేశించింది. ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో సమాచారం తీసుకోవాలని సిట్‌కు సూచించింది. సమాచారం చెరిపేందుకు యత్నించినట్లు తేలితే తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని కోర్టు పేర్కొంది.

## ప్రభుత్వాధికారిపై కులవివక్ష విషాదకరం

కాదని, దేశంలోని కోట్లాది మంది దళితులకు సంబంధించినదని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఐపీఎస్ అధికారిపై జరిగిన వివక్ష దళితులుగా ఎంత విజయం సాధించినా.. అణచివేత తప్పదనే తప్పుడు సందేశం వారికి వెళ్లేలా చేస్తుందన్నారు. పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారకులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ, సీఎంలను డిమాండ్ చేశారు. బాధిత కుటుంబంపై ఉన్న ఒత్తిడిని తొలగించాలన్నారు. ఇక, ఈ కేసుకు సంబంధించి వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను రాష్ట్ర ప్రభుత్వం సెలవుపై పంపించిన సంగతి తెలిసిందే. ఈ బాధ్యతలను తాజాగా ఓం ప్రకాశ్ సింగ్‌కు అప్పజెప్పింది. కాగా.. ఈ కేసుకు సంబంధించి రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజర్నియాను ఇటీవల బదిలీ చేసిన సంగతి తెలిసిందే.

## సీఎం మాటలు నమ్మలేం: హరీశ్

**హైదరాబాద్(జనంసాక్షి):**గురుకులాకు గ్రీన్ ఛానెల్‌లో నిధులు విడుదల చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూటలేనా..? అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. కమిషన్‌లు రావనే ఆయన గురుకులాలకు నిధులు కేటాయించడం లేదా..? అని విమర్శించారు. హామీలతో మభ్యపెట్టడం, ఆ తర్వాత మాట మార్చడమే రేవంత్ అనుసరిస్తున్న సిద్దాంతమా..? అని నిలదీశారు. ఈ మేరకు హరీశ్‌రావు ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. 'రేవంత్ రెడ్డి మాటలకు, చేతలకు పొంతన ఉండదనడానికి గురుకులాలకు కేటాయించిన చాలీచాలని నిధులే ఉదాహరణ. రాష్ట్రంలోని 1024 గురుకులాలకు కేవలం రూ.60 కోట్లు కేటాయించి, గోరంతను కొండంతగా చెప్పుకోవడం సిగ్గుచేటు. రూ.12 వేల కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు ఏర్పాటు చేస్తామని ప్రచారం చేసుకుంటున్న రేవంత్ రెడ్డికి ఆరున్నర లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బిడ్డలు చదివే గురుకులాలకు కనీసం రూ.100 కోట్లు కేటాయించే మనసు లేదా.' అని ప్రశ్నించారు. 'కమీషన్లు రావనే గురుకులాలకు నిధులు కేటాయించడం లేదా? మీరు కేటాయించిన చాలీచాలని నిధులతో సిబ్బంది వేతనాలు, మోటార్ల మరమ్మతులు, అత్యవసర పనులు ఎలా సాధ్యం? చిత్తశుద్ధిలేని సమీక్షలతో గురుకులాలకు ఏం ప్రయోజనం? ఒకవైపు సమస్యల వలయంలో గురుకులాలు కొట్టుమిట్టాడుతుంటే తూతూమంత్రంగా సమీక్ష నిర్వహించడం దుర్మార్గమన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టేను నిలువరించండి

విషయంలో ఆ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం పాటించిందంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఎంతమేరకు రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంపై సమగ్ర, శాస్త్రీయ అధ్యయనం నిర్వహించామని తెలిపింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే 2024-25లో రాష్ట్ర జనాభాలో 56.33 శాతం మంది బీసీలు ఉన్నట్లు తేలిందని 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు అదే ప్రాతిపదికంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 342-%ూ%(3) కింద దాఖలు పడిన అధికారాలను అనుసరించి ప్రభుత్వం ఈ కసరత్తు చేసిందని ఇలాంటి కసరత్తును రాహుల్ రమేశ్ వాఘ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు సమర్థించిందంది. సమగ్ర కుల సర్వే తర్వాత తెలంగాణ ప్రభుత్వం రిటైర్ట్ ఐఏఎస్ అధికారి వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసి ఆ సర్వే డేటాను విశ్లేషించిందంది. లోతైన అధ్యయనం అనంతరం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆ కమిషన్ చేసిన సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించిందంది. దాన్ని అనుసరించి తెలంగాణ బీసీ రిజర్వేషన్ల బిల్లు-2025ను శాసనసభ, శాసనమండలిలో గత మార్చి 17, 18 తేదీల్లో ఏకగ్రీవంగా ఆమోదించి గవర్నర్ ఆమోదం కోసం పంపామని సుప్రీంకోర్టుకు వివరించింది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి అన్నది కేవలం వివేకపూర్వకమైన నియమం తప్ప అదేమీ రాజ్యాంగపరమైనది కాదని ప్రత్యేక, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులు, స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పుడు ఆ పరిమితికి మించి కేటాయించేందుకు అనుమతించవచ్చని ఇందిరా సాహ్ని తీర్పు పేరా 810లో 9 మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చిందని సుప్రీం కోర్టు దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చింది. 50 శాతం అనేది సాధారణ నియమం అయినప్పటికీ దేశంలో వైవిధ్యం, ప్రజల భిన్నత్వాన్ని దృష్టిలో ఉంచుకొని వారసత్వంగా వచ్చిన కొన్ని అసాధారణ పరిస్థితులను విస్మరించకూడదని మారుమూల ప్రాంతాలు, పల్లెల్లో నివసించే ప్రజలు సాధారణ జనజీవన స్రవంతికి దూరంగా ఉంటారు వారి పరిస్థితులను వేరుగా చూడాల్సిన అవసరం రావచ్చని సర్కారు పేర్కొంది. ప్రత్యేక కేసుగా పరిగణించాలని అటువంటి సందర్భాల్లో నియమాల్లో కొంత సడలింపు ఇవ్వాల్సిన అనివార్యత ఏర్పడవచ్చంది. అలాంటి సందర్భాల్లో అత్యంత అప్రమత్తతతో వ్యవహరించాలని దాన్నే ప్రత్యేక కేసుగా పరిగణించాలని ఆ తీర్పులో కోర్టు చెప్పిందని జనహిత్ అభియాన్ కేసు తీర్పులోని పేరా 172లోనూ అలాంటి అంశమే ఉందని గుర్తు చేసింది. వీటిని దృష్టిలో ఉంచుకొని జీవో జారీ అయ్యిందంది. రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను అసెంబ్లీ ఉభయసభల్లో ఏకగ్రీవంగా ఆమోదించడం ద్వారా వ్యక్తమైన ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది. ఈ జీవోను నిలిపివేస్తూ హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు అస్పష్టతను ఏర్పరిచాయని, ఒకవైపు జీవోపై స్టే విధించిన హైకోర్టు, మరోవైపు ఎన్నికలపై స్టే విధించడంలో సంయమనం పాటించిందంది.

## సుప్రీంలో బీసీలకు న్యాయం జరుగుతుంది

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పాత పద్ధతిలోనే ఎన్నికలు వెళ్లాలంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు బాధాకరమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఎల్‌పీ గురువారం నాడు విచారణకు వస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. సుప్రీం కోర్టులో తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు అన్ని పార్టీలు మద్దతిచ్చాయని, ఇప్పుడు మాట మారుస్తున్నాయని అన్నారు. ఇదిలావుంటే బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ఈ నెల 9వ తేదీన హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో ఈ ఎస్ఎల్‌పీ పిటిషన్ వేసింది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి విధిస్తున్నట్లు రాజ్యాంగంలో ఎక్కడా నిబంధనలు లేవని ఎస్ఎల్‌పీలో తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. సుప్రీంకోర్టు మాత్రమే దాన్నే మార్గదర్శక సూత్రంగా నిర్దేశించిందనీ పిటిషన్ లో పేర్కొంది. ప్రత్యేక సందర్భాల్లో రిజర్వేషన్లు కల్పించవచ్చని ఇందిరా సాహ్ని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, జనహిత్ అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుల్లో సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తుచేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఎంతమేరకు రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంపై సమగ్ర, శాస్త్రీయ అధ్యయనం తెలంగాణలో జరిగిందని.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే 2024-25లో రాష్ట్ర జనాభాలో 56.33శాతం మంది బీసీలు ఉన్నారని తెలిపింది. రాహుల్ రమేశ్ వాఘ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు సమర్థించిందని పేర్కొంది. తమిళనాడు గవర్నర్‌పై ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రస్తావించింది. ప్రభుత్వం శాసనసభలో ఆమోదించి పంపిన బిల్లులకు మూడు నెలల్లోపు గవర్నర్ ,రాష్ట్రపతి ఆమోదం తెలుపకపోతే వాటికి ఆమోదముద్ర వేసినట్లుగానే భావించాల్సి ఉంటుందని.. ఈ విషయాలను పరిగణలోకి తీసుకోవాలంటూ పిటిషన్ లో పేర్కొంది. న్యాయం తమవైపు ఉందని మహేశ్ గౌడ్ అన్నారు. సుప్రీంలో తప్పకుండా అనుకూల తీర్పు వస్తుందని అన్నారు.

## హైకోర్టు స్టే ఏకపక్షం

**హైదరాబాద్(జనంసాక్షి):**బీసీల వాదన వినకుండా తెలంగాణ హైకోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చిందని బీసీ రిజర్వేషన్స్ సాధన సమితి కన్వీనర్ ఆర్.కృష్ణయ్య వ్యాఖ్యానించారు. తామంతా రిజర్వేషన్ల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో నోటికాడ బుక్క ఎత్తిపోయిందన్నారు. ఇది తమను ఎంతగానో ఆందోళనకు గురిచేసిందన్నారు. మంగళవారం బీసీ సంఘాల తెలంగాణ బంద్ పోస్టర్స్‌ని ఆర్.కృష్ణయ్య, కోదండరాం, జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘాల నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్స్‌పై హైకోర్టు స్టే ఇవ్వడంతో న్యాయం జరుగలేదని పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఇచ్చి బీసీల నోటికాడి ముద్దను లాక్కుందని విమర్శించారు. బీసీలకు అవమానం, అన్యాయం జరిగిందని ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సంఘాలు చెప్పిన అంశాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయని టీజేఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. బీసీ బంద్‌కి ఇప్పటికే సంపూర్ణ మద్దతు ప్రకటించామని కోదండరాం పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్స్‌ని అడ్డుకోవద్దని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ నెల 18వ తేదీన నిర్వహించే తెలంగాణ బంద్‌కి సంపూర్ణ మద్దతు తెలపాలని బీసీ జేఏసీ తెలంగాణ జన సమితి నేతలు తమ కార్యాలయానికి వచ్చి అడిగారని తెలిపారు. తమ కంటే ముందే బంద్‌కి కోదండరాం సంపూర్ణ మద్దతు తెలిపారని గుర్తుచేశారు.

## ప్రజా ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా విద్యారంగం

తీసుకొని బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఎంపికైన ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండేలా వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యా హక్కు చట్టం, బెస్ట్ అవైలబుల్ స్కీం ఏం చెబుతుంది, పాఠశాల యాజమాన్యాలు, ప్రభుత్వ యంత్రాంగం మధ్య జరిగిన ఒప్పందం లో ఏ ఏ అంశాలు ఉన్నాయో పాఠశాలల యాజమాన్యాలను పిలిచి వివరించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. బెస్ట్ అవైలబుల్ స్కీం కింద పాఠశాలల వారీగా ఉన్న బకాయిల వివరాలను వెంటనే పంపాలని కలెక్టర్లకు సూచించారు. బకాయిల్లో కొంత మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. విద్యా, వైద్య రంగాలపై జిల్లా కలెక్టర్లు సీరియస్ గా దృష్టి సారించాలని పెండింగ్ బిల్స్ ఏమైనా ఉంటే ఆర్థిక శాఖ దృష్టికి తీసుకురావాలని డిప్యూటీ సీఎం కలెక్టర్లకు సూచించారు. బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులు రాకపోతే కొన్నిచోట్ల పాఠశాలలు మూత వేశారని సమాచారం ఉంది. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులు ఎప్పటికప్పుడు రాకపోతే కొన్ని పాఠశాలలు మూసివేసే పరిస్థితి ఉందని అధికారులు నివేదిస్తున్నారు, కేవలం బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులపై ఆధారపడితే అది ప్రముఖ పాఠశాల ఏ విధంగా అవుతుందని జిల్లా కలెక్టర్లను డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. డీఈవో లు వెంటనే అన్ని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ను సందర్శించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎంత ఉంది? ప్రభుత్వ నిబంధనలు సరిగా పాటిస్తున్నారా? లేదా? ఆయా పాఠశాలల్లో వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నాయి? వెంటనే నివేదిక సమర్పించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. గడిచిన ఏడు సంవత్సరాలుగా బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదివిన విద్యార్థుల వివరాలు సేకరించాలని డిప్యూటీ సీఎం సూచించారు. జిల్లా కలెక్టర్లు, అధికారులు స్వయంగా పర్యవేక్షించి బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కొనసాగుతున్న పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అధికారులను కోరారు. సమావేశంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రానా, సాంఘిక సంక్షేమ శాఖ సెక్రెటరీ బుద్ధ ప్రకాశ్, సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ క్షితిజ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రుల మధ్య విభేదాలు అబద్ధం

బీజేపీ, ఏపీలో టీడీపీ ఉన్నా తమ హక్కులను వదులుకోబోమని స్పష్టం చేశారు. బనకచర్ల, ఆల్మట్టిపై తాము నిబంధనల ప్రకారం ÷ట్ చేస్తున్నామని తెలిపారు. కృష్ణా, గోదావరిలో నీటి వాటాల కోసం తమ ప్రభుత్వం కమిట్‌మెంట్‌తో పనిచేస్తోందని పేర్కొన్నారు. త్వరలోనే తాము మహారాష్ట్ర వెళ్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు. కేసీఆర్ పదేళ్లలో చేసింది ఏమీలేదని ఆక్షేపించారు. కాళేశ్వరం పేరుతో మిగతా ప్రాజెక్టులను కేసీఆర్ పట్టించుకోలేదని ఫైర్ అయ్యారు. కాళేశ్వరం నీళ్లు లేకున్నా... భారతదేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా పంటలు పండాయని నొక్కిచెప్పారు.

## నీటిపాదరుదల శాఖలో 106మంది ఇంజనీర్ల బదిలీ

ఇంజినీర్లను బదిలీ చేసింది. హైదరాబాద్ సర్కిల్ పరిధిలోనే 60 మందికిపైగా ఇంజినీర్లపై బదిలీ వేటు వేయడం గమనార్హం. వీరంతా ఒకేచోట తిష్టవేసి అక్రమలకు పాల్పడుతున్నారని ప్రభుత్వానికి నివేదికలు అందాయి. దీంతో వీరిని బదిలీలతో సమస్యకు చెక్ పెట్టాలని చూస్తోంది.

## బస్సులో 20 మంది సజీవ దహనం

గుర్రైన ప్రయాణికులు తమ ప్రాణాల్ని కాపాడుకునేందుకు హాహాకారాలు చేస్తూ బస్సు నుంచి బయటకు దూకారు. ఆ సమయంలో బస్సులో ఉన్న పలురువురు ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. మిగిలిన ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బస్సు ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు బస్సు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. బస్సు నిర్వహణలో లోపం ఉందా? మంటలు ఎలా చెలరేగాయి? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. కాగా, ఈ పెను ప్రమాదం ప్రైవేట్ బస్సుల భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ప్రయాణికుల ప్రాణాలు కాపాడేందుకు నిరంతర తనిఖీలు, తగిన భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# మల్లోజుల లొంగుబాటు

రాశారు. అందులో మావోయిస్టు పార్టీ విధానాలపై వేణుగోపాల్‌రావు కొంతకాలంగా అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. విప్లవోద్యమాన్ని విజయవంతంగా నడిపించడానికి బహిరంగంగా ప్రజల్లోకి వెళ్లడం మినహా మరో మార్గం లేదంటూ మావోయిస్టు పార్టీకి ఆయన రాసిన మరో లేఖ కలకలం రేపింది. దాని తర్వాత ఆయన మావోయిస్టు పార్టీని వీడారు. అనివార్య కారణాలతో పార్టీని వీడుతున్నానని.. ఇకపై పార్టీలో కొనసాగబోనని ప్రకటించారు. ఈ క్రమంలోనే 60 మందితో కలిసి గడ్చిరోలి పోలీసులకు లొంగిపోయారు. ఆయన రాసిన లేఖలో వివరాలు ఇలా ఉన్నాయి. నిన్నటి పొరపాట్లను విశ్లేషించుకోవడం ద్వారా నేడు, రేపు వాటిని నివారించడం ఎలాగో మనం నేర్చుకుంటాం. తప్పుల నుంచి గుణపాఠాలు తీసుకోవడం రోగం రాకుండా టీకా తీసుకోవడం వంటిది. విప్లవోద్యమాన్ని కూడా అదే తీరుగా నడిపించగలుగుతాం. ఇది నల్లేరు మీద బండిలా సాగే పని ఎంతమాత్రం కాదు. తీవ్రమైన అధ్యయనం, ఓపికతో, త్యాగాలతో కూడిన విప్లవాచరణ' అని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ పేర్కొన్నారు. ఈ మేరకు మావోయిస్టు పార్టీకి ఆయన 22 పేజీలతో కూడిన సుదీర్ఘ లేఖను ఈ నెల 6వ తేదీన విడుదల చేశారు. మావోయిస్టు పార్టీలో తీవ్రమైన అంతర్గత సంక్షోభం ఉన్నదని, ఆయుధ పోరాటాలను తాతాలికంగా విరమించాలని ఆ లేఖలో కోరారు. దశాబ్దాల తరబడి తప్పుడు విధానాలే తీవ్రమైన నష్టాలకు కారణమని, 'సైన్యం తప్ప రహస్య పార్టీ లేదు' అని ఆయన ఖరాకండిగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో తాతాలికంగా సాయుధ పోరాటాన్ని విరమించి, ప్రజల మధ్యకు బహిరంగంగా వెళ్లాలని ఆయన క్యాడర్‌ను కోరారు. పార్టీకి తీవ్ర నష్టాన్ని కలిగించిన మౌలికమైన తప్పిదాలను సరిదిద్దుకోవడానికి సైన్యంతో ఉంటే సాధ్యం కాదని వేణుగోపాల్ స్పష్టం చేశారు. 'విప్లవపార్టీ లేకుండా విప్లవమే లేదు' అనే లెనిన్ సూత్రాన్ని విస్మరించడం వల్ల, మావోయిస్టులకు సైన్యం తప్ప రహస్య పార్టీ లేని స్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రస్తుతమున్న ఏసీ, డీవీసీ వంటి పార్టీ కమిటీలన్నీ పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) వెంట, సైనిక దుస్తులలో సాయుధులుగా ఉండటం బహిరంగ రహస్యమేనని అన్నారు. వీటిని శత్రువుకు అబేధ్యమైన రహస్య పార్టీ నిర్మాణాలుగా పరిగణించలేమని, ఇదే బలహీనత శత్రువుకు పార్టీని నిర్మూలించేందుకు పూర్తి అవకాశాన్ని ఇచ్చిందని పేరొన్నారు. 2007లో జరిగిన పార్టీ కాంగ్రెస్‌లో దండకారణ్యం, బీహార్-జార్ఖండ్‌లలో బేస్ ఏరియాలను నిర్మించే కేంద్ర కర్తవ్యాన్ని చేపట్టడం రెండో వ్యూహాత్మక తప్పిదమని వేణుగోపాల్ విమర్శించారు. పార్టీ బలాన్ని అతిగా అంచనా వేసి, శత్రువు బలాన్ని తకువ చేసి చూశామన్నారు. 2011 నుండే కిందిస్థాయి కామ్రేడ్స్ ఈ తప్పును సరిదిద్దుకోవాలని కోరినప్పటికీ, సీసీ పట్టించుకోలేదని అన్నారు. ఒక దశాబ్దం పాటు నష్టపోయామని తెలిపారు. ఇప్పటికైనా అమరుల రక్తతర్పణం నుండి గుణపాఠాలను తీసుకుందామని పేర్కొన్నారు. రహస్య, చట్టబద్ధ పోరాటాల మధ్య సమన్వయాన్ని కొనసాగించడంలో సెంట్రల్ కమిటీ పూర్తిగా విఫలమైందని ఇది మూడో తప్పిదమని వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. 2006 నూతన అటవీ చట్టం ప్రకారం ప్రభుత్వం ఇచ్చే భూమి పట్టాలను 'బేస్ ఏరియాలు నిర్మిస్తున్నామనే ధీమాతో' వ్యతిరేకించాం. దండకారణ్యంలోని రైతులకు మన జనతన సరార్‌లే పట్టాలిస్తాయని చెప్పాం, కానీ ఆ పట్టాలకు వ్యవస్థలో గుర్తింపు లేదనే ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను విస్మరించామని తెలిపారు. ప్రజలు తమ జీవితావసరాల కోసం అనివార్యమైన ఆధార్ కార్డులు తెచ్చుకోవడాన్ని కూడా పార్టీ వ్యతిరేకించడం, ప్రజలు దొంగచాటుగా ప్రభుత్వ అధికారుల వద్దకు వెళ్లి వాటిని పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేరొన్నారు. 'ఇప్పుడు మనకు సానుకూల మార్పు కావాలి. ఉద్యమాన్ని కాపాడుకోవడం, క్యాడర్‌ను రక్షించుకోవడం కావాలి. అనవసర త్యాగాలకు అంతం పలుకుదాం. నూతన పద్ధతులలో పురోగమిద్దాం. అంతిమ విజయం ప్రజలదే' అంటూ మల్లోజుల తన లేఖను ముగించారు. తాను కేంద్ర కమిటీలో 28 ఏండ్లు, పొలిట్ బ్యూరోలో 18 ఏండ్లు సభ్యుడిగా ఉన్నట్టు మల్లోజుల తెలిపారు. ప్రస్తుతం ఉద్యమం ఎదురొంటున్న వైఫల్యాలకు, భారీ నష్టాలకు నైతిక బాధ్యత వహిస్తూ, యావత్ పార్టీ క్యాడర్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పారు. ఇంతటి నష్టాలకు దారితీసిన నాయకత్వంలో కొనసాగడానికి అనర్హుడిని అని ప్రకటించారు. గతంలో దివంగత ప్రధానకార్యదర్శి కామ్రేడ్ బసవరాజు (నంబాల కేశవరావు) కూడా ప్రభుత్వంతో శాంతి చర్చల ప్రక్రియను ప్రారంభించారని, ఏప్రిల్ 2025 నాటికి ఈ నిర్ణయం అనివార్యమని భావించారని గుర్తు చేశారు.

## సామాజిక న్యాయం కోసం రాహుల్ కృషిచేస్తున్నారు

మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తోందన్నారు. ఎన్నికల చివరి రోజు వరకు కష్టపడాలని కార్యకర్తలకు సూచించారు. పోలింగ్ కేంద్రాల వారీగా మెరుగైన ఫలితాలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్, పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**జూబ్లీహిల్స్ లో బిఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు:మంత్రి పొన్నం**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో భారత రాష్ట్ర సమితి గూబ గుయ్యిమనేట్లు ఓటర్లు తీర్పు ఇవ్వబోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ ఉప ఎన్నికలో ఆ పార్టీ చిరునామా గల్లంతవుతుందని జోస్యం చెప్పారు. పదేళ్లలో ఆ పార్టీ పాలనలో జూబ్లీహిల్స్‌లో ఏం అభివృద్ధి జరిగిందో చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఓడగొట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా సీట్లు ఇచ్చారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బుద్ధి చెప్పారు. జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్ల నమోదుకు భారత రాష్ట్ర సమితి, భాజపాలదే బాధ్యతని అన్నారు. మాగంటి సునీతతో కన్నీరు పెట్టిస్తూ.. గులాబీ పార్టీ ఓట్లు దండుకోవాలని చూస్తోందని పొన్నం విమర్శించారు. ఈ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గట్టి బుద్ధి చెప్పబోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. గత పదేళ్లుగా ఆ పార్టీ పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి పరంగా ఏ మాత్రం ముందుకు సాగలేదని, ఇప్పుడు ప్రజలే ఆ విఫలతకు తీర్పు ఇవ్వబోతున్నారని అన్నారు. పదేళ్ల పాలనలో అభివృద్ధి పేరుతో ఒక్క రోడ్డు సరిచేయలేని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు ఓట్ల కోసం నటన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే ఆ పార్టీకి గట్టి షాక్ ఇచ్చారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలకూ ప్రజలు సరైన పాఠం చెప్పబోతున్నారని ఆయన స్పష్టం చేశారు. ఈసారి ఓటర్లు మోసపోవడం లేదని తీవ్ర విమర్శలు గుప్పించారు.

## ఈడీ అన్ని హద్దులూ దాటుతోంది

రాష్ట్ర పోలీసులు, అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో మార్చిలో ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో సోదాలు జరిపింది. మే నెలలో సంబంధిత అధికారుల ఇళ్లల్లోనూ తనిఖీలు చేసింది. చివరకు ఈ వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరుకుంది. విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఈడీ అన్ని హద్దులు దాటుతోందని, సమాఖ్య పాలన భావనను ఉల్లంఘిస్తోందని ఆక్షేపించింది. టాస్మాక్‌పై జరుగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తుపై స్టే విధించగా.. తాజాగా విచారణ పునఃప్రారంభించింది. ఈ నేపథ్యంలో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం మరోసారి ఈడీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది.

### దుర్గాపూర్ అత్యాచార ఘటన

## ముగ్గురునిందితుల అరెస్ట్

### సహకరించిన వ్యక్తి కూడా..

### నిందితుడి సోదరి ఇచ్చిన సమాచారంతో పోలీసుల చర్యలు



**కోల్‌కతా(జనంసాక్షి):** పశ్చిమబెంగాల్‌లో తీవ్ర కలకలం రేపిన ఒడిశాకు చెందిన ఓ వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటన కేసులో అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు నిందితులతో పాటు వారికి సహకరించిన మరో యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు పారిపోయేందుకు సహకరించిన మరో యువకుడిని మంగళవారం అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. నిందితుడి సోదరి ఇచ్చిన సమాచారంతోనే పరారీలో ఉన్న అతడిని గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. ఐదో నిందితుడు సఫీక్ దుర్గాపుర్‌లోని అందాల్ వంతెన కింద దాక్కున్నట్లు అతడి సోదరి రోజినా తమకు సమాచారం ఇవ్వడంతో అతడిని పట్టుకున్నట్లు తెలిపారు. తన సోదరుడు చేసిన తప్పునకు తగిన శిక్ష అనుభవించాలనే ఉద్దేశంతోనే పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు రోజినా మీడియాకు తెలిపింది. అత్యాచార ఘటనపై బాధితురాలు మాట్లాడుతూ భయానక క్షణాలను గుర్తు చేసుకుంది. శుక్రవారం రాత్రి తన స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లినప్పుడు పలువురు దుండగులు తమను వెంబడించినట్లు తెలిపింది. వెంటనే తాము అడవి వైపు పరిగెత్తుతున్న సమయంలో తన స్నేహితుడు మరో వైపునకు వెళ్లగా..నిందితులు తనను బలవంతంగా అటవీప్రాంతంలోకి లాక్కెళ్లినట్లు పేర్కొంది. ఫోన్‌ను లాక్కొని తన స్నేహితుడికి కాల్ చేయాలని బెదిరించారని.. అతడు రాకపోవడంతో తనపై దారుణానికి పాల్పడ్డారని వెల్లడించింది. తాను ప్రతిఘటించడానికి ప్రయత్నిస్తుండగా..అరిస్తే మరికొంత మందిని పిలుస్తామని నిందితులు బెదిరించారంటూ ఆవేదన వ్యక్తం చేసింది. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ ఘటనలో ఐదుగురు నిందితులను కస్టడీలోకి తీసుకొని..విచారిస్తున్నట్లు వెల్లడించారు. నిందితులను ఘటనా స్థలానికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

సూపరింటెండింగ్ ఇంజినీరు వారి కార్యాలయము, వెస్ట్‌సర్కిల్ హైదరాబాద్
తెలంగాణ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
డిస్ట్రిక్ హాస్పిటల్ ప్రాంగణం, కింగ్‌కోటీ, హైదరాబాద్-500001

Short Tender Notice no:10/SE/TGMSIDC/West Cir-HYD/2023-26/ Dt: 14.10.2025

కింది పనులకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫాం ద్వారా టెండర్లు ఆహ్వానించబడుచున్నవి. 1) వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్‌లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అప్‌గ్రేడేషన్ చేయుట. ఏ)ఉపపని: వికారాబాద్ జీజీహెచ్‌లో అదనపు సౌకర్యాలు కల్పించుట. బి) వికారాబాద్ జీజీహెచ్‌లో ల్యాన్ నెట్‌వర్కింగ్ సిస్టమ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయుట 2) నారాయణపేట్ జిల్లా మద్దూర్‌లోని సీహెచ్‌సీలో 10 కి.వా యూపీఎస్& ఏయిర్ కండిషనర్ ఏర్పాటు చేయుట 3) మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో కూకట్‌పల్లి వద్ద గల యూపీహెచ్‌సీలో మినిహబ్, పోర్టికో ఏరియా, వేయింటింగ్ ఏరియాలో పేషెంట్ అటెండెంట్ షెడ్, మినిహబ్ & యూపీహెచ్‌సీ బిల్డింగ్ మధ్యలో షెడ్ నిర్మించుట. 4) మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో కూకట్‌పల్లి వద్ద గల యూపీహెచ్‌సీలో మొదటి అంతస్తులో మీటింగ్ హాల్‌ను నిర్మించుట. 5) నారాయణపేట్ జిల్లా(పార్ట్ ఏ&బి)లోని నారాయణపేట్‌లో జీజీహెచ్‌లో టీ-డయాగ్నోస్టిక్ హబ్‌ను ఏర్పాటు చేయుట. మిగతా వివరాలు www.tender.telanga na.gov.in చూడగలరు.

DIPR No.9200-PP/CL/ADVT/1/2025-26 సం/- సూపరింటెండింగ్ ఇంజినీరు

# మధుకర్ ఆత్మహత్య కారకులను అరెస్టు చేయాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**బెల్లంపల్లి, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** వేమనపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆత్మహత్యకు కారకులను వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన బెల్లంపల్లి నియోజకవర్గం వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామంలో పర్యటించి ఏట మధుకర్ కుటుంబాన్ని పరామర్శించారు. మధుకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి సంతాపం ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి కార్యకర్తలందరికీ పార్టీ అండగా ఉంటుందని, ఎవరూ భయపడకూడదని, ఏ ఇబ్బంది వచ్చినా వెంటనే పార్టీకి తెలియజేయాలని అన్నారు. ఆత్మహత్య వంటి దురదృష్టకర నిర్ణయాలకు ఎవరూ పాల్పడకూడదని రాంచందర్ రావు భరోసా కల్పించారు. మధుకర్ మరణం చాలా బాధాకరం. ఆకుటుంబ ఆవేదన చూసి తీవ్ర బాధ కలిగిందన్నారు. మధుకర్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. జడ్పీటీసీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి తప్పక విజయం సాధించనుండగా, కాంగ్రెస్ పార్టీ రాజకీయ బెదిరింపులు, పోలీసుల వేధింపుల కారణంగా మధుకర్ ఆత్మహత్య ఘటన జరగడం చాలా బాధాకరం అన్నారు. వేమనపల్లి మండలం బిజెపి అధ్యక్షుడిగా మధుకర్ నీల్వాయి ప్రాంతంలో సేవలందిస్తూ, పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేశారని, ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు మధుకర్ ను వేధించి, పోలీసుల ద్వారా బెదిరించడం, ఆయన కుటుంబాన్ని కూడా బెదిరింపులకు గురి చేశారని, బిజెపిలో తిరగొద్దని మధుకర్ ను బెదిరించారని, ఈ కుట్రలో ప్రధానంగా బాధ్యులు కాంగ్రెస్ నాయకులే అన్నారు. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వ్యక్తులను ఇప్పటివరకు పోలీసులు అరెస్ట్ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులతో ఉన్న సత్సంబంధాలు, రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే చర్యలు తీసుకోవడం లేదన్నారు. మంచిర్యాల జిల్లా చుట్టుపక్కల ప్రాంతాల్లో బిజెపి కార్యకర్తలపై వేధింపులు కొనసాగుతున్నాయని, తప్పుడు కేసులు పెట్టి జైలులో పెడుతున్నారని ఆరోపించారు. బిజెపి కార్యకర్తలపై వేధింపులు జరిగితే పార్టీ ఊరుకోదన్నారు. కార్యకర్తలందరూ అప్రమత్తంగా ఉండాలని, కాంగ్రెస్ పార్టీ బెరింపులకు భయపడవద్దని, ఎవరూ ఆత్మహత్యకు పాల్పడవద్దని, బిజెపి కార్యకర్తలకు పార్టీ పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ఘటనలో పాత్ర ఉన్న పోలీసు అధికారులపై తగిన చర్యలు తీసుకోని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అరాచకాలు, అన్యాయానికి వ్యతిరేకంగా బిజెపి పోరాటం కొనసాగుతుందని తెలిపారు. మధుకర్ ఆత్మహత్య ఘటనపై రామగుండం పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు చేస్తున్నామని వివరించారు. ఏ కార్యకర్తకు కూడా ఇలాంటి పరిస్థితి రావద్దని, కాంగ్రెస్ పార్టీ నాయకులు బిజెపి కార్యకర్తలకు హాని తలపెట్టాలని చూస్తే, బిజెపి ఊరుకోబోదని హెచ్చరించారు. ఆయన వెంట బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వి సుభాష్, భరత్, మాజీ పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు బోర్లకుంట వెంకటేశ్ నేత, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్,సీతారాం నాయక్, పద్మా రావు, కొయ్యల ఏమాజీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# విశాఖిలో గూగుల్ అడుగు

- ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఏపీ ఒప్పందం

**న్యూఢిల్లీ, అక్టోబర్14 (జనంసాక్షి) :** విశాఖపట్నంలోకి గూగుల్ అడుగుపెడుతోంది. ఐటి హబ్గా విశాఖను అభివృద్ధి చేస్తామన్న సిఎం చంద్రబాబు ఆ మేరకు గూగుల్‌తో మొదలు పెట్టారు. 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఢిల్లీలో గూగుల్‌తో చారిత్రక ఒప్పందం కుదుర్చుకుంది. తాజ్‌మాన్‌సింగ్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ, కమ్యూనికేషన్ల శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్, గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే, గూగుల్ క్లౌడ్ ఆసియా పసిఫిక్ విభాగం అధ్యక్షుడు కరణ్ బజ్వాలు పాల్గొన్నారు. వైజాగ్‌ను ఏఐ సిటీగా మార్చేందుకు పునాది వేసే ఈ ప్రాజెక్టు ద్వారా గూగుల్ సుమారు 15 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. ఆసియాలో ఆ సంస్థ ఏర్పాటు చేస్తున్న అతి పెద్ద ప్రాజెక్టు ఇదే. ఈ ప్రాజెక్టు ద్వారా 2028-32 మధ్య రాష్ట్ర స్థూల ఉత్పత్తికి ఏటా రూ.10,518 కోట్లు సమకూరుతుందని, 1,88,220 ఉద్యోగాల కల్పనకు అవకాశం ఏర్పడుతుందని అంచనా. గూగుల్ క్లౌడ్ ఆధారిత కార్యక్రమాల ద్వారా ఏటా రూ.9,553 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.47,720 కోట్ల ఉత్పాదకత జరుగుతుందని అంచనా వేస్తున్నారు.

# గాడిద చర్మం నుంచి ఔషధాల తయారీ

- పాక్ నుంచి 2వేల గాడిదలు కొన్న చైనా

**లాహోర్, అక్టోబరు14 (జనంసాక్షి) :** చైనా తాజాగా పాకిస్థాన్ నుంచి రెండు వేల గాడిదలను కొనుగోలు చేసింది. పాకిస్థాన్ నుంచి చైనా అత్యధికంగా గాడిదలను దిగుమతి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో 2024లో ఈ రెండు దేశాల మధ్య డీల్ కుదిరింది. ఈ డీల్ ప్రకారం చైనాకు పాకిస్థాన్ 20 వేల గాడిదలను ఎగుమతి చేయాలి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌లోని కరాచీ పోర్ట్‌కు సమీపంలో ఓ భారీ కబేళాను నిర్మించాలని చైనా భావిస్తోంది. పాకిస్థాన్‌లో ప్రస్తుతం 52 లక్షల గాడిదలు ఉన్నాయి. ప్రపంచంలో అత్యధిక గాడిదలను కలిగిన మూడో దేశంగా పాకిస్థాన్ ఉంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ గాడిదలను దిగుమతి చేసుకునేందుకు చైనా గతేడాది ఒప్పందం కుదుర్చుకుంది. గాడిద చర్మంతో చైనాలో సాంప్రదాయ ఔషధాలను తయారు చేస్తారు. గాడిద చర్మాన్ని ఉపయోగించి ఎజియావో అనే సాంప్రదాయ ఔషధాన్ని చైనీయులు తయారు చేస్తారు. ఈ ఔషధం రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి, అలసట, కణితులను తగ్గించడానికి, రక్తహీనత చికిత్సకు సాయపడుతుందని చైనీయులు నమ్ముతారు. ఎజియావో ఔషధానికి చైనాలో భారీ డిమాండ్ ఉంది . అయితే ఈ ఔషధ తయారీకి తగినన్ని గాడిదలు చైనాలో లేవు. దీంతో గాడిదల కోసం పాకిస్థాన్‌పై ఆధారపడుతున్నారు. అయితే చైనా డీల్ కారణంగా పాక్‌లో గాడిదలకు విపరీతమైన డిమాండ్ పెరిగిందని సమాచారం. ఐదేళ్ల క్రితం ఒక్కో గాడిద ఖరీదు రూ.30 వేలుగా ఉండేదట. ప్రస్తుతం పాక్‌లో ఒక్కో గాడిద ఖరీదు రూ.2 లక్షలకు పైగా పలుకుతోందట. దీంతో గాడిదలను ఉపయోగించి పనులు చేసుకుని పాక్ వాసులు కష్టాలు పడుతున్నారట.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు 1950 హెల్ప్‌లైన్

- జాతీయ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (ఎన్‌జీఆర్ఎస్) ఏర్పాటు

**హైదరాబాద్, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక 1950 హెల్ప్‌లైన్, జాతీయ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (ఎన్‌జీఆర్ఎస్) ఏర్పాటు చేశారు. 1950 హెల్ప్‌లైన్ ద్వారా ప్రజలు ఓటర్ల జాబితా, పోలింగ్ సెంటర్లు, ఎపిక్ కార్డులు, మోడల్ కోడ్ ఉల్లంఘనలు, ప్రలోభాల అంశా లు మొదలైన వాటికి సంబంధించిన సమా చారం పొందడమే కాకుండా, ఫిర్యాదులు నమోదు చేయవచ్చు. 1950 హెల్ప్‌లైన్ కు ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచి ఇప్పటి వరకు 433 కాల్స్ రాగా 379 కాల్స్‌కు సమాధానం ఇచ్చారు.

# పెద్దవంగరలో చేపలు మృత్యువాత



**పెద్దవంగర, అక్టోబర్ 14(జనం సాక్షి) :** పెద్దవంగర మండల కేంద్రానికి చెందిన ఏడవెల్లి మధు,రమేష్,శ్రీను, కృష్ణ,బొత్తల తండాకు చెందిన సోమన్న, బాలాజీ, యాకన్న రాజన్న అనే రైతులు చిన్న చిన్న కుంటలు తీసి కొర్రమీను చేపలను పెంచుకుంటున్నారు. అయితే సోమవారం ఉదయం మూడు గంటల సమయంలో వర్షం పడటంతో నీటి కుంటలో ఉన్నట్లుండి ఒక్కసారిగా చేపలన్నీ చనిపోయి నీటి పై తేలాడుతున్నాయి. మంగళవారం తెల్లవారే సరికి ప్రత్యక్షమైన ఈ సంఘటనను చూసిన తండా వాసులు విస్మయం వ్యక్తం చేశారు. చేపల మృతికి కారణాలు తెలియడం లేదు. చెరువులో ఎవరైనా ఏదైనా విషమందు కలిపారా, చేపల మృతికి ఏదైనా చల్లారా అని తండా వాసులు అనుమానిస్తున్నారు. మంగళవారం చనిపోయిన చేపలను, కలుషితమైన నీటిని పరీక్షలకు పంపిస్తామని, వైద్యుల సూచనల మేరకు చెరువు పరిశుభ్ర చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు గుగులోత్ సోమన్న విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

# బీసీ రిజర్వేషన్లపై 17న చలో రాజ్‌భవన్

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీసీ రిజర్వేషన్ల సాధన కోసం 17న చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. కేంద్రం వెంటనే 42 శాతం రిజర్వేషన్లు అమలు బిల్లును ఆమోదించాలని, పార్లమెంట్‌లో చట్టాన్ని తీసుకురావాలని, 9వ షెడ్యూల్‌లో రిజర్వేషన్ల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న చలో గవర్నర్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు, బీసీ వర్గాలకు, సామాజిక శక్తులకు, సంస్థలకు, వ్యక్తులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర శాసనసభలో బీసీ రిజర్వేషన్ల బిల్లును బీజేపీ ఆమోదిస్తూనే కేంద్రంలో మాత్రం అడ్డుకుంటున్నదని, ఆ పార్టీ నాయకులు, ఎంఎల్‌ఏలు, ఎంపీలు, కేంద్ర మంత్రులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలేదని, రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసి అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించి గవర్నర్‌కు, రాష్ట్రపతికి పంపితే ఉద్దేశ్యపూర్వకంగానే ఎలాంటి ఉత్తర్వులు రాకుండా, బీసీలకు రిజర్వేషన్లు అమలుకాకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటున్నటున్నదని తెలిపారు. దీని ఫలితంగా స్థానిక సంస్థలు ఎన్నికలు కూడా వాయిదాపడ్డాయని, ఈబిల్లుపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా లీగల్‌గా సుప్రీంకోర్టులో పోరాడుతూనే, అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వంపై పోరాడితేనే సమస్య పరిష్కారమవుతుందని, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18న జరిగే రాష్ట్రబంద్‌కు మద్దతు ఇవ్వాలని బీసీ జేఏసీ నేతలు సీపీఐ(ఎం) ఆఫీసుకు వచ్చిన మెమోరాండం ఇచ్చి కోరారు. ఈ బంద్‌కు స్పష్టమైన డిమాండ్స్‌ను పెట్టాల్సిన అవసరముందని, పార్లమెంట్‌లో బిల్లును, రాష్ట్రంలో ఆర్డినెన్స్‌ను ఆమోదించకుండా అడ్డుకుంటున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని నిరసిస్తూ బంద్‌కు పిలుపునిస్తే జయప్రదానికి సంపూర్ణ మద్ధతునిస్తుందని తెలియజేశామని, అలా కాకుండా కేంద్ర బిజెపి ప్రభుత్వంపై పోరాటం చేయకుండా, ఈ కార్యక్రమం తీసుకుంటే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం సీపీఐ(ఎం) పార్టీ స్వతంత్రంగానే పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు.


# మాగంటి సునీతపై అనుచిత వ్యాఖ్యలు

- మహిళలకు పొన్నం, తుమ్మల క్షమాపణలు చెప్పాలి
- ఎమ్మెల్సీ తాతా మధు డిమాండ్

**హైదరాబాద్, అక్టోబరు14 (జనంసాక్షి) :** 'మీరు చనిపోతే మీ భార్యలు ఏడవరా..?' అని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు మండిపడ్డారు. వాళ్లు చనిపోతే వాళ్ల భార్యలు ఏడుస్తారో లేదో మంత్రులే చెప్పాలన్నారు. తెలంగాణ మహిళలకు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతో మంత్రులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు వెన్నులో వణుకుపుడుతోందని అన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ మహిళా లోకాన్ని అవమానించే విధంగా, చిల్లరగా మాట్లాడారని తాతా మధు విమర్శిం చారు. ఇలాంటి నికృష్టమైన మంత్రులు తెలంగాణలో ఉండటం దురదృష్టకరమన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ చనిపోతే అందరూ సానుభూతి చూపారని, కానీ ఇలా నీచంగా మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్.. మేయర్ విజయలక్ష్మిని, విజయారెడ్డిని పక్కన పెట్టుకుని మాగంటి సునీతపై కామెంట్స్ చేశారని మధు మండిపడ్డారు. పాలేరు ఉప ఎన్నికల్లో తుమ్మల నాగేశ్వరరావు.. రాంరెడ్డి వెంకట్ రెడ్డి సతీమణి సుచరితపై గెలిచారని గుర్తుచేశారు. ఆడబిడ్డలు, భర్తలు చనిపోయిన వారిని అవమానించే విధంగా మంత్రులు మాట్లాడారని ఆరోపించారు.

# బిఆర్ఎస్‌లోకి పలువురు చేరిక

- కండువా కప్పి ఆహ్వానించిన కెటిఆర్



**హైదరాబాద్, అక్టోబ రు 14 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్‌లోకి చేరికలు ఊపందు కున్నాయి. నియోజక వర్గంలో ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అలీ మస్కతి, టీడీపీ సీనియర్ మహిళా నేత షకీలా రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పనిచేయాలనే లక్ష్యంతోనే పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. మస్కతి, షకీలారెడ్డి చేరికతో నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతమవుతుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ చేరికల సందర్భంగా కేటీఆర్‌తో మాజీ మంత్రులు మల్లారెడ్డి, కొప్పుల ఈశ్వర్, పార్టీ నాయకులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, రాజీవ్ సాగర్, తుంగబాలు తదితరులు ఉన్నారు.

# బనకచర్లపై ఏపీని నిరోధించండి

- కేంద్రానికి మరోమారు తెలంగాణ లేఖ

**హైదరాబాద్, అక్టోబరు14 (జనంసాక్షి) :** పోలవరం- బనకచర్ల లింకు ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వాన్ని నిలువరించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాశారు. బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో గతంలోనే ఫిర్యాదు చేసినట్లు లేఖలో గుర్తు చేశారు. డీపీఆర్ తయారీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే, నిబంధనలు, విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల లింక్ ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డులకు లేఖ రాసింది. తాజాగా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. పోలవరం - బనకచర్ల విషయంలో ఏపీ ముందుకెళ్లకుండా నిలువరించాలని కోరారు. టెండర్, భూసేకరణ విషయంలో ముందుకెళ్లకుండా చూడాలని కోరారు.


# డిగ్రీ సెమిష్టర్ ఫీజులు తగ్గించాలి

- కెయూలో విద్యార్థుల ఆందోళన

**హనుమకొండ, అక్టోబరు14 (జనంసాక్షి) :** కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాలలో చదువుతున్న డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు పెంచిన మొదటి సెమిస్టర్ ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు కేయూలో ఆందోళన చేపట్టారు. కేయూ పరిపాలన భవనం ఎదుట బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. యూనివర్సిటీ ఇచ్చిన ఫీజు పట్టికను అనుసరించకుండా అధిక ఫీజులు తీసుకుంటున్న ప్రైవేటు డిగ్రీ కాలేజీపై చర్యలు తీసుకోవాలని డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్(డీఎస్ఏ) డీఎస్ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ విడుదల చేసిన మొదటి సెమిస్టర్ ఫీజు ప్రకటనలో భారీగా మార్పులు జరిగాయని విద్యార్థుల తల్లిదండ్రులు పేద మధ్యతరగతి కుటుంబాలని వారు పొద్దున లేస్తే ఎర్రని ఎండలో పనిచేస్తూ వాళ్ల పిల్లలు బాగా చదువుకోవాలని ఆశతో డిగ్రీలు చదివిస్తుంటే యూనివర్సిటీ అధికారులు మాత్రం ఏమాత్రం కనికరం లేకుండా భారీగా ఫీజులు పెంచుతుంటే పేద కుటుంబాల విద్యార్థులు ఎలా చదువుకోవాలని ప్రశ్నించారు. ఇంతకుముందు ఉన్న రిజిస్ట్రేషన్ ఫీజు రూ.80 ఇప్పుడు ఏకంగా రూ.1200 పెంచడం సిగ్గుచేటని, వివిధ రకాల పేర్లతో మొత్తం ఫీజు విద్యార్థులు కట్టాల్సింది రూ.1340 కానీ ఇప్పుడు రూ.3250 పెంచడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. వెంటనే పెంచిన ఫీజులు మొత్తం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు సంజయ్, జాషువా రాజ్‌కుమార్, శశిధర్, శ్రీధర్, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

# బిసి రిజర్వేషన్లు అడ్డుకున్న బిజెపి, బిఆర్ఎస్

- అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో తట్టుకోని బిఆర్ఎస్
- మంత్రి కొండా సురేఖ మండిపాటు



**వరంగల్, అక్టోబరు 14 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీల నేతలు కలిసి స్థానిక ఎన్నికలని అడ్డుకున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్‌కి కట్టుబడి 42శాతం రిజర్వేషన్లు ఇస్తున్నామని.. తెలంగాణ అసెంబ్లీలో చర్చ జరిపి ఆమోదించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా తూర్పు నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ నిధులు అందించామని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం రూ.200 కోట్ల నిధులను తమ ప్రభుత్వం కేటాయించిందని ప్రకటించారు మంత్రి కొండా సురేఖ. త్వరలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకి భూమి పూజ చేస్తామని వివరించారు. అర్హులైన లబ్ధిదారు లందరికీ రేషన్ కార్డులు అందించామని స్పష్టం చేశారు. త్వరలోనే వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రారంభోత్సవం చేస్తామని వెల్లడించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట వేశామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

# లోన్ పేరుతో సైబర్ మోసం

- దాదాపు 8లక్షలు పోగొట్టుకున్న వ్యక్తి

**హైదరాబాద్, అక్టోబరు14 (జనంసాక్షి) :** సైబర్ మోసాల ఎంతగా అవగాహన కల్పిస్తున్న ప్రజలు మోసపోతునే ఉన్నారు. తాజాగా హైదరాబాద్‌లోని బేగంపేటలో ఓ వ్యక్తిని సైబర్ కేటుగాళ్లు మోసగించారు. ఈ కేసుకి సంబంధించిన వివరాలను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం వెల్లడించారు. హైదరాబాద్‌లో ఫేక్ ఎన్జీవో లోన్ స్కామ్ వెలుగులోకి వచ్చింది. ఈ స్కాంలో రూ.7.9 లక్షలు బేగంపేటకు చెందిన 30 ఏళ్ల వ్యక్తి మోసపోయాడు. వాట్సాప్ కాల్‌లో ఫౌండర్ సల్మాన్ ఖాన్ డీపీతో ఓ వ్యక్తి రూ.50 లక్షల లోన్ హామీ ఇచ్చాడు. మొదటగా రూ.10 లక్షలు కట్టాలని అడిగాడు. ఆ తర్వాత లోనుకి కావాల్సిన పైసలు ఇస్తానని నమ్మబలికాడు. ఇది నిజమనుకున్న బాధితుడు రూ.7.9లక్షలు కట్టాడు. ఆ తర్వాత బాధితుడిని నేరగాళ్లు మోసం చేశారు. చివరికి మోసపోయినట్లు గ్రహించి బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అపరిచిత వ్యక్తుల లోన్ ఆఫర్లను నమ్మవద్దని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు. ముందస్తు ఫీజులు, టాక్స్‌లు కట్టవద్దని తెలిపారు. సెలబ్రిటీ డీపీలు లేదా అనుమానాస్పద అకౌంట్లపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ధ్రువీకరించిన రిజిస్టర్ సంస్థల ద్వారా మాత్రమే లోన్ అభ్యర్థించాలని సూచించారు. సైబర్ క్రైమ్ మోసం జరిగితే డయల్ - 1930 ద్వారా లేదా ఫిర్యాదు చేయాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.

# ఒప్పంద సేవల పద్ధతిలో పోస్టుల భర్తీ

- ఈ నెల 18 న వాక్ -ఇన్ ఇంటర్వ్యూ
- జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షకులు డా. ఎం.కోటేశ్వర్

**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 14 (జనంసాక్షి) :** తెలంగాణ వైద్య విధాన పరిషత్, జిల్లా ఆసుపత్రుల ప్రధాన అధికారి కార్యాలయం పరిధిలోని ఆసుపత్రులలో ఒప్పంద సేవల పద్ధతిన పని చేసేందుకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం పర్యవేక్షకులు డా. ఎం.కోటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. 8 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు (2 జనరల్ మెడిసిన్, 1 గైనకాలజిస్ట్, 2 అనస్తీషియాలజీ, 1 పల్మనరీ మెడిసిన్, 2 పీడియాట్రిక్స్) పోస్టులు భర్తీ చేయడం జరుగుతుందని, అభ్యర్థులు ఎం.బి.బి.ఎస్. తో పాటు సంబంధిత స్పెషలిటీలో డిగ్రీ / డిప్లమా కలిగి ఉండి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లో నమోదు కాబడి ఉండాలని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 18వ తేదీ ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఎఫ్ - 24 లో గల జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయంలో పూర్తి ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని, ఇతర వివరాలకు **www.mancherial.telangana.gov.in** వెబ్ సైట్ లో సంప్రదించవచ్చని తెలిపారు.

# తక్కువ ధరకు బంగారమంటూ మోసం

- స్థానికుల నుంచి రూ.45 లక్షలు కాజేసిన కిలేడి
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

**పాలకుర్తి, అక్టోబర్ 14(జనంసాక్షి) :** తన ఇంట్లో లంకె బిందెలు ఉన్నాయని, దానిలోని బంగారం తక్కువ ధరకే ఇస్తానంటూ స్థానికులను బురిడి కొట్టించి లక్షలు కాజేసిన ఘటన మం డలంలోని గూడూరు జరిగింది. బాదితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలం లోని గూడూరు గ్రామానికి చెందిన సింగపురం గౌరమ్మ అనే మహిళ ఇటీవల గ్రామంలో కొత్త ఇల్లు నిర్మించుకుంది. ఇంటి నిర్మాణానికి పెద్ద మొత్తంలో ఖర్చు కాగా, తమ ఇంట్లో లంకె బిందెలు ఉన్నాయని నమ్మించి ఆమాయకుల నుంచి డబ్బులు వసూలు చేయాలని పథకం పన్నింది. అదే క్రమంలో గ్రామానికి చెందిన మంద రజిత. కొండపర్తి గౌతమిలను తన మాస్టర్ ప్లాన్ను ఎంచుకుంది. వారిని కలిసి తాను కొత్తగా నిర్మించుకున్న ఇంటిలో లంకె బిందెలు దొరికాయని దానిలో పెద్ద మొత్తంలో బంగారం దొరికిందని తెలిపింది. మీరు ఆప్తులు కాబట్టి మార్కెట్లో ఉన్న ధర కంటే తక్కువ ధరకు బంగారం ఇస్తానని మీ అదృష్టం మారుస్తానని ఇరువురి మహిళలను నమ్మబలికింది. బంగారం పై ఆశతో అమాయక మహిళలు అందిన కాడల్లా అప్పులు చేసి రూ. 45 లక్షలను గౌరమ్మకు ముట్టచెప్పారు. మంద రజిత రూ.20 లక్షలు, కొండపర్తి గౌతమి నుంచి గౌరమ్మ రూ. 25 లక్షలు కాజేసింది. డబ్బులు ఇచ్చిన తర్వాత బంగారం కోసం మూడు నెలల నుంచి నిత్యం అడుగుతుంటే దాటవేసే సమాధానాలు చెప్తూ కాలం వెల్లదీసింది. ఏదో ఒకటి చెబుతూ వెళ్లబుచ్చుతుంది. దీంతో మోసపోయామని భావించిన మహిళ మంద రజిత మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించారు. తమకు జరిగిన అన్యాయంపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కాగా గౌరమ్మపై గతంలోనూ స్థానిక పోలీస్‌స్టేషన్లో పలు కేసులు ఉన్నాయని తెలిసింది.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
15 అక్టోబర్ 2025

# విప్లవోద్యమ ఆచరణపై ప్రజల్లో ఆందోళన

ఐదున్నర దశాబ్దాలుగా దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని సాయుధ పోరాటం రూపంలో కొనసాగిస్తున్న సీపీఐ మావోయిస్టు పార్టీలో ఇటీవల తలెత్తిన గందరగోళం చివరకు సైద్ధాంతిక విభేదంగా తెరమీదకు వచ్చింది. ప్రస్తుత భారత సమాజ స్వభావాన్ని నిర్ధారించడంలో రెండు రకాల వాదనలు తీవ్ర స్థాయిలోనే జరుగుతున్నాయి. అర్ధ వలస, అర్ధ భూస్వామ్య విధానమేనన్న భావనతో ఎంచుకున్న దీర్ఘకాల సాయుధ ప్రజాయుద్ధమే సరైన పోరాట పంథా అనేది మెజారిటీ ప్రజల వాదన. గ్రామాలు మొదలు మొత్తంగానే దేశంలోని సామాజిక పరిస్థితులు వేర్వేరు రూపాల్లో పెట్టుబడిదారీ లక్షణాలను సంతరించుకున్నందున దీర్ఘకాల ప్రజాయుద్ధం పనికిరాదని, దీనితో ఆశించిన ఫలితాలు రావని, ఆయుధాలను వదిలేయడమే ఉత్తమం అన్నది మల్లోజుల వాదన. ఈ రెండు వాదనలు విప్లవ శ్రేణులనే కాక వారిని గుండెల్లో పెట్టుకుంటున్న ప్రజానీకం, మేధావులనూ అయోమయానికి గురిచేసింది. మావోయిస్టు పార్టీని నిషేధించినా, ఎన్ కౌంటర్ల పేరుతో చంపివేసే ఘనటలు నిత్య, జరుగుతున్న ప్రాణం మీద భయం ప్రజల్లో ఏ మాత్రమూ లేదు. యాభై ఏండ్లలో ప్రతి ఇంటి నుంచి ఒకరిని ఉద్యమంలోకి పంపిన గ్రామాలు వందల్లోనే ఉన్నాయి. నిజమైన ప్రజాస్వామ్య పునరుద్ధరణలో ప్రజలను భాగం చేయడమెలా అనే మేధోమదనం జరుగుతున్నది. మావోయిస్టు పార్టీ అగ్ర నాయకత్వం కూడా పోరాట వైఖరినే తీసుకోవాలన్నది ప్రజల వాదన. నిరంకుశ రాజ్యానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించడం, భాగస్వాముల్ని చేసి ఉద్యమాన్ని బలోపేతం చేయడం నేటి అవసరంగా మారిందని ప్రజలు భావిస్తున్నారు.



ఇంకెంతమాత్రం సాయుధ పోరాటం అవసరం లేదని వాదిస్తున్న మావోయిస్టు పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడైన మల్లోజుల వేణుగోపాల్ ఇప్పటికే 22 పేజీల లేఖలో తన భావాలను వ్యక్తం చేశారు. ఈ అభిప్రాయాలపై ఏకాభిప్రాయాలు, భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న మేధావులు, మాజీ మావోయిస్టులో రెండు గ్రూపులుగా విడిపోయారు. ఈ వాదనకు కొనసాగింపుగా మల్లోజుల వేణుగోపాల్ తన వాదనతో ఏకీభవిస్తున్న సుమారు 60 మందితో మహారాష్ట్ర పోలీసుల ముందు గడ్చిరోలిలో మంగళవారం (అక్టోబరు 14, 2025) లొంగిపోయినట్లు ప్రసార మాధ్యమాల ద్వారా వార్తలు వస్తున్నాయి. చత్తీస్ గడ్ డిప్యూటీ సీఎం విజయ్ శర్మ సైతం మల్లోజుల లొంగుబాటును ధృవీకరించారు. ఆయుధాలను వదిలేసినట్లు స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో నిరాయుధ పోరాటాన్ని తన 22 పేజీల లేఖలో పేర్కొన్నట్లు ఎలా కొనసాగిస్తారనేది చర్చనీయాంశంగా మారింది.

నిరాయుధ పోరాట మార్గాన్ని సూచించిన మల్లోజుల వేణుగోపాల్ చివరకు పాలకుల ముందు మోకరిల్లాడు. ఆయన భవిష్యత్తు కార్యాచరణ ఏంటో తేలిపోయింది. ప్రజల దైనందిన సమస్యలకు పరిష్కారం, పాలకవర్గాల నిరంకుశ ధోరణికి వ్యతిరేకంగా కొట్లాడే పోరాట రూపం ఎలా ఉండాలనే అంశంలో తలెత్తుతున్న సందేహాలకు సమాధానాలు దొరకడంలేదు. ప్రజలు వారి సమస్యలను చెప్పుకోడానికి మార్గం లేకుండా పోయింది. ఇలాంటి పరిస్థితుల్లోనే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాష్ట్రం ఏర్పడితే కొన్ని ఇబ్బందులు తొలగిపోతాయని భావించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 ఏండ్లు అవుతున్నా అనుభవిస్తున్న నిర్బంధ, నిరంకుశ, పెత్తందారీ ధోరణులతో 'మళ్ళీ అన్నలు వస్తే బాగుండు.. మా దగ్గర ఉద్యమం ఉంటే బాగుండు.. వారికి భయపడి కనీసం స్థానిక బూర్జువా పార్టీ నాయకులు అదుపులో ఉంటారు..' అనే మాటలూ వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా రేవంత్ రెడ్డి నిజామాబాద్ లో జరిగిన రైతుల సభలో "అన్నలు రావాలని రైతులే కోరుకుంటున్నారు.." అంటూ తన మనసులోని మాటను వెలిబుచ్చారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీని తీవ్రవాద పార్టీగా, ఆ పార్టీ నేతలను తీవ్రవాదులుగా ప్రకటించి నిర్బంధం అమలు చేస్తున్నది. ఆపరేషన్ కగార్ లో భాగంగా 80 ఎన్ కౌంటర్లలో700 మందిని ఏడాదిన్నర కాలంలో నేతలను భౌతికంగా నిర్మూలించింది. మావోయిస్టు పార్టీ ఏడు నెలలుగా శాంతి చర్చల కోసం ఎన్నో విధాలా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ హత్యాకాండనే నమ్ముకున్న బీజేపీ ప్రభుత్వం చర్చలను, ప్రజాస్వామ్య స్ఫూర్తిని ధిక్కరించి కగార్ హత్యలను కొనసాగిస్తున్నది.

ప్రజాస్వామ్యంలో అన్ని వ్యవస్థలూ రకరకాలుగా కుదేలైన పరిస్థితుల్లో ప్రజలకు న్యాయం దొరకడం గగనంగా మారింది. నిస్సహాయులుగా ఉన్న ప్రజలకు ఆత్మహత్యలే మార్గం అవుతున్నాయి. ప్రతీ ఆత్మహత్యకు ప్రభుత్వాలదే బాధ్యత. ప్రభుత్వ వైఫల్యాలే ఇందుకు కారణం. దీంతో ఉద్యమాల ద్వారానే పరిష్కరించుకోవాలనే ఆలోచనలు ఉధృతమవుతున్నాయి. అభివృద్ధి పేరుతో వ్యవసాయ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటూ ఉంటే నాయకత్వమే లేకపోయినా ప్రజలు వారంతట వారుగా రోడ్డెక్కి పోరాడుతున్నారు. బూర్జువా పార్టీల స్థానిక నాయకులు పెత్తనం చెలాయించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు రైతులు, మహిళలు, కార్మికులు.. ఇలా వివిధ సెక్షన్ల ప్రజలు పోరుబాట ఎంచుకుంటున్నారు. కొత్త తరాన్ని ఉద్యమంలోకి నడిపించాల్సిన నాయకత్వం లేని వెలితి స్పష్టంగా కనిపిస్తున్నది.

ప్రజలను చైతన్యవంతం చేయడం, వారిని ఉద్యమాల్లో భాగస్వామ్యం చేయడం ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.. ఉద్యమ పార్టీలు సక్సెస్ అవుతాయి. రెండు తెలుగు రాష్ట్రాలను దాటి 18 రాష్ట్రాల్లో తన ప్రభావాన్ని చూపడమంటేనే పార్టీ ఎంచుకున్న పంథా సరైన దారిలో ఉన్నదని, ప్రజలు దానికి మద్దతు పలికారన్నది నిర్వివాదాంశం. దివంగత ప్రధాని మన్ మోహన్ సింగ్ మొదలు నేటి ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వరకు మావోయిస్టు పార్టీని దేశ అంతర్గత భద్రతకు అత్యంత ప్రమాదకారి అని వ్యాఖ్యానించారు. మొక్కగా ఉన్న జనతన సర్కార్ వ్యవస్థను నడిపిన తర్వాత ఇప్పుడు సైద్ధాంతిక విభేదాల పేరుతో పార్టీలో అంతర్గత సంక్షోభానికి, ప్రజల్లో గందరగోళానికి దారితీయడం ఒకింత ఆందోళన కలిగించే అంశం. ఇన్ ఫార్మర్లు, కోవర్టు ఆపరేషన్ల డ్రైవ్ ను పాలకవర్గాలు ఉధృతం చేశాయి. దీనికి తోడు అందుబాటులో ఉన్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్నీ వాడుకున్నాయి. కగార్ నిజంగా న్యాయమైనదే అయితే కేంద్రం ఈ అన్ని ఎన్ కౌంటర్లపై నిష్పాక్షిక దర్యాప్తుకు అంగీకరించేది. సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల నేతృత్వంలో కమిషన్లు వేసి విచారణ జరిపించగలిగేది.

నాయకత్వం చేయి అందించినా, వదిలించుకున్నా ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం కొట్లాడడం, వారి చైతన్యం మేరకు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటాలు చేయడం అనివార్యం. పదేండ్లకు పైగా తెలంగాణలో జరుగుతున్నది అదే. చత్తీస్ గడ్ లో ఉద్యమం వెనకపట్టు పట్టిన తర్వాత అనుభవిస్తున్న ఇబ్బందులను గతంలో ఉద్యమం ఉధృతంగా ఉన్నప్పటి పరిస్థితుల్లో పోల్చుకుని వారిలో వారు చర్చించుకుంటున్నారు. ప్రజలే చరిత్ర నిర్మాతలు అనే మార్క్సిస్టు సూత్రీకరణ మన దేశంలోని అనేక రాష్ట్రాల్లో కళ్ళ ముందు కనిపిస్తున్న వాస్తవం. అన్నలు మళ్ళీ వస్తారు.. మాకు నాయకత్వం వహిస్తారు.. మా దగ్గరి పెత్తందార్లను తరిమేస్తారని ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పాలక పార్టీలు మారినా వాటి స్వభావం దోపిడీవర్గాలకు ఊడిగం చేయడమే. ప్రజల సమస్యలకు ప్రజాస్వామిక పరిష్కారం చేయడం వాటికి ప్రధానం కాదు. సంక్షేమ పథకాల పేరుతో ప్రభుత్వాలపై ఆధారపడే తత్వాన్ని పెంచుతున్నాయి. ఆ పార్టీల పాలనా అసమర్థతలు, వైఫల్యాలతోనే ప్రజలు సాయుధ పోరాటాలకు నైతిక మద్దతు అందించారు. ప్రజలు తీసుకున్న పోరాటాలను ఖండించే, వ్యతిరేకించే ధైర్యాన్ని పాలకపార్టీలు చేయలేకపోయాయి. మావోయిస్టు పార్టీ సైతం మినహాయింపు కాదు. ఇప్పుడు దీర్ఘకాలిక సాయుధ ప్రజాయుద్ధాన్ని కంటిన్యూ చేయడమా?.. లేక నిరాయుధ పోరాటమా అనే అంశంలో పార్టీ వైఖరి తర్వాత ప్రజలు వారి కార్యాచరణను ఖరారు చేయనున్నారు.



ఎన్. నారాయణ రావు
ప్రధాన కార్యదర్శి
పౌరహక్కుల సంఘం

# మందమర్రి @ మునీర్



*మందమర్రి అంటే మునీరన్న...*
*మునీరన్న ప్రేమించిన ప్రాంతం..*
*ఆయన ఆప్యాయతలు పొందిన ప్రాంతం...*
*అక్కడి బొగ్గు బావులు... అక్కడి కార్మికులు...*
*అక్కడి వాడలోని పెద్దల నుండి పిల్లల దాక...*

అక్కడి చిరు వ్యాపారుల నుండి పెద్ద మనుషుల దాకా.. అందరు మెచ్చిన వ్యక్తి మునీరన్న... అన్న తలచుకుంటే మాకు ఎలాంటి కష్టం వచ్చిన మాకు తోడుంటాడు అన్న భరోసా మందమర్రిలో ఉండేది.. ఆయన బైకు మీద పోతే నమస్తే చెప్పని మనిషి ఉండడు... అందరికి తన చిరు నవ్వుతో సమాధానం ఇచ్చేవాడు.. ఇంటి ముందు NEWS IS PEOPLE, PEOPLE ARE MY LIFE అని పెద్ద పెద్ద అక్షరాలతో రాసి ఉండేది...కుల మత విభేదాలు మా.. అన్న కు మా మునీరన్నకు తెలియవు... అందరూ నా మనుషులే... ముందు మంచితనం.. మనిషితనం నేర్చుకోవాలి అనేటోడు.. చేసిన సాయం నలుగురికి టామ్ టామ్ చేసుడు ఆయనకి తెల్వదు.... ఇంటికి పోతే అన్నం తినిపెట్టకుండా వదలడు, ఓ రోజు మందమర్రి లో ఇద్దరు చిన్నపిల్లలు లిఫ్ట్ అడిగి అన్న బైక్ ఎక్కిన్రు చూస్తే వాళ్ళ కాళ్ళకి చెప్పులు లెవ్వు అన్న బండి చెప్పుల షాపు కి తీసుకుపోయి చెప్పులు కొనిపెట్టి వాళ్ళ ఇంటి దగ్గర దించి వచ్చిండు ఇది ఒక చిన్న విషయం అనిపించొచ్చు కానీ ఆ పిల్లలకి మాత్రం ఆ రోజు ఒక పెద్ద సంతోషం.. ఎవరిని బాధ పెట్టే టోడు కాదు మా అన్న... ఒకసారి బస్సు బోల్తా పడి జనాలు అలమటిస్తుంటే తన భుజాల మీద జనాలను ఎత్తి అంబులెన్స్ లలో లారీల్లో దవాఖానలకి తరలించాడు... తన ప్రాంతంలో ఎలాంటి సంఘటనలు జరిగిన ముందు వరుసలో పోరాడిన వ్యక్తి... భూస్వాముల దొరల పాలన నుండి మందమర్రిని విడిపించిన మా మునీరన్నను మా మందమర్రి యాది చేసుకుంటుంది... మాకు ఎలాంటి సాయం కావాలన్నా.. సలహా కావాలన్నా... మా అన్నను అడిగి తెలుసుకోవాలని ఉండేది... సింగరేణి గురించి అన్నకు తెలిసినంత ఎవ్వరికీ తెల్వదేమో... చరిత్ర మొత్తం చెప్తాడు.. తన వార్తలు చాలా లోతైన అధ్యయనాలు చేసే రాస్తాడు... ఎవ్వరికీ భయపడని కలం మా అన్నది.. రాజకీయ అధ్యయనాలు కూడా ఆయనాకు తెలిసినంత మనకు తెల్వదు.. మా అన్న చెయ్యి పట్టుకొని ఎదిగిన ఎందరో ఉన్నారు కొంత మంది అది గుర్తు పెట్టుకొని అన్నని అభిమానిస్తారు కొంత మంది ఆయనని అవసరానికి మాత్రమే వాడుకుని మర్చిపోతారు.. కానీ ఆయన అందరి మనిషి ఒక గొప్ప మనిషి..ఇప్పుడు కొన్ని విషయాలు అర్థం కాకపోతే ఫోన్ చేసి అన్నను అడుగుదాం అని అనిపిస్తది మల్లా కళ్ళు నిండిపోతాయి అన్న లేడు... మమ్ములను వదిలి వెళ్ళిపోయినడు.... తన మందమర్రి మట్టిలోనే కలిసి పోయినాడు.... అన్న.... నీ లాంటి వ్యక్తులు ఉండరు.... మళ్ళీ ఒక మునీరన్న మా మందమర్రి కి రాలేడు..... మా గుండెల్లో నువ్వు ఎప్పటికీ ఉంటావు... జోహార్లు నీకు మందమర్రి సింహమా.... జోహార్లు నీకు మా మందమర్రి మునీరన్న...

ఇట్లు.. మునీరన్న శ్రేయోభిలాషి

# సలాం సార్ అబ్దుల్ కలాం

**అక్టోబర్ 15. భారత రత్న మాజీ రాష్ట పతి శాస్త్రవేత్త రచయిత అబ్దుల్ కలాం జయంతి**

**పల్లవి:**

**ప్రతి క్షిపణి వేగంలో నీ తేజం చూస్తాము**
**విద్యార్థుల కన్నుల్లో నీ స్ఫూర్తిని కంటాము**
**ప్రతి జయము వెనకాల క్రమశిక్షణ చూస్తాము**
**మీ కలల సాకారం మా భవితలు చేస్తాము**

**సలాం సార్ అబ్దుల్ కలాం**
**మీ సేవలు మేము మరువలేం**
**సలాం సార్**

**చరణం:**

**ఓటమినే గెలుపుగా మార్చిన ఓ బోధకుడా**
**కలలంటే కరగవని నేర్పిన ఓ స్వాప్నికుడా**
**గురు జాతి కీర్తి జెండ రెపరెపలో నీ నవ్వు**
**మానవతా స్ఫూర్తి పథం లోన వెలుగు నీ మోము**
**సలాం సార్**

**చరణం:**

**జీవితము సమయము ఉపాధ్యాయులన్నావు**
**పరాజయ గాథలే జయ పునాదులన్నావు**
**ప్రతి కార్య సాధనలో పట్టుదలే మెరువంగా**
**ఈ కాలపు మహామనిషి అద్భుతమూ నీవేగా**
**సలాం సార్**

**చరణం:**

**చీకట్లను చీల్చగా ఉదయించిన సూర్యుడా**
**వెలుగునిచ్చే సూర్యుడికి అస్తమయం ఉండునా**
**నీ లక్ష్యం నెరవేర్చగ యువకుల్లో జీవించు**
**భరతమాత ముద్దుబిడ్డ మళ్ళీ నువు జన్మించు**
**సలాం సార్**

**చరణం:**

**ఓ కార్య సాధకుడా సృజన శీలి మార్గదర్శి**
**చూడలేము నీవంటి జనహిత విజ్ఞాన స్ఫూర్తి**
**మానవతకు ప్రతిరూపం జ్ఞాన రూప చైతన్యం**
**నీ ఆశయ సాధనలో నీ దారిలో పయనిస్తం**
**సలాం సార్**




**అక్టోబర్ 15. మాజీ రాష్ట్రపతి శాస్త్రవేత్త భారతరత్న అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా**

**గఫూర్ శిక్షక్**
**తెరవే జిల్లా అధ్యక్షులు**
**9849062038**

# భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన అబ్దుల్ కలామ్

## అక్టోబర్ 15... మిస్సైల్ మ్యాన్ జయంతి




అబ్దుల్ కలామ్.. ఈ పేరు తెలియని భారతీయుడు ఉండడంటే ఆశ్చర్యం లేదు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఆయన. ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించి.. నిరంతర శ్రమతో ఉన్నత శిఖరాలు అధిరోహించిన ఆయన జీవిత ప్రస్థానం నిజంగా అద్భుతం. దేశం కోసం పెళ్లి చేసుకోకుండా బ్రహ్మచారిగా ఉండిపోయిన ఆయన జీవితం ఆదర్శం. అనితర సాధ్యమైన విజయాలను తన ఖాతాలో వేసుకోవడం గొప్పతనం. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి సేవలందించిన కలాం. హార్ట్ స్టంట్ రూపొందించడం లోనూ పాత్ర పోషించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం. భారతదేశంలో ఉన్న అతికొద్దిమంది గొప్ప శాస్త్రవేత్తల్లో ఏపీజే అబ్దుల్ కలాం ఒకరు. ఆయన జయంతి ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా జరుపుకుంటారు. అబ్దుల్ కలాం తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం లో ఒక ముస్లిం కుటుంబంలో 1931 అక్టోబర్ 15న జన్మించాడు. తండ్రి పేరు జైనలబుద్దీన్ మరాకాయర్, తల్లి పేరు అషియమ్మా జైనబుల్బుద్దీన్. అబ్దుల్ కలాం పూర్తి పేరు అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం ఆర్థికంగా వెనుకబడిన, కుటుంబానికి సహాయం చేయడానికి చిన్న వయసు లోనే న్యూస్ పేపర్లు వేసేవాడు. రామేశ్వరానికి కొద్ది దూరంలో ఉన్న రామనాథపురంలో స్కెచ్ మెట్రిక్యులేషన్ స్కూల్లో పదో తరగతి వరకు చదువుకున్నాడు. చదువు అంత అంత మాత్రమే అయినప్పటికీ నేర్చుకోవాలనే తపన ఎక్కువగా ఉండేది. స్కూల్లోనే ఉపాధ్యాయుడు ఒకసారి సముద్రపు ఒడ్డుకు తీసుకువెళ్లి పక్షి ఎలా ఎగురుతుందో చూపించాడు. అప్పటి నుండి కలాం కూడా పక్షిలా ఎగరాలను కున్నాడట. ఎలాగైనా పైలెట్ కావాలని అనుకున్నాడు. తరువాత తిరుచ్చిలో సెయింట్ జోసెఫ్ కళాశాలలో డిగ్రీ పట్టా పొందాడు. కలాం తన చిన్ననాటి కోరిక నిజం చేసు కోవడానికి మద్రాసులోని ఎన్ఐటీల్లో చేరాడు. ఐతే ఇన్స్టిట్యూట్ లో చేరాలంటే వెయ్యి రూపాయలు ఫీజు కట్టాల్సి వచ్చింది. కానీ ఆయన తండ్రి దగ్గర లేనపుడు కలాం అక్క తన రెండు గాజులు అమ్మి ఫీజ్ కట్టింది. ఎలాగైనా బాగా చదివించాలని ఉన్నతమైన స్థానంలో చూడాలని తన కుటుంబ సభ్యులు పడుతున్న కష్టాన్ని తన మీద వాళ్లకు నమ్మకాన్ని చూసి చలించి పోయాడు. చివరకు స్కాలర్షిప్ సహాయంతో ఎం ఐ టి లో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేయగా, అందులో నాటికల్ ప్రవేశ పరీక్షల్లో 8 ఉద్యోగాలు ఉంటే తనకు 9వ స్థానం రావడంతో తృటిలో పైలెట్ అయ్యే అవకాశాన్ని కోల్పోయాడు. కలాం తన చిన్ననాటి కల చేజారి పోయింది. 1960 కలాం డీఆర్డీఓ (%ణ=ణూ%)లో ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఎస్టాబ్లిష్మెంట్ లో శాస్త్రవేత్తగా చేరారు. అక్కడ భారత సైన్యం కోసం ఒక ఓవర్ క్రాఫ్ట్ డెవలప్ చేయడం ఆయన పని. కొన్ని రోజులకి ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ నుండి కలాం కి ఇంటర్వ్యూకు రమ్మని పిలుపు వచ్చింది. ఇప్పుడు దీనినే ఇస్రోగా (%×ూ=ూ%) పిలుస్తున్నారు. ప్రొఫెసర్ విక్రం సారాభాయ్ ఇంటర్వ్యూ చేశారు. అలా కలాం రాకెట్ ఇంజినీరుగా సెలక్ట్ అయ్యారు. విక్రం సారాభాయ్, కలాం కలిసి ఇస్రో ను ఎంతగానో అభివృద్ధి చేశారు. 1962లో భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోలో చేరి, ఇతర శాస్త్రవేత్తలతో కలసి అనేక కృత్రిమ ఉపగ్రహాలను విజయ వంతంగా ప్రయోగించారు. రోహిణి ఉపగ్రహాన్ని జూలై 1980లో విజయవంతంగా భూమి సమీప కక్ష్యలోకి వదిలిన భారత దేశపు తొలి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనంని అభివృద్ధి చేయడంలో ప్రాజెక్టు డైరెక్టరుగా ఆయన కృషి ఎంతో ఉంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం. క్రమంలో ఆరు నెలలపాటు రాకెట్ లాంచింగ్ టెక్నిక్ మీద ట్రైనింగ్ కోసం అమెరికాలోని "నాసా" వెళ్లే అవకాశం దక్కింది. భారత్ నుండి అంతరిక్షంలోకి శాటిలైట్ పంపాలనేది ప్రొఫెసర్ సారాభాయ్ కోరిక. శిక్షణ పూర్తి అయిన తర్వాత కలాం... సారాభాయ్ మరియు సతీష్ సహకారంతో "రోహిణి" అనే శాటిలైట్ ని అంతరిక్షంలోకి పంపడానికి ఎస్ఎల్వి-3 అనే రాకెట్ ని అభివృద్ధి చేశారు. దేశంలోని ప్రజలందరికీ ఎస్ఎల్వి-3 మీదే కళ్ళు ఉన్నాయి. కలాంతో పాటుగా అక్కడ ఉన్న ఎంతోమంది కష్టపడి నిర్మించిన 22 మీటర్ల పొడవైన ఎస్ఎల్వి-3 లాంచ్ అయింది. 315 సెకండ్ తర్వాత సెకండ్ స్టేజ్ పేలిపోయి సముద్రంలో కుప్పకూలి పోయింది. కలాంకు ఏదో తెలియని ఆవేదన. దేశ ప్రజల అందరి కళ్లు ఆవిరై పోయాయి. మళ్ళి తిరిగి 1980 2 వ ఎస్ఎల్వి-3 రెడీ చేశారు. మొదటి దాని లాగానే ఇది కూడా ఫెయిల్ అవుతుందని వ్యాఖ్యానించారు. 18 జూలై 1980 లో ఎస్ఎల్వి-3 రోహిణి విజయ వంతంగా ప్రవేశ పెట్టింది..అంతరిక్షం లోకి శాటిలైట్ ని పంపగలిగే కెపాసిటీ ఉన్న దేశాల లిస్టులో భారతదేశం కూడా చేరింది. భారత అంతరిక్ష ప్రయోగాలు పునాదులు పడ్డాయి. ఆ నాటి ప్రధానమంత్రి గాంధీ ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు. ఆ తర్వాతి సంవత్సరం 1981లో కలాంకు పద్మభూషణ్ అవార్డు దక్కింది. ఆ తరవాత మన ఆర్మీ కోసం అగ్ని, పృథ్వి, నాగ్, ఆకాశ్ త్రిశూల్ వంటి శక్తివంతమైన మిస్సైల్ లు తయారు చేసి మన దేశాన్ని ఎవరి మీద ఆధారపడని ఒక శక్తివంతమైన దేశంగా మార్చారు. అందుకే కలాంను మిసైల్ మాన్ అంటారు. ఆయన నాయకత్వంలో ఇస్రో ఎంతో అభివృద్ధి చెందింది. 1982లో, ఆయన డీఆర్డీవో డైరక్టరుగా తిరిగి బాధ్యతలు చేపట్టి గైడెడ్ మిస్సైల్స్‌పై దృష్టి కేంద్రీకరించారు. అగ్ని, పృథ్వి, క్షిపణి మిస్సైళ్ళ అభివృద్ధి చేసి ప్రయోగించడంలో కీలక పాత్ర పోషించారు. అంటే దేశానికి తొలి మిస్సైల్‌ను అందించిన ఘనత ఆయనదే. అందుకే ఆయనకు "మిస్సైల్ మాన్" అనే పేరు కూడా వచ్చింది. ఆ తర్వాత జూలై 1992లో దేశ రక్షణ మంత్రికి సాంకేతిక సలహాదారుగా నియమితులయ్యారు. అలాగే, భారత ప్రభుత్వానికి ప్రధాన సాంకేతిక సలహాదారుగా కేబినెట్ హోదాలో కొనసాగారు. అబ్దుల్ కలాం కృషి ఫలితంగా 1998లో పోఖ్రాన్-%××% అణుపరీక్షలు విజయ వంతంగా పూర్తి చేయడం జరిగింది. ఈ అణు పరీక్షతో భారతదేశాన్ని అణ్వస్త్ర రాజ్యాల సరసన చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగస్వామిగా ఆయన్ను "మిస్సైల్ మాన్" అని పిలుస్తారు. 1898లో వాజ్ పేయి ప్రధానమంత్రి సమయంలో అమెరికన్ శాటిలైట్స్ కి దొరకకుండా "పోక్రాన్" అనే ప్రదేశంలో "ఆపరేషన్ శక్తి" అనే పేరుతో విజయవంతంగా న్యూక్లియర్ టెస్ట్ చేయడంలో కలాం పాత్ర ఎంతగానో వుంది.

గత ఎన్డీయే ప్రభుత్వ హయాంలో వాజ్‌పేయి ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో అంటే 2002 జూలై 18వ తేదీన భారత రాష్ట్రపతిగా ఎన్నిక కాగా, జూలై 25న రాష్ట్రపతి భవన్‌లో అడుగు పెట్టారు. ఆయనకు నాటి ఎన్డీయే మిత్రపక్షాలతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతు ఇవ్వడంతో 90 శాతానికి పైగా ఓట్ల మెజార్టీతో రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. అబ్దుల్ కలాం మన దేశానికి ఏ రాజకీయ అనుభవం లేకుండా పదకొండవ రాష్ట్రపతిగా ఎన్నికైన జ్ఞాని. కలాం సమయంలో ఎక్కవ మందిని కలుసుకున్న రాష్ట్రపతిగా, పీపుల్స్ ప్రెసిడెంట్ అని అంటారు. అబ్దుల్ కలాం గారు పెళ్లి చేసుకోలేదు. అంతేకాదు, వైద్య రంగంలో పోలియో బాధితుల కోసం, తేలికపాటి పరికరాల రూపకల్పన చేయడానికి ఎంతో కృషి చేశారు. భారత ప్రభుత్వం "భారతరత్న" "పద్మవిభూషణ్", "పద్మభూషణ్" పురస్కారాలతో గౌరవించింది. అబ్దుల్ కలాం పూర్తిగా శాకాహారి. మద్యపాన వ్యతిరేకి. బ్రహ్మచారి. మత ఘర్షణలను నిరసించే శాంతి కాముకుడిగా పేరు గడించారు. ఈయన వింగ్స్ ఆఫ్ ఫైర్, సైంటిస్ట్ టు ప్రెసిడెంట్ వంటి అనేక పుస్తకాలను రచించారు. 84 సంవత్సరాల వయసులో జూలై 27, 2015 సోమవారం సాయంత్రం షిల్లాంగ్‌లోని ఏఐఎంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ అబ్దుల్ కలాం మధ్యలో కుప్పకూలి పోయి, స్థానిక బెథాని ఆస్పత్రికి తరలించబడి, 45 నిమిషాల వ్యవధిలోనే కన్నుమూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**9540595494**

# సామాజిక సమస్యగా మారిన విద్యార్థుల ఆత్మహత్యలు!



భారతదేశంలో విద్యార్థుల ఆత్మహత్యలు దేశం ఎదుట నిలిచిన అత్యంత బాధాకరమైన సామాజిక సమస్యలలో ఒకటిగా మారాయి. ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థులు విద్యా ఒత్తిడి, కుటుంబ ఆశలు, ఆర్థిక సమస్యలు, మానసిక అస్థిరత వంటి కారణాల వలన తమ జీవితాలను ముగించుకుంటున్నారు. ఈ పరిణామం విద్యా వ్యవస్థలో, కుటుంబ సంబంధాలలో, సమాజపు విలువల్లో ఉన్న లోపాలను బహిర్గతం చేస్తోంది. భారతదేశం వంటి యువజన ఆధారిత దేశంలో విద్యార్థుల ఆత్మహత్యలు కేవలం వ్యక్తిగత విషాదం మాత్రమే కాకుండా, సమాజపు భవిష్యత్తుపై ఒక తీవ్రమైన మచ్చగా నిలుస్తున్నాయి.

ప్రతి సంవత్సరం జాతీయ నేర రికార్డుల బ్యూరో ( ఎన్సిఆర్‌బి) విడుదల చేసే నివేదిక ప్రకారం, భారతదేశంలో దాదాపు పదివేలకుపైగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. 2014 నుండి 2023 మధ్య కాలంలో 1 లక్షకు పైగా విద్యార్థులు తమ ప్రాణాలు తీసుకున్నారు. మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో ఈ సంఘటనలు అత్యధికంగా నమోదయ్యాయి. విద్యార్థుల వయసు 15 నుండి 25 సంవత్సరాల మధ్యలో ఎక్కువగా ఉండటం విశేషం. ఈ వయస్సులోనే జీవితానికి పునాది వేసే కాలం కాగా, వారు నిరాశ, భయం, లేదా విఫలతను ఎదుర్కోలేక చివరి నిర్ణయం తీసుకోవడం సమాజానికి ఒక హెచ్చరిక సంకేతం.

విద్యార్థుల ఆత్మహత్యలకు అనేక కారణాలు ఉన్నాయి. మొదటిది విద్యా ఒత్తిడి పరీక్షల్లో అధిక మార్కులు సాధించాలనే భయం, పోటీ ప్రపంచంలో నిలవాలనే తపన, తల్లిదండ్రుల ఆశల భారముతో విద్యార్థులు మానసికంగా కుంగిపోతున్నారు. రెండవది కుటుంబ సమస్యలు తల్లిదండ్రుల మధ్య విభేదాలు, కుటుంబ ఆర్థిక కష్టాలు, లేదా పిల్లలపై చూపే అధిక నియంత్రణ వలన వారు ఒంటరితనంలోకి వెళ్తున్నారు. మూడవది ఉద్యోగ అవకాశాల కొరత ౦ విద్య పూర్తి చేసిన తరువాత స్థిరమైన ఉద్యోగం లేకపోవడం వల్ల యువత నిరాశ చెందుతున్నారు. నాలుగవది సామాజిక పోలిక సోషల్ మీడియా ప్రభావంతో ఇతరుల విజయాలను చూసి తమను తాము తక్కువగా భావించే పరిస్థితి ఏర్పడుతోంది. ఐదవది మానసిక ఆరోగ్యంపై అవగాహన లేకపోవడం డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక సమస్యలను గుర్తించకపోవడం వల్ల వీటి తీవ్రత పెరిగి చివరికి ఆత్మహత్యకు దారితీస్తుంది.విద్యార్థుల ఆత్మహత్యల వెనుక ఉన్న మరో ముఖ్య కారణం విద్యా వ్యవస్థలోని లోపాలు. పరీక్షా విధానం, గ్రేడింగ్ ప్రామాణికాలు, విద్యను కేవలం మార్కులతో కొలిచే ధోరణి విద్యార్థుల్లో భయాన్ని నింపుతోంది. స్కూళ్లలో ,కళాశాలల్లో మానసిక సలహా కేంద్రాలు లేకపోవడం, టీచర్లు , తల్లిదండ్రులు పిల్లలతో మానసికంగా మమేకం కాకపోవడం ఈ సమస్యను మరింత పెంచుతోంది. కొంతమంది విద్యార్థులు లింగ వివక్ష, సామాజిక దూషణ, ప్రేమలో విఫలం వంటి కారణాలతో కూడా ఇలాంటి చర్యలకు దిగుతున్నారు.

ఈ సమస్యను నివారించాలంటే సమాజం, ప్రభుత్వం, విద్యా సంస్థలు, కుటుంబం సమిష్టిగా చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు కౌన్సెలింగ్ సేవలు అందించడం, స్కూల్, కాలేజీల్లో మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అత్యవసరం. విద్యా విధానంలో పరీక్షల ఒత్తిడి తగ్గించి సృజనాత్మక అభ్యాస పద్ధతులు ప్రవేశపెట్టాలి. తల్లిదండ్రులు పిల్లలపై తమ ఆశలు రుద్దకుండా, వారి సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి. మాధ్యమాలు, సామాజిక వేదికలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపే వార్తలు, పోలికలు, లేదా అవగాహన రాహిత్యం నివారించాలి.

మొత్తానికి, విద్యార్థుల ఆత్మహత్యలు ఒక వ్యక్తిగత నిర్ణయం కాదు అది సమాజం, కుటుంబం, వ్యవస్థ యొక్క సమిష్టి వైఫల్యం. ప్రతి విద్యార్థి జీవితంలో ఆశ, ప్రోత్సాహం, సహానుభూతి వాతావరణం కల్పించగలిగితేనే ఈ దురదృష్టకర సంఘటనలను అడ్డుకోవచ్చు. భారతదేశం వంటి యువజన దేశం తన భవిష్యత్తును కాపాడుకోవాలంటే ప్రతి విద్యార్థి మనోభావాలను అర్థం చేసుకొని వారికి జీవన విలువలు నేర్పించాల్సిన సమయం వచ్చింది.

ఇప్పటివరకు రికార్డైన అత్యధిక వార్షిక సంఖ్య. సగటుగా రోజుకు -38 మంది (గంటకు -1.6) విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్టుగా వస్తుంది. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్సిఆర్‌బి) గణాంకాల ప్రకారం మొత్తం 1,17,849 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కేవలం 2023 సంవత్సరంలోనే 13,892 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఇది గత దశాబ్దంతో పోలిస్తే 64.9% పెరుగుదల అని చెబుతోంది. ఈ భయంకరమైన ధోరణి దేశంలో విద్యా వ్యవస్థలో మానసిక ఆరోగ్యంపై సమగ్ర సహాయ వ్యవస్థలు అవగాహన కార్యక్రమాలు అవసరమని సూచిస్తోంది.ఒక్క మాటలో చెప్పాలంటే, విద్యార్థుల ఆత్మహత్యలు మన సమాజం ఎదుర్కొంటున్న అత్యంత గంభీరమైన సమస్యలలో ఒకటిగా నిలుస్తున్నాయి. ఇది కేవలం వ్యక్తిగత పరాజయం కాదు, కానీ మన విద్యా విధానం, కుటుంబ వ్యవస్థ, సమాజపు ఒత్తిడి కలిసిన ఫలితంగా ఏర్పడిన సామాజిక వ్యాధి. ప్రతి విద్యార్థి తనలో ఉన్న ప్రతిభను గుర్తించి, జీవితం అనేది పరీక్ష ఫలితాలకంటే ఎంతో గొప్పదని తెలుసుకోవాలి. తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు విద్యార్థులపై అంచనాల భారాన్ని కాకుండా ప్రోత్సాహాన్ని ఇవ్వాలి. విద్యాసంస్థలు మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి, కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, విద్యార్థుల భావోద్వేగ స్థితిని గమనించాలి. చివరగా, ఒక విద్యార్థి చిరునవ్వు కాపాడటం అంటే ఒక జీవితాన్ని కాపాడినట్టే. అందువల్ల సమాజం మొత్తం కలిసి ఈ సమస్యపై చైతన్యంతో ముందుకు సాగితేనే విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టగలం.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# ఏఐసీసీ అబ్జర్వర్ల నిర్ణయానికే కట్టుబడి ఉంటాం

- అధ్యక్షుడు ఎవరైనా అందరం కలిసి పనిచేస్తాం
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుని ఎంపికలో వనపర్తి జిల్లాకు అబ్జర్వర్లు నియమింపబడ్డ వ్యక్తుల నిర్ణయానికి కట్టుబడి అధ్యక్షుడు ఎవరిని ఎన్నుకున్న తాము కలిసికట్టుగా పని చేయనున్నట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని దాక్ష లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సంఘతాన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి, ఏఐసీసీ అబ్జర్వర్ నారాయణస్వామి, మాజీ ఎమ్మెల్సీ అలీ ఖాన్, బొజ్జ సంధ్యారెడ్డి, కోటేశ్వరరావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సారథ్యంలో ఎంతో చక్కటి పరిపాలన చేస్తుందని పేర్కొన్నారు. భారత్ జూడో యాత్రలో రాహుల్ గాంధీ చేపట్టిన పాదయాత్ర ఫలితంగానే మేమెంత మాకెంత అనే నినాదంతో బిసి, ఎస్సి రిజర్వేషన్లను కాంగ్రెస్ పార్టీ సమర్థవంతంగా అమలుపరచుతుందని తెలిపారు. డిసిసి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక ప్రజాస్వామ్యంగా ఉండాలని ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో



ఉన్న పరిస్థితులను పరిగణంలోకి తీసుకొని సమర్థవంతుడైనటువంటి డిసిసి అధ్యక్షుని ఎన్నుకునేందుకు నేడు మానిలు మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామిని, కాంగ్రెస్ పార్టీ నియమించడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. సముద్రం లాంటి కాంగ్రెస్ పార్టీలో చిన్న చిన్న తగాదాలు ఉండడం సహజమేనని మనందరం వీటిని పరిగణలోకి తీసుకోకుండా రాహుల్ గాంధీ, ప్రధానమంత్రి అవ్వడమే విజన్‌గా ముందుకెళ్లాలని అందుకోసం అందరం కలిసికట్టుగా పని చేయాల్సి వస్తుందని పిలుపునిచ్చారు. వనపర్తి నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో నవంబర్ 30 కంటే ముందు కాంగ్రెస్ పార్టీలో ఉన్న కాంగ్రెస్ వాదులకు మాత్రమే బీఫాంలో లభిస్తాయని అందుకు స్థానిక ఎమ్మెల్యేగా తాను రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి కలిసికట్టుగా పనిచేసే ప్రతి ఒక్కరికి బీఫాంలో అందించి గెలిపించుకుంటామని అన్నారు. అక్షింతల పార్టీ అయిన బిజెపి ప్రజలను మోసం చేస్తుందని జీఎస్టీని తగ్గించామని, చెప్పేవాళ్ళు గత ఎనిమిది సంవత్సరాలుగా దోచుకున్న డబ్బును ప్రజలందకు పెంచలన్నారు. కొందరు వ్యక్తులు వనపర్తి నియోజకవర్గంలో బాకీ కార్డులు పట్టుకుని తిరుగుతున్నారని వనపర్తి నియోజకవర్గ ప్రజలకు 450 కోట్ల రూపాయలు బాకీ పడ్డ నాయకులు నేడు బాకీ కార్డులు పట్టుకొని తిరగడం సిగ్గుచేటని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఎన్నిక ఏదైనా కాంగ్రెస్ పార్టీలో ఘన విజయం సాధించేలాగా అందరం కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ వనపర్తి వ్యవసాయ మార్కెట్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, డిసిసిబి అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, గ్రంథాలయాల చైర్మన్ గోవర్ధన్ సాగర్, పీసీసీ సభ్యులు శంకర్ ప్రసాద్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, మహిళా అధ్యక్షురాలు శైలతా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు మాజీ జెడ్పిటిసిలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

- పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డా.రవీంధర్ నాయక్

**నారాయణపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** వైద్యాధికారులు ప్రజల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని హైద్రాబాద్ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డా.రవీందర్ నాయక్ సూచించారు. మంగళవారం నారాయణపేట జిల్లా సందర్శనలో బాగంగా మరికల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అప్పంపల్లి సబ్ సెంటర్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. మరీకల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రములో రికార్డులు,



డేలివరి రూం, స్టోర్ రూం,ల్యాబ్,పేషంట్ అడ్మిషన్ వార్డులను పరిశీలించారు. అదే విధంగా వైద్యాధికారి డా.రాఘవేందర్ రెడ్డి, డా. శ్రావణి సిబ్బంది తో అన్ని జాతీయ కార్యక్రమాలు నివేదికలను పరిశీలించి సమీక్షించారు. ఆఫ్ లైన్,ఆన్ లైన్ డేటా ఒకే విధంగా ఉండాలని సూచించారు, వార్డులో ఉన్న పెషెంట్లతో మాట్లాడి, సిబ్బంది ద్వారా అందే సేవలను అడిగి తెలుసుకోన్నారు. హాస్పిటల్ చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. తదనంతరం నారాయణ పేట జిల్లా వైద్య కార్యాలయాన్నీ సందర్శించి జిల్లా వైద్య అధికారి డా.జయచంద్ర మోహన్‌తో జాతీయ కార్యక్రమాల ప్రగతిని తెలుసుకొని, కార్యాలయములో కలిసి ప్రోగాం అధికారుల యొక్క నివేదికలను పరిశీలించారు. సమీక్షించిన తర్వాత నారాయణ పేట్ జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ ప్రైవేట్ హాస్పిటల్స్ ని ఐ ఎచ్ ఐ పి పోర్టల్ లో ఎనరల్ చేసి డైలీ రిపోర్ట్ ఎంట్రీ అయ్యేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమములో ప్రోగ్రాం అధికారులు డా.శైలజ, డా. సత్య ప్రకాష్ రెడ్డి, డా. సుదీష్ణ, డీపీవో బిక్షపతి కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గోన్నారు.

## సాయిబాబానగర్ పార్కు స్థలంపై అన్యాయం

**అల్వాల్, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** అల్వాల్ సర్కిల్ పరిధిలోని సాయిబాబా నగర్ కాలనీ పార్కు స్థలాన్ని ఆక్రమణదారులకు కట్టబెట్టే ప్రయత్నం అల్వాల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి చేస్తున్నారని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి ఆరోపించారు. మంగళవారం కాలనీ కమిటీ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాలనీ ప్రజల హక్కులను బలహీనపరిచే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గతంలో కాలనీ అసోసియేషన్ తరఫున హైడ్రా కమిషనర్ వద్ద పార్కు రక్షణ కోసం అర్జీ పెట్టగా, ఆయన ఆదేశాల మేరకు జనవరి 22న అల్వాల్ డిప్యూటీ కమిషనర్ సిబ్బందిని పంపించి పార్కు చుట్టూ ప్రహరీ గోడ కట్టించారు. అయితే మరుసటి రోజు పల్లా రాహుల్ తండ్రి పల్లా విశ్వేశ్వరరావు ఈ భూమి కాలనీదికాదని హైకోర్టులో పిటిషన్ వేసి స్టే తెచ్చుకున్నారని చెప్పారు. కాలనీ సభ్యులు 15మంది కలిసి డిప్యూటీ కమిషనర్‌ను కలిసి మాట్లాడగా, ఆయన ఆ స్థలం కాలనీదేనని, పల్లా రాహుల్ కుటుంబానికి సంబంధం లేదని స్పష్టంచేశారని తెలిపారు. కానీ కొద్ది రోజులకే అదే అధికారి జోనల్ కమిషనర్‌కు పంపిన లేఖలో పార్కు స్థలం రాహుల్ కుటుంబం లేఅవుట్‌లో భాగమని



రాశారని మల్లారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మేము సమాచార హక్కు ద్వారా అడిగినప్పుడు జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ వద్ద సాయిబాబా నగర్‌కు ఎలాంటి అప్రూవ్డ్ లేఅవుట్ లేదని డిప్యూటీ కమిషనర్ లేఖ ఇచ్చారు. అలాంటప్పుడు అదే అధికారి లేఅవుట్‌లో ఈ స్థలం ఉందని ఎలా రాశారో మాకు అర్థం కావడం లేదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ కమిషనర్ వద్ద అపాయింట్‌మెంట్ తీసుకునేందుకు ప్రయత్నించినా సమయం ఇవ్వలేదని, దీంతో కాలనీ తరఫున హైకోర్టులో స్టే తెచ్చుకున్నామని తెలిపారు. తమ కాలనీకి జరిగిన అన్యాయం గురించి ప్రజలకు, అధికారులకు తెలియజేయాలనే ఉద్దేశంతో మీడియా ద్వారా వివరాలు వెల్లడిస్తున్నామని మల్లారెడ్డి పేర్కొన్నారు.

## ధాన్యం సేకరణలో అక్రమాలకు తావిస్తే క్రిమినల్ కేసులు

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో 498 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామని, అందులో 430 వరి కొనుగోలు కేంద్రాలు ఇప్పటికే మొదలయ్యాయి అని అన్నారు. 10 కేంద్రాలకు వరి ధాన్యం రావడం మొదలైంది అన్నారు. దీపావళి తర్వాత మరింతగా వరి ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే విషయంలో అక్రమాలకు తావిస్తే క్రిమినల్ కేసులు పెడతామని కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని, బాగా ఆరబెట్టిన, శుభ్రపర్చిన ధాన్యం మిల్లులకు పంపాలని అన్నారు. తూకం యంత్రాలు, గ్రెయిన్ క్యాలిపర్స్, తేమ కొలిచే యంత్రాలు వంటివి సరిపడా అందుబాటులో ఉండాలన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులను అన్ని కేంద్రాలలో సమకూర్చమన్నారు. రైతుల నుండి ధాన్యాన్ని త్వరగా సేకరించి త్వరగా రైతులు అకౌంట్లో డబ్బులు పడేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామంలో



నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

ధాన్యం సేకరణకు కంట్రోల్ రూమ్ ను కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. ధాన్యం సేకరణకు ఏదైనా సమస్యలు ,అవసరాలు సూచన ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ నెంబర్ 9281103685 ను సంప్రదించవచ్చని తెలిపారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, నిత్యానందం, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగ పంట తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** వనపర్తి వేరుశనగ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, వరి పంటతో పోల్చితే వేరుశనగ వేయడం ద్వారా తక్కువ పెట్టుబడి తో మంచి లాభాలను పొందవచ్చని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం పెద్దమందడి మండల పరిధిలోని బలిజపల్లి గ్రామ రైతు వేదికలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ నూనె గింజల ఉత్పత్తి పథకం కింద వేరుశనగ రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై రైతులకు సబ్సిడీ కింద కదిరి లేపాక్షి రకం వేరుశనగ విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడికి వచ్చిన పలువురు వేరుశనగ రైతులతో మాట్లాడి పంట పెట్టుబడికి అయ్యే ఖర్చు వివరాలను పూర్తయిన తర్వాత వచ్చే దిగుబడి వివరాలను తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వరి పంటతో పోల్చితే వేరుశనగ వేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో మంచి లాభాలను పొందవచ్చని చెప్పారు. కాబట్టి రైతులు పంట మార్పిడి విధానాలను




అవలంబించాలని ఎప్పుడూ ఒకే రకం పంట కాకుండా నూనె గింజలను కూడా ఉత్పత్తి చేయాలని సూచించారు. వేరుశనగ నూనె గింజలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ముఖ్యంగా వనపర్తి వేరుశనగకు అఫ్లో టాక్సిన్ అనే శిలింద్రం లేకపోవడం వల్ల డిమాండ్ ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఇప్పుడు ప్రభుత్వం అందజేస్తున్న ఈ సబ్సిడీ వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సబ్సిడీ విత్తనాలను పొందిన రైతులు పంట ఉత్పత్తి అయిన తర్వాత పెద్దమందడి ఎఫ్‌పిఓ కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు. సబ్సిడీ ద్వారా ఈ విత్తనాల పంపిణీ కార్యక్రమంతో ఎకరానికి రైతులకు రూ. 10 వేల పెట్టుబడి తగ్గుతుందని చెప్పారు. కాబట్టి రైతులు ఈ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వేరుశనగ ద్వారా మంచి దిగుబడిని సాధించాలని కలెక్టర్ సూచించారు. పంట ఉత్పత్తి విషయంలో రైతులకు వ్యవసాయ శాఖ తరఫున శిక్షణ కూడా ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు గౌడ్, తహసిల్దార్ పాండు నాయక్, ఎంపీడీవో, ఏడిఏఓ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి ఎమ్మెల్యేపై అసత్యప్రచారం సరికాదు

- సంగారెడ్డి అభివృద్ధి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తోనే..
- అసత్య ప్రచారాలపై మండిపడ్డ బిఆర్ఎస్ నాయకులు

**సంగారెడ్డి టౌన్, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** సంగారెడ్డి నియోజకవర్గంలో నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజాసేవ అంకితమైన సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పై కొన్ని యూట్యూబ్ ఛానల్ ను అసత్య ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో పెట్టడం సరికాదని టిఆర్ఎస్ మండల నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పై యూట్యూబ్ ఛానల్ లో అసత్య ప్రచారాలు చేసి ప్రజలను మబ్బిపెట్టించేందుకే సోషల్ మీడియాలో పోస్టులు చేసి వైరల్ చేస్తున్నారని బిఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ప్రజా సేవకై అభివృద్ధికై తోడ్పడుతున్న వ్యక్తి చింతా ప్రభాకర్ అనే అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎవరు ఫోన్ చేసినా ఫోను లిఫ్ట్ చేసి సమస్య అడిగి తెలుసుకుని సమస్యను పరిష్కరించే నాయకుడు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అని అన్నారు 2014 లో చింత ప్రభాకర్ ఓడిపోయిన నియోజకవర్గ అభివృద్ధికి తోడుపడ్డాడని నిత్యం ప్రజల మధ్యలో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాలని



వారన్నారు. మళ్లీ 2023 సంగారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరవుతూ అభివృద్ధికి తోడ్పడుతున్నారని అన్నారు , గత ప్రభుత్వంలో సంగారెడ్డి నియోజకవర్గానికి వచ్చిన నిధులను వెనక్కి మళ్లించిన కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంగారెడ్డి పై కక్ష సాధింపుచేసి అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదని వారు మండిపడ్డారు. ఎమ్మెల్యే పై అసత్య ప్రసారాలు చేసే బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఊరుకోరని వారు తీవ్రంగా హెచ్చరించారు. అసత్య ప్రసారాలు చేస్తున్న యూట్యూబ్ ఛానల్ పై ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, వెంకటేశ్వర్లు , చక్రపాణి, విట్టల్, తదితరులు పాల్గొన్నారు.

## ఓసీలకు మైనారిటీ హెూదా ఇవ్వాలి

- సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కుల కోసం ఓసీ ప్రజల ఐక్యవేదిక

**అల్వాల్, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ హక్కుల సాధన కోసం ఏర్పడిన ఓసీ ప్రజల ఐక్యవేదిక ప్రభుత్వాన్ని చైతన్యపరచాలని బుట్టెంగారి మాధవరెడ్డి పిలుపునిచ్చారు. రిజర్వేషన్లపై న్యాయపోరాటం చేసిన ఓసీ జాతి నేత మాధవరెడ్డి సోమవారం అల్వాల్‌లోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన 'ఓసీ ప్రజల ఐక్యవేదిక' సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా




ఆయన మాట్లాడుతూ 22 శాతం జనాభా ఉన్న ఓసీ వర్గాలకు ప్రభుత్వంలో తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలని, విద్యా, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఓసీలకు స్కాలర్‌షిప్‌లు, గురుకులాల్లో అడ్మిషన్లు, ప్రత్యేక కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆర్థిక సబలీకరణ కోసం రుణాలు, ఉపకరణాల పంపిణీ, స్వయం ఉపాధి కార్యక్రమాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాజకీయ రంగంలోనూ స్థానిక సంస్థలు, శాసనసభ, పార్లమెంటులో ఓసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. ఓసీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, సంక్షేమ నిధుల విభజన పారదర్శకంగా జరగాలన్నారు. ప్రభుత్వ విధానాల్లో ఉన్న లోపాలను ఎండగట్టిన మాధవరెడ్డి, "22 శాతం ఓసీలను మైనారిటీలుగా గుర్తించి ప్రత్యేక హెూదా ఇవ్వాలి" అని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ఓసీల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఓసీ సంఘాల ప్రతినిధులు, వేదిక సభ్యులు పాల్గొన్నారు.

# చిట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీకి కొండ వార్నింగ్..

- రెండు వారాల డెడ్‌లైన్
- రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలి
- రాబోయే రోజుల్లో కేంద్ర రైల్వే శాఖ మంత్రిని నేనే...?
- వికారాబాద్ జిల్లా భాజపా అధ్యక్షుడిని నియమించింది నేనే.
- జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి రాజకీయాలకు పనికిరాడు..
- ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**తాండూరు, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని లేదంటే ఫ్యాక్టరీ ముందు ఆందోళన చేస్తామని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తాండూరు మండలం సంగెం కలాన్ వద్ద నిర్మించిన చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ సంగెం కలాన్ గ్రామ రైతులకు నష్టపరిహారం ఇవ్వడంలో అలసత్వం వహించడానికి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఫ్యాక్టరీ యాజమాన్యానికి వార్నింగ్ ఇచ్చారు. తక్షణమే రైతులకు పరిహారం ఇవ్వకుంటే ఫ్యాక్టరీ ముందు ఆందోళన చేపడతానని ఫ్యాక్టరీ యాజమాన్యానికి హెచ్చరిక చేశారు తాండూరు నియోజకవర్గం లోని తాండూర్ మండల్ సంగం కలాన్ గ్రామం పంట నష్టాలను ఇటీవల కురిసిన భారీ వర్షానికి సగం ఊరు నీట మునిగిన దృశ్యాలను గ్రామానికి వెళ్లి సందర్శించి చిట్టి నాడు ఫ్యాక్టరీ సందర్శించి వారిపై చెట్టపరమైన చర్యలు తీసుకుంటానని వెంటనే నష్టపరిహారం చెల్లించాలని లేనియెడల ఫ్యాక్టరీని బంద్ చేపిస్తానని తీవ్రంగా స్టాఫ్ పై మండి పడ్డారు. గతవారం కురిసిన తీవ్ర వర్షాల వల్ల వచ్చిన వరదలతో సంఘం కలాం గ్రామం తీవ్రంగా నష్టపోయింది. ఈ గ్రామంలోని దాదాపు 60 ఇండ్లు, చుట్టుపక్కల గ్రామాలలోని వందల ఎకరాల వ్యవసాయ భూములు పూర్తిగా వరదల వల్ల నష్టపోయాయి. ఈ వర్గాలలో నష్టపోయిన సంఘం కలాన్ గ్రామాన్ని మంగళవారం ఉదయం రైల్వే, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఎంపీ సందర్శించారు. గ్రామం అనుకుని ఉన్న చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీకి వేసిన రైల్వే లైన్ వల్ల వర్షం నీరు ఒకవైపు నుంచి మరోవైపుకు ఒక పోవడం వల్ల గ్రామాలు నీళ్లలో మునిగిపోతున్నాయని ప్రజలు తీవ్రమైన ఆవేదన వ్యక్తం చేశారు. చెట్టినాడు సిమెంట్ కంపెనీ యాజమాన్యం వాళ్ళని పిలిచి ఎంపీ తీవ్రంగా మందలించారు. గ్రామాలలో ఇండ్లు కూలిపోయి నీటి మునిగితే పందరసం జరిగితే కనీసం మానవత్వం చూపకుండా దుర్మార్గంగా వ్యవహరించడానికి ఎంపీ తీవ్రంగా ఆక్షేపించారు. పేదలు బడుగుల జీవితాలను చిద్రం చేసి కోటానుకోట్ల రూపాయల లాభాలు ఆశిస్తే సరిపోదని పేద ప్రజలకు కూడా ఆ కంపెనీ వల్ల జరిగిన నష్టానికి నష్టపరిహారం చెల్లించే వరకు



వదిలి పెట్టనని పేర్కొన్నారు. నేటినుండి వారం లేదా రెండు వారాలలో సంగం కులం గ్రామం తో పాటు ఇతర గ్రామాల్లో జరిగిన నష్టానికి నష్ట పరిహారం చెల్లించాలని అల్టిమేటమ్ ఇచ్చారు. గ్రామస్తులకు రైతులకు జరిగిన నష్టాన్ని ఇవ్వకుండా బేకాతర చేస్తే సహించేది లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు రమేష్ కుమార్ , సీనియర్ నాయకులు బాలేశ్వరం గుప్తా, జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్ ,పట్టణ అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బొప్పి శ్రీహరి, ఉపాధ్యక్షులు కందనెల్లి సంగమేశ్వర్ ,అంతరం కిరణ్, ప్రధాన కార్యదర్శి మిట్టి శ్రీనివాస్, కలవ ఉదయ్ , కార్యకర్తలు అభిమానులు తదితరులు ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
15 అక్టోబర్ 2025

# బాల్య వివాహాలపై అప్రమత్తంగా ఉండాలి

- **జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర**




**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** బాల్యవివాహాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండి తమకు సమాచారం చేరవేస్తే అడ్డుకుంటామని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర చెప్పారు అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాల మేరకు చైల్డ్ ఫ్రెండ్లీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజ్యాంగంలో కల్పించిన ప్రాథమిక హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, బాలల రక్షణ సంరక్షణ పై నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. బాల్య వివాహాల వల్ల భవిష్యత్తులో జరిగే నష్టాన్ని వివరిస్తూ మానసిక వృద్ధితోపాటు పుట్టబోయే సంతానంలోనూ ఎలాంటి ఎదుగుదల ఉండదని చెప్పారు బాల్య వివాహాల కట్టడికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు పూర్తిగా అర్థం చేసుకొని వారి తల్లిదండ్రులకు సూచించాలని పేర్కొన్నారు. ఫోక్సో చట్టం, ప్రాథమిక విద్య హక్కు చట్టం, పిల్లల చట్టాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం, గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షల నివారణ చట్టం వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేరాల అదుపునకు చట్టాల తో పాటు బాధ్యతలు కూడా అంతే ముఖ్యమని అన్నారు. స్నేహపూర్వకమైన బాలల న్యాయ సేవల పథకం-2024 ప్రకారం బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి కలలను సాకారం చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఏదైనా సమస్య వస్తే స్థానిక పోలీసులకు 100కు ఫోన్ చేసి గాని, చైల్డ్ లైన్ 1098కు ఫోన్ చేసి గాని వివరాలు చెబితే వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని చెప్పారు ఉచిత న్యాయ సహాయంతో పాటు బాలలు, మహిళలకు ప్రాథమిక హక్కులను తెలియజేసేందుకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ పనిచేస్తుందని అన్నారు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరూ బడిలో ఉండాలని సూచించారు. ప్రభుత్వం బాలల హక్కుల పరిరక్షణ కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బేటి బచావో బేటి పడావో, సమగ్ర శిశు అభివృద్ధి పథకం వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ఆయా శాఖలు పనిచేస్తున్నాయని అన్నారు. పిల్లల హక్కులకు భంగం కలగకుండా వారికి సహాయం చేసేందుకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ ఫ్రెండ్లీ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ లపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ తయారుచేసిన కొన్ని వీడియోలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రదర్శించి అవగాహన కల్పించారు. పిల్లల మానసిక స్థితిని అర్థం చేసుకొని చదువుపై శ్రద్ధ చూపేలా కౌన్సిలింగ్ ఇవ్వడం బాధ్యతగా తీసుకోవాలని టీచర్లతో చెప్పారు తహసిల్దార్ కృష్ణా నాయక్, ఎంపీడీవో యశోదమ్మ, ఎంఈఓ గోపాల్ నాయక్, డిప్యూటీ తాసిల్దార్ వెంకటేశ్వర్లు, స్కూల్ హెడ్మాస్టర్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టండి



**సంగారెడ్డి, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం కంది మండలంలోని వడ్డెనగూడ తండా గ్రామపంచాయతీని పంచాయతీ అధికారి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, శ్మశాన వాటిక, పల్లె ప్రకృతి వనం, తెలంగాణ క్రీడా ప్రాంగణం మరియు ఇజిఎస్ నిధులతో నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవనంను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలోని రికార్డులను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. పంచాయతీ పనులను సమయానికి పూర్తి చేయాలని, గ్రామ పరిశుభ్రత కు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి మహేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలలో క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి

- **జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య**



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో క్రీడ మైదానం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య ఆదేశించారు. కళాశాల ప్రాంగణంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన క్రీడా మైదానం (స్పోర్ట్స్ గ్రౌండ్) ఏర్పాటు కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులకు సూచించారు. మంగళవారం సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రాంగణంలో పర్యటించారు. ఆర్ అండ్ బి (రోడ్స్ అండ్ బిల్డింగ్స్) ఇంజనీరింగ్ అధికారులు, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి (డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ) జి జి హెచ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు కలిసి కళాశాల ప్రాంగణంలో స్పోర్ట్స్ గ్రౌండ్ ఏర్పాటుకు కొరకు అవసరమైన స్థలం సర్దుబాటు మార్గాలపై సమీక్షించారు. . కళాశాల విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహించేందుకు ఆధునిక సౌకర్యాలతో కూడిన క్రీడా మైదానం ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక వికాసం,పెంపొందుతుందని తెలిపారు. మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న క్రీడా ప్రాంగణంలో క్రికెట్ ప్రాక్టీసింగ్ నెట్ కోర్టులు , వాలీబాల్ కోర్ట్, త్రోబాల్ కోర్టు, బాస్కెట్‌బాల్ కోర్ట్ బ్యాడ్మింటన్, వంటి క్రీడలకు అనువైన మల్టీపర్పస్ ప్లే గ్రౌండ్ రూపకల్పన చేయాలని జిల్లా క్రీడా అధికారి ఖాసీం భేగ్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నర్సింలు, రవికుమార్, జిజిహెచ్ఈఈ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ చట్టాలపై విద్యార్థులకు అవగాహన




**మక్తల్, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** మాగనూరు మండలంలోని నేరడగం గ్రామంలోని సిద్ద లింగేశ్వర విద్యాలయం విద్యార్థులు మంగళవారం మక్తల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్శనలో విద్యార్థులకు పోలీస్ శాఖ దినచర్య, విధులు, పనితీరు, పోలీస్ స్టేషన్ లో జరిగే వివిధ కార్యకలాపాలు విద్యార్థులకు వివరించారు. వైర్లెస్ సెట్ ద్వారా మాట్లాడే విధానం, పోలీసు లాకప్, ఏఫ్ఐఆర్ రిజిస్ట్రేషన్ విధానం, పహారా డ్యూటీలు, సీసీ కెమెరాల పనితీరు, సీసీ కెమెరా మానిటరింగ్ సిస్టమ్, డయల్ 100 సేవలు, మహిళా భద్రత చర్యలు, పోలీస్ స్టేషన్ కి వచ్చే ఫిర్యాదుదారులకు రిసెప్షన్ లో ఏ విధంగా రిసీవ్ చేసుకుంటారు. పోలీస్ చట్టాలపై అవగాహన తదితర అంశాలను ప్రాక్టికల్‌గా చూపించి విద్యార్థులకు మక్తల్ సీఐ రామ్ లాల్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు ఎలాంటి వేగవంతమైన చర్యలు తీసుకుంటారో, ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించే విధానం, సంఘటన స్థలానికి చేరుకోవడం, సహాయక చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పోలీసుల పట్ల విశ్వాసం పెంపొందించడం, చిన్నారుల్లో చట్టం పట్ల అవగాహన పెంచడం ముఖ్యమని తెలిపారు. విద్యార్థులు లేదా గ్రామ ప్రజలు ఎటువంటి అనుమానాస్పద సంఘటనలు గమనించినా, అపరిచితులను చూసిన ధైర్యంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళ ఎస్సై రేవతి, మక్తల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్పీని సన్మానించిన బిజెపి జిల్లా లీగల్ సెల్ నాయకులు



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా నూతన ఎస్పీ డాక్టర్ జి.వినీత్ ను మంగళవారం నారాయణపేట జిల్లా బిజెపి లీగల్ సెల్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ నందు నామాజీ ఎస్పి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ నాయకులు మదన్, భరత్ కుమార్ పాల్గొన్నారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన ఎంపీడీవో రాఘవ



**మానవపాడు, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** జోగులంబ గద్వాల జిల్లా, మానవపాడు మండల పరిధిలోని.. కలుకుంట్ల గ్రామం ప్రాథమికోన్నత పాఠశాల. మరియు ఏ బూడిదపాడు గ్రామం ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో రాఘవ సందర్శించి విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించడం జరిగింది. విద్యార్థులు సక్రమంగా స్కూలుకు హాజరయ్యే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్నం భోజనం పరిశీలించారు.విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలుకుంట్ల గ్రామ కార్యదర్శి మేరీ, ఏ బూడిదపాడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్ రెడ్డి, ఏ బూడిదపాడు గ్రామ కార్యదర్శి మహేష్, మరియు స్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భూ బాధిత రైతులకు ప్లాట్ల పట్టాలు మంజూరు చేయాలి

- **జిల్లా కలెక్టర్‌కు టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి వినతి**

**కొండాపూర్, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** మండలంలోని అలియాబాద్, తొగర్ పల్లి గ్రామాల భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం హామీ మేరకు అలియాబాద్, గ్రామంలో అసంపూర్తిగా ఉన్నటువంటి డబల్ బెడ్ రూమ్ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసి,ప్లాట్ల పట్టా సర్టిఫికెట్లు మంజూరు చేయాలని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు, కొండాపూర్ మాజీ ఎంపిటీసీ నరసింహారెడ్డి, మండల ముఖ్య నాయకుల బృందం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ను మంగళవారం కలిశారు.ఈ సందర్భంగా ప్రతినిధులు వినతిపత్రం అందజేస్తూ రైతులు సంవత్సరాలుగా పరిహారం కోసం ఎదురుచూస్తున్నారని, వారికి తక్షణమే ఇండ్లు,ప్లాట్ల పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.తొగర్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, “కొండాపూర్ మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి రైతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది” అని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ప్రతినిధుల వినతిని స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## వారానికి మూడు సదరం క్యాంపులు

- **ప్రతి క్యాంపులో 100 మందికి వైద్య పరీక్షలు**
- **జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య**



**సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** సదరం క్యాంపులు వారానికి మూడు రోజులు ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన సదరం క్యాంపును జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి వారానికి మూడు సార్లు సదరం క్యాంపు ఏర్పాటు చేసి ప్రతిరోజు 100 మందికి సదరం క్యాంపులో వైద్య పరీక్షలు నిర్వహించి ఆన్‌లైన్‌లో నమోదుచేసి ధ్రువపత్రాలను అందించడం జరుగుతుందని తెలిపారు. సదరం క్యాంప్‌నకు వచ్చే వికలాంగులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వికలాంగుల సదరం క్యాంపులు ఎకో ఫ్రెండ్లీ విధానంలో నిర్వహించాలని తెలిపారు. సదరం క్యాంపులో పాల్గొనడానికి ఇప్పటివరకు 1249 మంది ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు.ఈ నెలలో 14,16,18 21, 23, 25,28,30 తేదీల్లో సదరం క్యాంప్ ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఇంకా క్యాంపులు ఏర్పాటుచేసి పెండెనిగ్స్ ని పూర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న అభ్యర్థులందరికీ సదరం సేవలు అందించేలా క్యాంపులు ఏర్పాటు చేసి, పూర్తిచేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పిడి డిఆర్డిఓ జ్యోతి, జిల్లా సంక్షేమ అధికారి లలితా కుమారి . డి ఎం అండ్ హెచ్ఓ నాగనిర్మల, జిజిహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఫోన్లు పోగొట్టుకున్న 126 మందికి రికవరీ



**నాగర్ కర్నూల్, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో ఫోన్లు పోగొట్టుకున్న 126 మంది యొక్క ఫోన్లను రికవరీ చేసి సంబంధిత బాధితులకు జిల్లా ఎస్పీ అందజేశారు. వీటి యొక్క ధర అందాల 20 లక్షలు ఉంటుందని మీ యొక్క ఫోన్లు ఎక్కడైనా పడిపోతే మీకు సంబంధించిన పోలీస్ స్టేషన్లో లేదా సి ఈ ఐ ఆర్ ఆన్లైన్ పోర్టల్ కంప్లైంట్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు, ఎస్బిఎస్ఐ పర్వతాలు, ఐటీ కోర్ సిబ్బంది విక్రం తో పాటు వివిధ పోలీస్ స్టేషన్లకు సంబంధించిన కానిస్టేబుల్ లు మరియు ఫోన్ పోగొట్టుకున్న బాధితులు పాల్గొన్నారు. ఈ ఆన్లైన్ పోర్టల్ అందుబాటులో వచ్చినప్పటి నుంచి 4487 కంప్లైంట్స్ వచ్చాయని ఇందులో 1631 మందికి ఫోన్లు రికవరీ చేసి అందజేయడం జరిగిందని దీని ఖరీదు దాదాపుగా 2.5 కోట్లు ఉంటుందని జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలియజేశారు.

# పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు

- **జిల్లా ఉపాధి కల్పన అధికారి డాక్టర్ యం.ప్రియాంక**



**గట్టు, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలో మంగళవారం రోజున జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి తెలుగు మరియు ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల,భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా కెరీర్ గైడెన్స్ మరియు మోటివేషనల్ క్లాసులను నిర్వహించారు. గౌరవ జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు జోగులాంబ గద్వాల జిల్లా ఉపాధి కల్పన అధికారి డాక్టర్ యం.ప్రియాంక పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో ముఖాముఖిగా పాల్గొని తమ భవిష్యత్తు లక్ష్యాలను నిర్ణయించుకోవడానికి, సరైన కెరీర్ మార్గాన్ని ఎంచుకోవడానికి మరియు ఉన్నత విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రేరణ (మోటివేషన్) మరియు సలహాలు (గైడెన్స్) అందించారు.పదవ తరగతి అనేది మీ జీవితంలో ఒక ముఖ్యమైన మలుపు, ఇది మీ భవిష్యత్తుకు మొదటి మెట్టు మాత్రమే, మీపై మీకు దృఢమైన నమ్మకం ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని, వైఫల్యాల నుంచి నేర్చుకోవాలనీ, పెద్ద లక్ష్యాలు పెట్టుకుని, వాటిని సాధించడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని,ఇతరుల ఒత్తిడికి కాకుండా, మీకు ఏ రంగంలో ఆసక్తి ఉందో తెలుసుకుని, దానికి అనుగుణంగా కోర్సును ఎంచుకోవాలనీ, సమయపాలన పాటించడం ద్వారా బాగా చదువుకోవచ్చని, చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ నైపుణ్యాలు మరియు సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంచుకోవాలని, నేటి పోటీ ప్రపంచంలో నిలబడాలంటే నిరంతర అభ్యాసం (కంటిన్యూ లెర్నింగ్) అవసరం అని తెలియజేశారు.విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించి, దేశానికి మంచి పౌరులుగా ఎదగాలని, మరియు విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరు అవ్వాలని, పదవ తరగతి జీవితానికి చాలా విలువైనదిగా, జీవితంలో అనుకున్న లక్ష్యాలు రాణించాలంటే ప్రణాళికలతో కూడిన విద్యను అభ్యసించాలని విద్యార్థులకు వివరించారు.మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి విద్యార్థులకి మెనూ ప్రకారం ప్రతిరోజూ మంచి భోజనం అందించేలా చూడాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నల్లారెడ్డిగారికి తెలియజేశారు. చివరి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా 100% ఫలితాలు సాధించాలని, విద్యార్థులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులకు తెలియజేశారు.నేను చేయలేను,అనే ఆలోచనను వదిలేయాలని, విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా కెరీర్ గైడెన్స్ గురించి వారికి వివరించారు.కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీ చెన్నయ్య గారు, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. నల్లా రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు జిన్నా నరసింహులు గౌడ్, తెలుగు నరసింహులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయివేటుకు ధీటుగా విద్యాబోధన

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 14 (జనంసాక్షి) : జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రైవేటు బదులకు ధీటుగా నాణ్యమైన విద్యాబోధన అందుతోందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పాఠశాల పరిస్థితులను పరిశీలించారు.తరగతి గదులను పరిశీలిస్తూ విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడారు.విద్యార్థులు యూనిఫార్ములు, నోటుబుక్లు,పాఠ్యపుస్తకాలు అందుకున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఉపాధ్యాయుల దృష్టికి తేవాలని కలెక్టర్ సూచించారు.ఇప్పటివరకు పూర్తయిన సిలబస్పై సమీక్ష చేశారు.సామాన్య శాస్త్ర పాఠానికి సంబంధించిన పటాలను బోర్డుపై గీయించి, విద్యార్థుల అవగాహన స్థాయిని అంచనా వేశారు.బోర్డు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు.పరీక్షలపై భయపడకుండా స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు.పదవ తరగతి ప్రతి విద్యార్థి జీవితంలో కీలక మలుపని, క్రమశిక్షణతో కష్టపడి చదివితే ఉన్నత స్థానాలను సాధించవచ్చు అని కలెక్టర్ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. విద్యార్థుల హాజరు శాతం,సిలబస్ పురోగతి,బోధన నాణ్యతపై వివరాలు కలెక్టర్ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.ప్రతి రోజు ఉపాధ్యాయులు,విద్యార్థులు పూర్తి హాజరు నమోదు కావాలని ఆదేశించారు.చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక ప్రణాళికలతో వారిని మెరుగుపరచాలని సూచించారు.పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని,విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో నేర్చుకునేలా చూడాలని అన్నారు.సిలబస్ను నిర్ణీత సమయంలో పూర్తి చేయడంతో పాటు, పునరావృత పరీక్షల ద్వారా విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేయాలని సూచించారు.అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు.మెనూ ప్రకారం నాణ్యమైన,రుచికరమైన ఆహారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా కేజీబీవీ విద్యార్థిని ప్లక్ష్య స్వయంగా వేసిన కలెక్టర్ చిత్రపటాన్ని అందించగా,ఆమె ప్రతిభను కలెక్టర్ అభినందించారు.ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.భోజన్న, మండల ప్రత్యేక అధికారి అంజి ప్రసాద్,తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ పుష్పలత,ఇతర అధికారులు, ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- వరంగల్ ఈస్ట్ లో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



వరంగల్ బ్యూరో, అక్టోబర్ 14 (జనం సాక్షి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తోందని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. మంగళవారం వరంగల్ పట్టణంలోని శివనగర్ సాయి కన్వెన్షన్ హాల్ లో వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధి లోని వరంగల్ , ఖిలావరంగల్ మండలాల లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాది ముభారక్ రూ. 5,30,61,480/- రూపాయల చెక్కులను, రూ.35, 37, 700 ల చీఫ్ మినిస్టర్ రిలీఫ్ చెక్కులు, లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ధ్రువ పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ఏ నియోజకవర్గంలో ఇవ్వనని కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వరంగల్ తూర్పులో ఇస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రజల కోసం పని చేస్తున్నాయని ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీవో రిలీజ్ చేయడమే కాకుండా కేబినెట్ లోను అసెంబ్లీలోనూ తీర్మానం చేసి గవర్నర్కు పంపినట్లు చెప్పారు కానీ గవర్నర్ తీర్మానాన్ని ఆమోదించకపోవడం కాకుండా రాష్ట్రపతికి పంపడం జరిగిందని అన్నారు అయినా కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను బీసీలకు ఇవ్వాలని ఉద్దేశంతో ఎన్నికల నోటిఫికేషన్ కూడా విడుదల చేసినట్లు చెప్పారు కానీ బిజెపి టిఆర్ఎస్ రాజకీయ నాయకులు 42 శాతం రిజర్వేషన్లు రాకుండా అడ్డుపడుతున్నట్లు మంత్రి వివరించారు. కాంగ్రెస్ నే నిందించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా నియోజకవర్గంలో ఎవరైనా అర్హులైన వాళ్ళు ఉంటే ఇందిరమ్మ గృహాలకు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సురేఖ సూచించారు. రేషన్ కార్డుల సమస్య కూడా ప్రభుత్వం త్వరలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు సోమిశెట్టి ప్రవీణ్, ఉమా దామోదర్, పోశాల పద్మ, చింతాకుల అనిల్, భోగి సువర్ణ, కావేటి కవిత, పల్లం పద్మ, గుండు చందన పూర్ణచందర్, డి ఆర్ ఓ విజయలక్ష్మి, ఉప కమిషనర్ ప్రసన్నారాణి, కిల వరంగల్, వరంగల్ మండల తహశీల్దార్లు మహమ్మద్ ఇక్బాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి బరిలో కొత్తపల్లి విలాస్ రావు

సారంగాపూర్, అక్టోబర్ 14 (జనం సాక్షి) : నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి పోటీ ఆసక్తికరంగా మారింది. ఈ రేసులో సారంగాపూర్ మండలం అడెల్లి గ్రామానికి చెందిన విలాస్ రావు పేరు వినిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ పట్ల నిబద్ధతతో, విద్యావంతులుగా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్రతో ఆయన స్థానికంగా బలమైన నేతగా నిలిచారు. సారంగాపూర్ మరియు పరిసర ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి జిల్లాలో గమనించదగ్గది. పార్టీ కార్యకలాపాల్లో నిరంతరం పాల్గొంటూ, గ్రామస్థాయిలో కాంగ్రెస్ బేస్ను బలోపేతం చేయడంలో విలాస్ రావు కీలక పాత్ర పోషించారు. ఇతర ఆశావహుల పేర్లు వినిపిస్తున్నప్పటికీ,విలాస్ కి కాలేజీలో విద్య నేర్పడం వల్ల స్టూడెంట్స్ ప్రతి మండలంలో గ్రామ స్థాయిలో విస్తృత మద్దతు ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# సకల సదుపాయాలతో నాణ్యమైన విద్య

- విద్యా సంస్థల బలోపేతానికి ప్రభుత్వ కృషి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 14 (జనంసాక్షి) : ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్, లక్సెట్టిపేట మండల కేంద్రాలలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో అన్ని సదుపాయాలు కల్పించి నిష్ణాతులైన ఉపాధ్యాయులతో గుణాత్మక విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, శుద్ధమైన త్రాగునీటిని అందుబాటులో ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థుల హాజరు శాతాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ గైర్హాజరు అయినట్లయితే, అందుకు గల కారణాలను తెలుసుకోవాలని, విద్యార్థుల హాజరు శాతం పెంపొందించేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాల తరగతి గదులు, వంటశాల, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత పరిశుభ్రత పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని, పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులను సన్నద్ధం చేయాలని తెలిపారు. సెలవులు పూర్తిచేసుకుని తిరిగి పాఠశాలకు హాజరు కాని విద్యార్థుల తల్లిదండ్రులను ఫోన్ లో సంప్రదించి విద్యార్థులు పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు చర్యం తీసుకోవాలని తెలిపారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి వారి అభ్యాసనా సామర్థ్యాలను పరీక్షించారు. జిల్లాలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థలో విద్యనభ్యసించి నీట్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నిర్మల్ జిల్లాలో ఎం.బి.బి.ఎస్. సీటు సాధించిన విద్యార్థినిని స్ఫూర్తిగా తీసుకుని చదువులో రాణించాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వలస ఆదివాసీలపై ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపాలి

- తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్



ములుగు ప్రతినిధి, అక్టోబర్ 14(జనంసాక్షి) : ములుగు జిల్లా లో వున్న వలస ఆదివాసి గ్రామాలపై ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపాలని, దాడులకు పాల్పడిన అధికారులపై ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేయాలని కోరుతూ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐటీడీఏ ముందు ధర్నా నిర్వహించి ఏఓ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జెజ్జరీ దామోదర్, ములుగు జిల్లా అధ్యక్షులు దుర్గి చిరంజీవి మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి వలస ఆదివాసీ గ్రామాలపై ఫారెస్ట్ అధికారులు గత రెండు నెలల నుంచి దాడులు చేస్తూ వారి ఇళ్ళను కూల్చివేసి వారిపై భౌతికంగా దాడులు చేస్తున్నారని, మంగపేట మండలం శాంతినగర్ గ్రామంలో రెండుసార్లు వారి ఇళ్ళను కూల్చివేసి దాడికి పాల్పడంతో మనస్థాపానికి చెందిన సోయం సురేష్ అనే గ్రామస్తుడు పురుగుల మందు సేవించి ఆత్మ హత్యాయత్యానికి పాల్పడినట్లు తెలిపారు. అదేవిధంగా ఏటూరు నాగారం, కన్నాయిగూడెం, మంగపేట, తాడ్వాయి మండలలోని పలు గ్రామాల్లో సాగులో ఉన్నటువంటి పోడు భూములలో ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా కందకాలు త్రవుతున్నారని, వెంటనే ఫారెస్ట్ అధికారులు వలస ఆదివాసీ గ్రామాలపై దాడులు ఆపాలని, సాగులో వున్న భూములలో కందకాలు తవ్వడం నిలిపివేయాలని, ఆదివాసులపై దాడులకు పాల్పడిన అరెస్టు అధికారులపై ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు పూనం నగేష్, కుర్సం చిరంజీవి, ఊకే ప్రభాకర్, కోరం చిరంజీవి, తోలం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను అణిచివేసేందుకే అగ్రవర్ణ ఆదిపత్య కులాల కుట్రలు

- బిసి సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్
- చెన్నారావుపేట మండల కేంద్రంలో ధర్నా, రాస్తారోకో



చెన్నారావుపేట, అక్టోబర్ 14 (జనం సాక్షి): బిసిలను అణిచివేసేందుకే అగ్రవర్ణ ఆదిపత్య కులాలు కుట్రలు చేస్తున్నారని బిసి సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బిసి సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు బర్ల యాకయ్య ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బిసి రిజర్వేషన్లు అమలు కాకుండా హైకోర్టులో అగ్రకుల రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కావాలని హైకోర్టులో పిటిషన్ వేసి బిసిల రిజర్వేషన్లను కుట్రపూరితంగా ఆపడం జరిగిందన్నారు.తెలంగాణ రాష్టంలో 60 శాతానికి పైగా ఉన్న బిసిలను 79 ఏళ్లుగా అణిచివేతకు గురి చేస్తూ విద్య, వైద్య, ఉద్యోగం, ఉపాధి రంగాలతో పాటు రాజకీయ రంగంలో జనాభా దామాషా ప్రకారం వనరులు రాకుండా రాజకీయ అధికారం లేకుండా స్వతంత్ర భారత దేశంలో అణిచివేసేందుకు కొనసాగుతున్న కుట్రలో భాగమే అన్నారు. బిసి సంఘాల పోరాటాల ఫలితంగానే 42 శాతం రిజర్వేషన్లు సాధించుకునే సమయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు చూస్తే బిసి రిజర్వేషన్ల పై జిఓ ఇచ్చింది రెడ్డి ప్రభుత్వం అడ్డుకుంటుంది రెడ్డి కులాలు రెడ్డి జాగృతి అనేది స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. ఇప్పటికైనా బిసిలు ఆలోచన చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా కొంతమంది బిసి నాయకులు, ప్రజాప్రతినిధులు అగ్రవర్ణ పార్టీలకు చెంచాలుగా మారారని అటువంటి వారు ఇంకా ఎవరైనా ఉంటే సోయి తెచ్చుకుని 42 శాతం రిజర్వేషన్లు సాధించుకునేందుకు బిసి సంఘాలతో కలిసి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చెన్నూరి రవి ముదిరాజ్, జిల్లా అధికార ప్రతినిధి మరుపల వీరస్వామి, జిల్లా యూత్ అధ్యక్షుడు కడారి సురేష్, జిల్లా కార్యదర్శులు సంగెం రమేష్, మేరుగు శంకర్ లింగం, ఉపాధ్యక్షులు ముత్యం చేరాలు, మండల నాయకులు బుర్ర సుదర్శన్ గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమ నరేందర్, చెన్నారావుపేట మండల మహిళా అధ్యక్షురాలు బండి విజయ, చెన్నారావుపేట గ్రామ అధ్యక్షుడు తాళ్ళపెల్లి నర్సయ్య గౌడ్, ఉపాధ్యక్షులు కుండె కుమారస్వామి, చెన్నారావుపేట గ్రామ మహిళా అధ్యక్షురాలు ముంజ లక్ష్మీ, ప్రధాన కార్యదర్శి కారుపోతుల శ్రీదేవి, సాయికృష్ణ గౌడ్, కందాల వెంకటేశ్వర్లు, సంతోష్ గౌడ్, చిట్టి శ్రీనివాస్, మొర్రి కట్టయ్య, కొత్తపల్లి బోస్, తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ జిల్లా డిసిసి ఎన్నిక ప్రక్రియ ప్రారంభం



మహబూబాబాద్ బ్యూరో, అక్టోబర్ 14 (జనం సాక్షి): మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష ఎన్నికల ప్రక్రియలో భాగంగా సంఘటన్ సృజన్ అభియాన్ – తెలంగాణ కార్యక్రమం థీమ్ టీపీసీసీ ఆదేశాల మేరకు మహబూబాబాద్ శాసనసభ్యులు డా భూక్యా మురళీ నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ అబ్జర్వర్ దేబాసిస్ పట్నాయక్, టీపీసీసీ అబ్జర్వర్లు ఎమ్మెల్యే శంకర్, ఎం.డి. అవేజ్,ఇందిరా రావు పాల్గొనీ మాట్లాడుతూ ప్రజలలో నుండి ప్రజానాయకులను ఎంపిక చేయడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యం. ప్రతి జిల్లాలో స్థానిక నాయకులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరిస్తున్నాం. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి ఆసక్తి గల ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి నాయకుడితో వ్యక్తిగతంగా చర్చించి, వారి అభిప్రాయాలను టీపీసీసీ మరియు ఏఐసీసీకి పంపుతాం. ఈ విధానంతో పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా మురళీ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల మనసులో ఉన్న నిజమైన ప్రజాస్వామ్యానికి ప్రతీక. నాయకత్వం ప్రజల అభిప్రాయాలతో, ప్రజల అంగీకారంతో ఎంపిక అవుతుందంటే అదే నిజమైన ప్రజాస్వామ్యం. ఈ సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా మనం ముందుకు వెళ్తున్నాం అని అన్నారు. అలాగే సమీక్షలో దరఖాస్తు ఫారం ను విడుదల చేసి, ఏఐసీసీ మరియు టీపీసీసీ అబ్జర్వర్లకు అందజేశారు. అనంతరం జిల్లా స్థాయి నాయకులతో వ్యక్తిగతంగా (సీక్రెట్గా) అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించబడింది. సేకరించిన అభిప్రాయాలను టీపీసీసీకి సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జన్నా రెడ్డి భరత్ చందర్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, యూత్ అధ్యక్షులు సురేష్, జిల్లా నాయకులు మండల నాయకులు, పట్టణ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళా సంక్షేమానికి పెద్దపీట

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు : వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



స్టేషన్ ఘన్పూర్, అక్టోబర్ 14 (జనంసాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని, సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరుమీదనే అమలు చేస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఎస్ కన్వెన్షన్ లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణి కార్యక్రమానికి వారిరువురు జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 256మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎంపీ డాక్టర్ కడియం కావ్య , ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంజూరు పత్రాలను అందజేశారు. అలాగే డిఆర్ డిఏ ఆధ్వర్యం లో లబ్ధిదారులకు వ్యవసాయ మోటార్లను పంపిణి చేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని పేద ప్రజల స్వంత ఇంటి కళను సాకారం చేయాలనే లక్ష్యం తో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టిందని తెలి పారు. నియోజకవర్గంలో 3వేల 500 ఇల్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 3360ఇళ్లకు మంజూరు పత్రాలు అందజేశామని అందులో 95శాతం ఇల్లు పనులు ప్రారంభమై వివిధ దశలలో ఉన్నాయని తెలిపారు.

ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రె స్ పార్టీ ఎల్లప్పుడూ మహిళల పక్షపాతిగా నిలిచిందని అన్నారు. మహిళలు బాగుపడితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి 1,075 కోట్లతో నియోజకవర్గంలో విస్తృత అభి వృద్ధి కార్యక్రమాలు చేపట్టారని ఎంపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ, హన్మకొండ జిల్లాల హౌసింగ్ పీడీలు మాత్రు నాయక్, హరికృష్ణ, స్టేషన్ ఘనపూర్ ఆర్డీవో వెంకన్న,డిఈలు, ఏఈలు, ఎంపిడివోలు, నియో జకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ ఇళ్లలబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# దొంగల ముఠా పట్టివేత



నర్సంపేట, అక్టోబర్ 14 (జనంసాక్షి) : నియోజకవర్గంతోపాటు పలు ప్రాంతాలలో ముఠాగా ఏర్పడి దొంగతనాలను చేస్తున్న ఐదుగురు నిందితులను నర్సంపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎ సి పి రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం మహబూబాద్ జిల్లా కి చెందిన మహ్మద్ ఇమ్రాన్, మాదాసు నవీన్, మాదాసు భార్గవి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కి చెందిన కుంజా విజయ, బత్తుల రాజేశ్వరి లు ఒక గ్రూపు గా ఏర్పడి రాత్రి సమయం లో తాళం వేసి ఉన్న ఇండ్ల లో దొంగతనాలను చేసేవారన్నారు. నర్సంపేట పరిసరప్రాంతాల గ్రామాలతో పాటు,మహబూబాద్ లో దొంగతనాలు చేసేవారని పేర్కొన్నారు. ఇటీవల వారు దొంగలించిన బంగారం, వెండి నగలను వరంగల్ లో ఏదైనా ఒక షాప్ లో అమ్మాలనే ఆలోచనతో మహ్మద్ ఇమ్రాన్ మోటార్ సైకిల్ పై, మిగతా వారు ఆటో లో మహబూబాద్ నుండి నర్సంపేట మీదుగా వెళుతూ అనుమానాస్పదంగా ఉండగా అదుపులోకి తీసుకొన్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి మోటార్ సైకిల్, ఆటో, 4 గ్రాముల బంగారు ఉంగరం,89 గ్రాముల వెండి పట్టగొలుసులు, 5 గ్రాముల జత చెవి కమ్మల బుట్టాలు,15 గ్రాముల అమ్మవారి విగ్రహం, సుమారు 14.066 గ్రాముల బంగారు గొలుసు, 85.410 గ్రాముల ఒక జత వెండి పట్టగొలుసు లతో పాటు 5 ఫోన్ లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట టౌన్ ఎస్ఐ రవికుమార్. రూరల్ ఎస్సై అరుణ్. ఎస్సై స్వాతి. సిబ్బంది పాల్గొన్నారు



# సీఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 14( జనం సాక్షి) : కాజీపేట లోని పి.జి.ఆర్ గార్డెన్స్ లో బుధవారం జరిగే నర్సంపేట శాసనసభ్యులు దొంతు మాధవరెడ్డి మాతృమూర్తి దశ దిన ఖర్మ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్నారు.ఈ సందర్భంగా మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులతో కలసి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి భద్రత కోసం తీసుకోవల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
15 అక్టోబర్ 2025

# పారదర్శకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక



**తుంగతుర్తి, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే ఆదేశాల మేరకు తెలంగాణలో డిసిసి అధ్యక్షుల ఎంపిక లో నూతన విధానం చేపట్టామని ఏఐసీసీ ఎన్నికల పరిశీలకుడు శరత్ రౌతు, స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మంగళవారం తుంగతుర్తి నియోజకవర్గం కేంద్రం లోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు డిసిసి అధ్యక్షుడు నియామకం కోసం పార్టీలోని సీనియర్ నాయకులు, ఆశవాహులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒక్కొక్కరిగా వారి అభిప్రాయాలను లిఖితపూర్వకంగా తీసుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కమిటీ అధ్యక్షుని ఎంపిక పారదర్శకంగా, ప్రజాస్వామ్య యుతంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రజాస్వామ్య యుతంగా,పార్టీ నాయకులు, కార్యకర్త మనోభావాలను, అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని డిసిసి అధ్యక్షుని నియామకం చేపట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు.అందులో భాగంగానే తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో సమావేశం నిర్వహించామని తెలిపారు. డిసిసి అధ్యక్షుడు నియామకం తర్వాత బ్లాక్,మండల, గ్రామస్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఎంపిక నిర్వహిస్తామని తెలిపారు.క్షేత్రస్థాయిలో పర్యటించి డిసిసి అధ్యక్షుడు నియామకానికి సంబంధించి అందరి అభిప్రాయాలను తీసుకుంటామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వ్యక్తికి, అందరినీ సమన్వయపరిచే వ్యక్తికి, అందరి అభిప్రాయాలను తీసుకొని డిసిసి అధ్యక్షుడిని ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.పార్టీలో కష్టపడి పని చేసిన వ్యక్తికి తప్పకుండా న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు.రాహుల్ గాంధీ దిశా నిర్దేశంతో పారదర్శకంగా డిసిసి అధ్యక్షుని ఎంపిక చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆలోచనకు అనుగుణంగా పార్టీకి అంకితభావంతో పనిచేసే వారిని,అందరినీ సమన్వయంతో పార్టీని ముందుకు నడిపించే వ్యక్తిని ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. పార్టీలో ఎవరైనా డిసిసి అధ్యక్షుని కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. డిసిసి అభ్యర్థి ఎంపికకు సంబంధించి పార్టీ శ్రేణులు వ్యక్తిగతంగా కానీ, సమిష్టిగా కానీ తమ అభిప్రాయాలను వెల్లడించవచ్చని అన్నారు.ఈ సమావేశంలో సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, తుంగతుర్తి మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, జిల్లా మహిళా కమిటీ అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధ కిషన్ రావు, పీసీసీ అధికార ప్రతినిధి అన్నే పర్తి జ్ఞాన సుందర్, పీసీసీ సభ్యులు గుడిపాటి నరసయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న,రాష్ట్ర నాయకులు తండు శ్రీనివాస్ యాదవ్, యోగానంద చార్యులు, ఆకుల బుచ్చిబాబు, పిసిసి, డిసిసి కార్యవర్గ సభ్యులు,9 మండలాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ, సంవిధాన్, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు,గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నియోజకవర్గ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల సాధనకు కురువ సంఘం సంపూర్ణ మద్దతు



**తాండూరు, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** 42 శాతం రిజర్వేషన్ల సాధన కొరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాల జేఏసీ పిలుపుమేరకు ఈనెల 18న జరిగే రాష్ట్ర బందుకు తాండూరు డివిజన్ కురువ సంఘం సంపూర్ణ మద్దతును కురువ సంఘం సభ్యులు ప్రకటించారు. మంగళవారం తాండూరులోని శ్రీ బీరప్ప స్వామి సమావేశ భవనంలో తాండూరు డివిజన్ కురువ సంఘం సభ్యులు కలిసి సమావేశమై రాష్ట్రం బందుకు మద్దతు తెలిపాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. 42 శాతం రిజర్వేషన్లు పట్ల హైకోర్టు స్టే విధించడం బాధాకరమ అన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని సుప్రీంకోర్టులో తమ వాదనలు బలంగా వినిపించి బీసీలకు న్యాయం చేయాలని అన్నారు. కేవలం స్థానిక సంస్థల్లో మాత్రమే కాకుండా విద్య ఉద్యోగాల్లో కూడా 42 శాతం పొందడం మన హక్కుగా భావించాలని అన్నారు. పార్టీలకు అతీతంగా బీసీ నాయకులు అందరూ ఏకమై రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఉద్యమాన్ని నిర్మించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి సాధించుకునే వరకు విశ్రమించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూరు డివిజన్ కురువ సంఘం గౌరవాధ్యక్షులు న్యాయవాది గోపాల్,తాండూర్ డివిజన్ అధ్యక్షులు నాగారం జగదీష్, డివిజన్ ఉపాధ్యక్షులు పూజారి పాండు, రాష్ట్ర ఒగ్గుడోలు కళాకారుల ఉపాధ్యక్షులు పూజారి మల్లప్ప, రిటైర్డ్ ఎమ్మార్వో శేఖర్, రిటైర్డ్ ఉద్యోగి ఏఈఓ హనుమయ్య, తాండూరు మండల్ కురువ సంఘం ఉపాధ్యక్షులు బిజ్వారం కృష్ణప్ప, కోశాధికారి దస్తప్ప, గొర్రె కాపర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లె వెంకటయ్య, దోమ భీమయ్య, ఆర్ వెంకటయ్య, మిట్టి మహేష్, వీరన్న, వెంకటేష్, మల్కప్ప,కురువ శివకుమార్, ఖాజాపూర్ కుల పెద్దలు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** ప్రభుత్వ రెసిడెన్షియల్ ,కేజీబివి పాఠశాల, కళాశాలల్లో చదివే విద్యార్థులు 10వ తరగతి, ఇంటర్ లో 70 శాతానికి పైగా ప్రతి సబ్జెక్టులో మార్కులు సాధించేలా సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ లో సంక్షేమ అధికారులు,విద్యాశాఖ, కేజీబివి ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ , కేజీబివి పాఠశాల, కళాశాలల్లో ఇక నుండి ఆకస్మిక తనిఖీ చేపట్టినపుడు ఎవరైనా విధుల్లో లేకపోతే చర్యలు తీసుకోవటం జరుగుతుందని, సిబ్బంది సమయపాలన పాటించాలని, సిబ్బంది హాజరు వివరాలు, విద్యార్థుల హాజరు వివరాలు ప్రతి రోజు నివేదిక ఇవ్వాలని సూచించారు.అధికారులు పాఠశాలలకు వచ్చే గుడ్లు, పాలు, చికెన్, వంట సామాగ్రి సమయానికి చేరిందా లేదా తెలుసుకోవాలని, భోజనం ఎలా ఉంటుందో పరిశీలించాలని, కాంట్రాక్టర్ నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి విద్యార్థికి ఆర్ బిఎస్ కె వైద్యులచే ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్ కార్డు తయారు చేసేలా చూడాలని స్పష్టం చేశారు.కేజీబీవీలలో ఎక్కడైనా అవసరం ఉంటే త్రాగునీరు, టాయిలెట్స్, ట్యాప్స్,సీలింగ్ ప్యాన్స్,లైట్స్ లాంటి వాటికి మరమ్మత్తులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, ఆరోగ్యం బాగుండేలా చూసి, నాణ్యమైన భోజనం అందించి,వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో సంక్షేమ అధికారులు శంకర్, దయానంద రాణి, నరసింహారావు, శ్రీనివాస్ నాయక్,డిడబ్ల్యూఓ నరసింహారావు,డిఈఓ అశోక్, జిసిడిఓ పూలన్,టిజీఈడబ్ల్యూఐసి డిఈ రమేష్, డిసిఓలు, కేజీబివి ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాన్‌దొడ్డిలో భారీ ఇసుక డంప్ సీజ్



**రాజోలి, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** మండలంలోని మాన్‌దొడ్డి గ్రామంలో మంగళవారం భారీ ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తుంగభద్ర నది నుంచి అక్రమంగా తరలించిన ఇసుకను గ్రామంలోని పలుచోట్ల అక్రమార్కులు ఇసుక డంపులను నిల్వ చేశారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతోందంటూ అధికారులకు ఫిర్యాదు అందడంతో హుటాహుటిన రాజోలి తహసీల్దార్ ఆధ్వర్యంలో ఆర్ఐ చంద్రకాంత్, మైనింగ్ సిబ్బంది బ్రహ్మానందం రెడ్డి ఆయా చోట్ల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా 60 ట్రాక్టర్ల ఇసుక ట్రిప్పులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

# పెన్‌పహాడ్‌లో పోలీసుల కట్టుదిట్టమైన తనిఖీలు

**పెన్‌పహాడ్, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని ప్రజల భద్రతను మరింత గట్టిగా కాపాడేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు ప్రవేశపెట్టింది. మెరుగైన భద్రతా రక్షణను కల్పించడం, ప్రభావవంతమైన పోలీసు పర్యవేక్షణ ఎఫెక్టివ్ పోలీసింగ్ దృశ్యాత్మక పోలీసు బాధ్యతలు విజుబుల్ పోలీసింగ్ అమలు చేయడం లక్ష్యంగా, మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు జిల్లాలోకి వచ్చి–పోయే అన్ని మార్గాలు, సరిహద్దులను పూర్తిగా అష్టదిగ్బంధనం అన్ని వైపులా మూసివేత చేసి, పోలీసు నాఖాభంది కార్యక్రమాన్ని ఘోషణాత్మకంగా ప్రారంభించారు.ఈ చర్యలు అనుకూల క్రిమినల్ శ్రేణులను గుర్తించి అరికట్టడానికి, మండలంలో శాంతి భద్రతలను బలోపేతం చేయడానికి రూపొందించబడ్డాయి. జిల్లా ఎస్పీ కె. నర్సింహా, ఐపీఎస్ ఆదేశాల మేరకు, పెన్ పహాడ్ ఎస్సై కాస్తాల గోపికృష్ణ తన సిబ్బందితో కలిసి సాయంత్రం 5 గంటలకు వెహికల్ చెకింగ్‌ను అధికారికంగా ప్రారంభించారు. జిల్లా సరిహద్దులపై అన్ని కీలక ఎంట్రీ–ఎగ్జిట్ పాయింట్ల వద్ద పోలీసు బలగాలు మొత్తం శ్రద్ధ పెట్టారు. వివిధ రకాల వాహనాలు – ప్రైవేట్ కార్లు, టూ–వీలర్లు, లారీలు, బస్సులు, ట్రక్కులు – ప్రయాణికులు, చర్మరాహికాలు, సందుగ్గలు, మాటీరియల్ లోడ్‌లపై కఠిన తనిఖీలు చేస్తున్నారు. మెటల్ డిటెక్టర్లు, డాగ్ స్క్వాడ్‌లు, సీసీటీవీ కవరేజ్‌తో ప్రత్యేక బృందాలు మొదలుపెట్టి, ఆయుధాలు, మాదక ద్రవ్యాలు, సందుభాషణాలు, దొంగతోట్లు, మత్సర కారకులను గుర్తించడానికి ప్రత్యేకంగా శ్రద్ధ చూపుతున్నారు. ఈ తనిఖీల్లో ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించబడితే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు .ఎస్పీ నర్సింహా మార్చి 2025 నుంచి సూర్యాపేట జిల్లా ఎస్పీగా పనిచేస్తూ, ఇలాంటి ప్రో–ఆక్టివ్ భద్రతా ప్రణాళికలను రెగ్యులర్‌గా అమలు చేస్తూ ప్రజల జీవితాలను సురక్షితంగా మార్చడానికి కృషి చేస్తున్నారు. ఈ నాఖాభంది కార్యక్రమం ప్రజలకు మరింత భరోసా కల్పిస్తూ, మండలంలో జరగగల బెదిరింపులు, దాడులు, దొంగతోట్లు, మత్సరాలు వంటి క్రైమ్‌లను ముందుగానే అడ్డుకుంటుందని అధికారులు స్పష్టం చేశారు. అదేవిధంగా పోలీసు శాఖ ఈ చర్యలను ప్రజల సహకారంతో సమర్థవంతంగా పూర్తి చేయాలని, ఏవైనా



అనుమానాలు లేదా సమాచారం ఉంటే స్థానిక పోలీసు స్టేషన్‌లకు, ఎమర్జెన్సీ నంబర్ 100కు లేదా 112కు వెంటనే సంప్రదించమని పిలుపునిచ్చారు. మండల వ్యాప్తంగా పోలీసు శాఖ ఈ రకమైన కార్యక్రమాల ద్వారా ప్రజా–కేంద్రీకృత భద్రతా వ్యవస్థను మరింత బలపడేలా చేస్తోంది అన్నారు. అదేవిధంగా ఈ చర్యలు మండల ప్రజల రోజువారీ జీవనాన్ని సురక్షితంగా మార్చి, క్రైమ్ రేట్‌ను తగ్గించడానికి మైలురాయిగా మారతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రజలకు మెరుగైన భద్రత కల్పించడమే లక్ష్యం

- జిల్లాలోకి వచ్చి పోయే అన్ని మార్గాలలో పటిష్ట నిఘా
- జిల్లా ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** జిల్లా ఎస్పీ కె.నరసింహ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం జిల్లా నలుమూలల వచ్చిపోయే అన్ని మార్గాలలో నిర్వహిస్తున్న నాకాబంది కార్యక్రమాన్ని సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి టేకుమట్ల గ్రామం జాతీయ రహదారి ఖమ్మం హైవేపై నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ కె.నరసింహ ప్రత్యేకంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన భద్రతా రక్షణ కల్పించడం లక్ష్యంగా, ఎఫెక్టివ్ పోలీస్, విజుబుల్ పోలీసింగ్ ఉద్దేశంలో భాగంగా సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు జిల్లాలోకి వచ్చి పోయే అన్ని మార్గాలను, సరిహద్దులను దిగ్బంధనం చేసి పోలీసు నాకాబంది నిర్వహించినట్లు తెలిపారు. నాకాబంది ద్వారా అక్రమ రవాణా, అనుమానితుల కదలికలు, రౌడీషీటర్స్ కదలికలు, గంజాయిరవాణా చేసే వారి కదలికలు, పశువుల అక్రమ రవాణా, నిషేధిత పదార్థాల అక్రమ రవాణా, అంతర్రాష్ట్ర అంతర్ జిల్లా నేరస్తుల కదలికలు గుర్తించి నివారించడం, నేరాలను అదుపు చేయడంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని చెప్పారు. దీనిలో భాగంగా జిల్లాలోని 23 ప్రాంతాలలో నాకాబంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూలల ఉన్న సరిహద్దు ప్రాంతాలు, అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు, రామాపురం ఎక్స్ రోడ్, దొండపాడు, పులిచింతల ప్రాజెక్టు, అంతర్ జిల్లా సరిహద్దు ప్రాంతాలు తిరుమలగిరి వెలిశాల, మద్దిరాల వద్ద కుంటిపల్లి, కోదాడ పట్టణం, సూర్యాపేట పట్టణం, నూతనకల్ మండలం బిక్కుమల్ల,నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి, జాన్ పహాడ్, మట్టపల్లి బ్రిడ్జి అనేక ప్రాంతాలలో ఏకకాలంలో నాకాబంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. టేకుమట్ల వద్ద జరిగిన తనిఖీలలో సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, పెన్ పహాడ్ ఎస్ఐ శ్రీకాంత్, సూర్యాపేట రూరల్ ఎస్ఐ బాలు నాయక్, ఆర్ఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు.మంగళవారం సూర్యాపేట మండలంలోని కాసరబాద్ గ్రామంలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు.జిల్లా వ్యాప్తంగా 336 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి కృషి ఫలితమే తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలకు శ్రీరాంసాగర్ జలాలు వచ్చాయన్నారు.రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో నాటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, కాంటాలు, టార్పాలిన్లు, గన్ని బ్యాగులు కొరత లేకుండా చూడాలని అన్నారు.ధాన్యాన్ని ఆరబెట్టి తేమశాతం తక్కువగా ఉండే విధంగా తూర్పారబెట్టి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు.నాణ్యతా ప్రమాణాలు పాటించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామన్నారు. గ్రేడ్–ఏ ధాన్యానికి రూ.2389, సాధారణ రకం ధాన్యానికి రూ.2369 మద్దతు ధర పొందాలన్నారు.సన్నరకం ధాన్యానికి అదనంగా క్వింటాల్ రూ.500 బోనస్ లభిస్తుందని అన్నారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు.రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వరి ధాన్య కొనుగోలు కేంద్రాలకే విక్రయించాలన్నారు.వ్యవసాయ అధికారుల వద్ద ఉన్న వరి కోతల వివరాల ఆధారంగా రైతుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లేలా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. రైతులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, ఏపీఎం మైసయ్య, సీసీ యాదగిరి, విజయభాను, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ పొలగాని సైదులు, సంకరమద్ది వెంకట్ రెడ్డి, సరిత, వసంత, యల్లమ్మ, షార్ధ, నాగమ్మ, పిసిసి ఎస్సి సెల్ వైస్ చైర్మన్ చింతమళ్ళ రమేష్, దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ళ కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పందిరి మల్లేష్, పట్టణ ఓబీసీ సెల్ అధ్యక్షుడు రావుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పెనుబల్లి ప్రధాన రహదారే డ్రైనేజీ..

- మురుగు కాలువలు లేని పెనుబల్లి ప్రధాన రహదారి
- వర్షం పడితే నడిఊరులో ప్రవహించే వాగులా తలపిస్తుంది
- మెరుగైన రహదారి గ్రామస్థులకు కలగానే మిగిలిపోతుంది
- ప్రభుత్వాలు మారిపోతున్నాయి రహదారి రాత మారట్లే..

**పెనుబల్లి, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** మండల కేంద్రం పెనుబల్లిలో డ్రైనేజీ సమస్య స్థానిక ఎన్నికల్లో ప్రధాన సమస్యగా ముందుకు రానుంది. ఐదు వేల జనాభా కలిగిన పెనుబల్లి గ్రామపంచాయతీలో అంతర్గత రోడ్ల నిర్మాణం జరుగుతున్నా గ్రామ ప్రధాన రహదారిలో డ్రైనేజీ సమస్య అపరిష్కృతంగానే ఉంది,రోడ్లు భవనాల శాఖ పరిధిలోకి వచ్చే సుమారుగా మూడు కిలోమీటర్ల పొడవైన తారు రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు (డ్రైనేజీ)లేవు, కొద్దిపాటి వర్షం వచ్చినా రహదారే కాలువగా మారిపోతుంది. ఊరు మధ్య ప్రవహించే వాగు లాగా



కనిపిస్తుంది, దీని తలరాత ఎప్పుడు మారుతుందా అని ఎదురుచూస్తున్న గ్రామస్తులు, అభివృద్ధి పేరుతో భారీ వాహనాల కోసం 1978–79 ప్రాంతంలో పెనుబల్లికి తూర్పు వైపుగా (బైపాస్ రోడ్డు) ప్రస్తుతం జాతీయ రహదారి నిర్మాణం జరగటం వలన,ఈ పెనుబల్లి రహదారికి అభివృద్ధికి బదులు వెనక బాటు గ్రహణం పట్టింది, గ్రామ ప్రజలు అత్యధికంగా వినియోగించే ఈ రహదారి గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు, రోడ్డుకు ఇరువైపులా ఎత్తుగా గృహ నిర్మాణాలు చేపట్టడంతో ఈ రహదారి మరింత లోతట్టుగా రహదారిగా మారింది,ఈ కారణంగా గృహాలలో వాడిన నీరు రోడ్డుపై నిత్యం పారుతుంది, ఈ సమస్య పాలకుల చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోంది,పెరుగుతున్న జనాభాకనుగుణంగా రహదారిని ఎత్తుగా వెడల్పుచేసి ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించాలనేది ప్రజల చిరకాల కోరిక,ఈ గ్రామానికి వచ్చే ప్రతి ప్రజా ప్రతినిధిని ప్రజలు ముందుగా కోరుకునేది ఈ సమస్య పరిష్కారాన్నే, లింగగూడెం, గంగదేవిపాడు గ్రామాల ప్రజలు ఈ రహదారి నుంచే తమ గ్రామాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు,ఎంతో రద్దీగా ఉంటుంది ఈరహదారి, ఇరుకైన ఈ రోడ్డులో సైకిళ్లు,మోటారు వాహనాలు,ట్రాక్టర్లు,అప్పుడప్పుడు లారీలు,వాటిమధ్యలో నడిచేవారు ఇలా ఊహించుకుంటేనే భయంకరంగా ఉంటుంది,ఎప్పుడు ఏ ప్రమాదం జరిగిద్దేమోననే భయాందోళనలోనే ప్రజలుంటున్నారు,స్వాతంత్ర్యానంతరం ఈఏడెనిమిది దశాబ్దాల కాలంలో జనాభా ఎన్నో రెట్లు పెరిగినా ఈ రహదారి అలాగే ఉండటం సమశ్యాత్మకంగా మారింది, ఎంతమంది పాలకులు మారినా దీని రూపు మారడంలేదు, మెరుగైన రహదారి కలగానే మిగిలిపోతుంది, ఈ స్థానిక ఎన్నికల నేపథ్యంలోనైనా ఈ సమస్యకు ఒక పరిష్కారం దొరుకుతుందేమోనని గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

## కపాస్ కిసాన్ యాప్ పోస్టర్ ఆవిష్కరణ



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 14 (జనంసాక్షి) :** కనీస మద్దతు ధరలు, పత్తి నాణ్యత ప్రమాణాలు, కపాస్ కిసాన్ యాప్ పై అవగాహన నిమిత్తం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ మంగళవారం కలెక్టర్ చాంబర్ నందు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పత్తి రైతులకు కపాస్ కిసాన్ యాప్ స్లాట్ బుక్ చేసుకోవడానికి పూర్తి అవగాహన కల్పించాలని అన్నారు. రైతులు స్లాట్ బుక్ చేసుకునే ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత ఏఈఓలు రైతులకు యాప్ నందు స్లాట్ బుక్ చేసుకునే విధంగా తర్ఫీదు ఇవ్వాలని అన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి అన్ని కొనుగోలు కేంద్రాలకు సరిపడా పరికరాలు సమకూర్చుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డిఏఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వరశర్మ, మార్కెటింగ్ కమిటీ సహాయ కార్యదర్శి ఎం.వెంకట్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.




# రూ.1.30 లక్షలకు బంగారం!

• నిపుణుల అంచనా..



బంగారం ధరల పెరుగుదల తగ్గే సూచనలు కనిపించ డం లేదు. 2025 ప్రారంభం నుంచి ఇప్పటికే దాదాపు 50 శాతం పెరిగిన గోల్డ్ రేటు.. 2022 ధరలతో పోలిస్తే 140 శాతం ఎక్కువని స్పష్టమవుతోంది.ప్రస్తుత పరిస్థితులు పసిడి ధరలను మరింత పెంచే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం రాబోయే ధంతేరాస్ (ధనత్రయోదశి), దీపావళి.ధంతేరాస్‌లో బంగారం ధరలు రికార్డు స్థాయిలో పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ పండుగ సమయంలో గోల్డ్ రేటు రూ. 1.30 లక్షలకు చేరుకుంటుందని చెబుతున్నారు. 2026 ప్రారంభం నాటికి ఈ ధర రూ. 1.50 లక్షలు అవుతుందని అంచనా వేస్తున్నారు.మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో.. ఈ వారం బంగారం ధరలు ఇప్పటికే 10 గ్రాములకు రూ. 1,22,284 వరకు పెరిగాయి. రెలిగేర్ బ్రోకింగ్ లిమిటెడ్‌లో రీసెర్చ్ అజిత్ మిశ్రా ప్రకారం.. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు వంటివన్నీ గోల్డ్ రేటు పెరగడానికి కారణమవుతున్నాయి.ఈ రోజు భారతదేశంలో బంగారం రేటు గరిష్టంగా రూ. 2950 పెరిగింది. దీంతో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 1,28,350 వద్దకు చేరింది. 22 క్యారెట్స్ గోల్డ్ రేటు రూ. 2700 పెరిగి.. రూ. 1,17,650 వద్దకు చేరింది. దీన్ని బట్టి చూస్తే.. గోల్డ్ రేటు ధంతేరాస్ నాటికంటే ముందే రూ. 1.30 లక్షలకు చేరుకుంటుందని తెలుస్తోంది.



## రూ.15 వేల కోట్ల పెట్టుబడితో 14వేల ఉద్యోగాలు..

**న్యూఢిల్లీ:**తైవానీస్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్ తమిళనాడులో రూ.15,000 కోట్ల తాజా పెట్టుబడిని ప్రకటించింది. ఈ ఇన్వెస్ట్‌మెంట్‌తో రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ రంగంలో భారీగా ఉద్యోగ కల్పన జరగనుందని కంపెనీ తెలిపింది.ఈ పెట్టుబడుల ద్వారా 14,000 ఉద్యోగాలు లభిస్తాయని సంస్థ అంచనా వేస్తుంది.ఫాక్స్‌కాన్ చేయబోయే పెట్టుబడి విలువ ఆధారిత ఎలక్ట్రానిక్స్ తయారీ, ఆర్ అండ్ డీ ఇంటిగ్రేషన్, ఏఐ నేతృత్వంలోని అధునాతన టెక్ కార్యకలాపాలు, బ్యాటరీ టెక్నాలజీలు వంటి అత్యాధునిక రంగాలపై కేంద్రీకృతమై ఉంటుందని కంపెనీ తెలిపింది. వీటిపై దృష్టి పెట్టడం ద్వారా కంపెనీ ఉత్పాదకత, ఆవిష్కరణల్లో ముందంజలో ఉండాలని చూస్తోంది.

**ఆమోదాలు వేగవంతం చేయడానికి..**

ఈ పెట్టుబడి ప్రకటనలో అత్యంత ముఖ్యమైన అంశం 'గైడెన్స్ తమిళనాడు'. ఇది భారతదేశంలోని మొదటి ఫాక్స్‌కాన్ డెస్క్ అవుతుంది. కంపెనీ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి, ఫాస్ట్ ట్రాక్ ఆమోదాలను వేగవంతం చేయడానికి, రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రాజెక్టులను సమన్వయం చేయడానికి ఈ డెస్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. తమిళనాడు పరిశ్రమల శాఖ ఈ ప్రాజెక్ట్‌కు పూర్తి మద్దతు ఇస్తుంది. సింగిల్ విండో ఫెసిలిటేషన్ ద్వారా ఆమోదాలను వేగవంతం చేస్తుంది. టాలెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, ఎగ్జిక్యూటివ్ కోఆర్డినేషన్ మెకానిజమ్‌ల ద్వారా మానవ వనరుల అవసరాలను తీర్చడంలో కూడా ప్రభుత్వం సహకరిస్తుంది. ఫాక్స్‌కాన్ కంపెనీ ఇండియాలో యాపిల్ ఉత్పత్తులు తయారు చేస్తోంది.

## 'పాన్‌డబ్బాలో ఆర్థిక పాఠాలు నేర్చుకున్నా'




ప్రముఖ నటుడు, పారిశ్రామికవేత్త వివేక్ ఒబెరాయ్ సంపద ఫోర్బ్స్ ఇండియా ప్రకారం దాదాపు రూ.1,200 కోట్లుగా ఉంది. 'సాథియా', 'మస్తీ', 'రక్తచరిత్ర' వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన ఇప్పుడు సినిమాల్లో తక్కువగానే కనిపిస్తున్నారు. ప్రస్తుతం దుబాయ్ వెళ్లి ఫుల్ టైమ్ ఆంత్రప్రెన్యూర్‌గా మారారు. తన వ్యాపార ప్రయాణం ఏదో ఫ్యాన్సీ కార్పొరేట్ ఆఫీసుల్లోనో లేదా ప్రముఖ బిజినెస్ స్కూల్స్‌లోనో మొదలవలేదు. తన కాలేజీ బయట వీధుల్లో పాన్‌డబ్బా నడుపుతున్న ఒక చిరు దుకాణాదారుడి నుంచి మొదలైందని చెప్పారు. ఇటీవల ఒబెరాయ్ ఓ ఇంటర్వ్యూలో కొన్ని విషయాలు పంచుకున్నారు.'మా కాలేజీ బయట పాన్‌డబ్బా, బీడీ స్టాల్ నడుపుతున్న సదా అనే వ్యక్తి నుంచి ఎన్నో వ్యాపార మెలకువలు నేర్చుకున్నాను. సదా నుంచి కేవలం లాభనష్టాల గురించి మాత్రమే కాదు.. డబ్బు నిర్వహణ, చిన్న తరహా పెట్టుబడులు, ఆర్థిక సహకారం..వంటి ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. అది మైక్రోఫైనాన్సింగ్‌కు సంబంధించి ఓ డాల్ఫిన్ వెర్షన్' అన్నారు. వివేక్ తన పదహారో ఏట స్టాక్ మార్కెట్‌లో పోర్ట్‌ఫోలియోను నిర్మించుకున్నారు. ఎక్కువగా కమోడిటీ ట్రేడింగ్ చేసేవారని చెప్పారు. 19 ఏళ్ల వయసులోనే ఒక టెక్ స్టార్టప్‌ను ప్రారంభించారు. 22 సంవత్సరాల వయసులో మంచి లాభంతో దాన్ని ఓ బహుళజాతి సంస్థకు విక్రయించినట్లు తెలిపారు.

**వ్యూహాత్మక పెట్టుబడులు**

ముంబయిలోని మిథిబాయి కాలేజీ నుంచి కామర్స్ గ్రాడ్యుయేషన్‌లో పట్టా పొందిన వివేక్ ఒబెరాయ్ ప్రస్తుతం తన వద్ద ఉన్న సంపదను రెండు భాగాలు విభజించినట్లు గతంలో చెప్పారు. 60 శాతం సంపదను స్థిరంగా ఆదాయం సమకూర్చే విభాగాల్లో పెట్టుబడి పెట్టినట్లు పేర్కొన్నారు. మరో 40 శాతం సంపదను ప్రైవేట్ ఈక్విటీ, రియల్ఎస్టేట్‌లో పెట్టుబడి పెడుతున్నట్లు, ఆకర్షణీయ స్టార్టప్‌ల్లో వెంచర్ క్యాపిటలిస్ట్‌గా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలంలో మంచి రాబడులు రావాలంటే భవిష్యత్తుపై స్పష్టమైన అంచనాలతో ప్రయోగాత్మక పెట్టుబడులు పెట్టాలని చెబుతున్నారు.

రియల్ ఎస్టేట్: వివేక్ ఒబెరాయ్ రియల్ ఎస్టేట్ రంగంలో దృష్టి సారించి కర్మ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను స్థాపించారు.

డైమండ్ బిజినెస్: దేశవ్యాప్తంగా 18 స్టోర్లతో సోలిటారియో అనే డైమండ్ కంపెనీని స్థాపించారు.

ఈవెంట్ మేనేజ్‌మెంట్: వివేక్ 'మెగా ఎంటర్‌టైన్‌మెంట్' అనే ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీని స్థాపించారు.

ఎడ్యుకేషన్ ఫైనాన్సింగ్: సుమారు రూ.3,400 కోట్ల (సుమారు 400 మిలియన్ డాలర్లు) విలువైన ఎడ్యుకేషన్ ఫైనాన్సింగ్ స్టార్టప్‌ను ప్రారంభించారు.


ఫ్యామిలీ కార్యాలయం: 'ఒబెరాయ్ ఫ్యామిలీ ఆఫీస్' ద్వారా పెట్టుబడులను మేనేజ్ చేస్తున్నారు.

## లాభాల నుంచి నష్టాల్లోకి..

### ఢీలా పడ్డ స్టాక్ మార్కెట్లు

మంగళవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 297.07 పాయింట్లు లేదా 0.36 శాతం నష్టంతో 82,029.98 వద్ద, నిఫ్టీ 81.85 శాతం లేదా 0.32 శాతం నష్టంతో 25,145.50 శాతం వద్ద నిలిచాయి. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్, వీ విన్ లిమిటెడ్, కోఠారి ప్రొడక్ట్స్, టెక్నాలజీస్, రెప్రో ఇండియా వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. టాటా మోటార్స్, గ్రేటెక్స్ కార్పొరేట్ సర్వీసెస్ లిమిటెడ్, ఏరోఫ్లెక్స్ న్యూ లిమిటెడ్, ఏజీఐ ఇన్ఫ్రా, పిల్ ఇటాలికా లైఫ్‌స్టైల్ వంటి సంస్థలు నష్టాల జాబితాలో చేరాయి.






## ఐఆర్ఈఈ 2025లో వందే భారత్ స్లీపర్ కోచ్ ప్రదర్శన

**న్యూఢిల్లీ:**భారతీయ రైల్వేల ఆధునికీకరణ నేపథ్యంలో త్వరలో ప్రారం భించబోయే వందే భారత్ ఎయిర్ కండిషన్డ్ స్లీపర్ బోగీలు ప్రముఖ ఎగ్జిబిషన్‌లో దర్శనమివ్వనున్నాయి. అక్టోబర్ 15న ఢిల్లీలో ప్రారంభం కానున్న ఇండియన్ రైల్వే ఎక్విప్‌మెంట్ ఎగ్జిబిషన్ (ఐఆర్ఈఈ) 2025లో ఈ ఏసీ స్లీపర్ కోచ్‌ను ప్రదర్శించనున్నారు.సుదూర, మధ్యస్థ ప్రయాణాలకు విమానం లాంటి సౌకర్యాన్ని అందించే లక్ష్యంతో రైల్వే మంత్రిత్వ శాఖ ఈ వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ రైళ్లను ఆటోమేటిక్ డోర్లు, వైఫై సదుపాయం, విమానం (ఎయిర్ క్రాఫ్ట్)లాంటి డిజైనింగ్‌లో రూపొందించారు. భారతీయ రైల్వేల సహకారంతో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నిర్వహిస్తున్న ఐఆర్ఈఈ 2025 ఆసియాలోనే అతిపెద్ద రైల్వే ఎగ్జిబిషన్‌గా గుర్తింపు పొందింది. కాగా రైల్వేలు, రవాణా రంగంలో ప్రపంచంలోనే ఇది రెండో అతిపెద్ద ఈవెంట్.

**ఇతర కోచ్‌ల ప్రదర్శన**

ఐఆర్ఈఈ 2025లో వందే భారత్ స్లీపర్ కోచ్‌లతో పాటు చైర్ కార్ కోచ్‌లు, అమృత్ భారత్ కోచ్‌లు, తేజస్ భారత్, హమ్‌సఫర్ కోచ్‌లు, నమో భారత్ రైళ్లు, మెయిన్‌లైన్ కోచ్‌లు కూడా ప్రదర్శించనున్నారు.



# మోదీకి ట్రంప్ ప్రశంస..



## బిత్తరపోయిన పాక్ పీఎం..

కైరో:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన పనికి పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ బిత్తరపోయారు. భారత ప్రధాని మోదీపై ప్రశంసలు గుప్పించిన ట్రంప్..పాక్‌తో సంబంధాలపైనా వ్యాఖ్య చేసే సరికి షరీఫ్ నోటి వెంట మాట రాలేదు. అదే సమయంలో షరీఫ్ ప్రసంగించిన టైంలోనూ మరో ఘటన చోటు చేసుకుంది. ఈజిప్ట్ గాజా శాంతి సదస్సులో ఈ ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి.ఈజిప్ట్ శర్మ్ ఎల్-షేక్ వేదికగా గాజా శాంతి సదస్సు 2025 జరిగిన సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో భారత్, పాకిస్తాన్, ఇజ్రాయెల్, అరబ్ దేశాల నేతలు 20 మంది దాకా పాల్గొన్నారు. ఆ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ.. భారత్ గొప్ప దేశం. అక్కడ నా మంచి మిత్రుడు ఉన్నారు. ఆయన అత్యంత అద్భుతంగా పనిచేస్తున్నారు. భారత్, పాకిస్తాన్ కలిసి శాంతియుతంగా జీవించగలవు అని అన్నారు. ఆ వెంటనే..పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వైపు చూస్తూ ట్రంప్ 'అంతే కదా?' అంటూ వ్యాఖ్యానించారు. అయితే.. ఈ వ్యాఖ్యలకు నోట మాట పడిపోయిందేమో.. షరీఫ్ నవ్వుతూ ఏదో కవర్ చేసుకోబోయారు. అదే సమయంలో.. పక్కనున్న మిగతా దేశాల నేతలు చిన్నగా నవ్వుకున్నారు. మరోవైపు..షెహబాజ్ షరీఫ్ తన ప్రసంగంలో ట్రంప్ భజనకే పరిమితం అయ్యారు. ఇండియా, పాకిస్తాన్ రెండూ అణు శక్తులు. ఈ వ్యక్తి (ట్రంప్) మరియు ఆయన బృందం నాలుగు రోజుల పాటు మధ్యవర్తిత్వం చేయకపోయుంటే, యుద్ధం ఎవరికీ చెప్పుకోలేని స్థాయికి చేరిపోయేది అని అన్నారు. ఆయన ఇప్పటికే ఏడు యుద్ధాలు ఆపారని, ఇవాళ ఎనిమిదోది(గాజా సంక్షోభం గురించి) ఆపారని అన్నారు. అలాంటి వ్యక్తిని తాను నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేస్తున్నా అనడంతో.. వెనకాలే ఉన్న ఇటలీ ప్రధాని జార్జియా మెలోని తల పట్టుకుని.. రకరకాల హవభావాలతో 'ఇవేం పొగడ్తలు' అన్నట్లు ఎక్స్‌ప్రెషన్లు ఇచ్చారు. వెనుకనే నోటిమీద చేయి వేసుకొని చూస్తుండిపోయారామె. ప్రస్తుతం ఆ వీడియో వైరల్ అవుతోంది.మరోవైపు.. ట్రంప్ గాజా ప్లాన్ కుదరడంపై భారత ప్రధాని మోదీ.. ట్రంప్‌కు అభినందనలు తెలిపారు. ఈ క్రమంలో గాజా శాంతి సదస్సుకు భారత ప్రధాని మోదీని ట్రంప్ ఆహ్వానం అందించారు. అయితే మోదీ తరఫున ప్రత్యేక దూతగా విదేశాంగ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రంప్‌ను కలిసి.. శాంతి ఒప్పందంపై భారత్ తరఫున సంతకం చేశారాయన. ఈ విషయాన్ని విదేశాంగ ప్రతినిధి రణ్‌దీర్ జైశ్వాల్ అధికారికంగా ధృవీకరించారు. తన చొరవ వల్లే పాక్-భారత్ మధ్య ఉద్రిక్తతలు చల్లారాయంటూ ట్రంప్ మే 10వ తేదీ నుంచి నిన్న ఇజ్రాయెల్ పార్లమెంట్ ప్రసంగంలోనూ ప్రస్తావించడం తెలిసిందే.

### పాపం మెలోనీ!

### అటు ట్రంప్.. ఇటు ఎర్డోగాన్

ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీని సోషల్ మీడియా ఇప్పుడు పాపం అంటోంది. అందుకు ఈజిప్ట్ శర్మ్ షేక్-ఎల్ నగర వేదికగా జరిగిన గాజా శాంతి సదస్సు కారణం.ఒకవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమె అందంగా గురించి బాహటంగా వ్యాఖ్య చేయడంతో ఆమె కాస్త ఇబ్బందికి గురైనట్లు కనిపించారు. అదే సమయంలో టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ ఆమె వ్యక్తిగత అలవాటు చేసిన సంభాషణ సోషల్ మీడియాకు ఎక్కింది. ఆ వివరాల్లోకి వెళ్తే..అమెరికాలో ఓ మహిళను నువ్వు అందంగా ఉన్నావు అని చెప్పడం.. ప్రమాదకరం. ఒకరకంగా అలా కామెంట్ చేయడం.. రాజకీయ ప్రస్థానాన్ని ముగించినట్లే. కానీ, నేను ఆ ప్రమాదాన్ని పట్టించుకోను. మీరు అందంగా ఉన్నావ్ అని చెబితే ఏమీ అనుకోవు కదా అంటూ వెనక్కి తిరిగి మెలోనీని చూస్తూ ట్రంప్ అన్నారు. దీంతో ఆమె సిగ్గుపడుతూ థ్యాంక్స్ చెబుతూ.. గుటకలు మింగారు. అలాగే..ఇంకోవైపు.. టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్‌తో జరిగిన సంభాషణా వైరల్ అవుతోంది. విమానం నుంచి దిగుతున్నప్పుడు నిన్ను చూశాను. బాగా కనిపిస్తున్నావు. కానీ నీ చేత పొగతాగడం ఆపించాలి అని అన్నారాయన. ఆ సమయంలో అక్కడే ఉన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమానుయేల్ మాక్రోన్ అది అసాధ్యం అంటూ జోక్ పేల్చారు. అయితే.. అది తనకు తెలుసని.. పొగ తాగడం ఆపేస్తే తాను నలుగురితో కలవలేనని అంటూ ఆమె నవ్వుతూనే బదులిచ్చారామె. ఇదిలా ఉంటే.. 48 ఏళ్ల మెలోనీకి స్మోకింగ్ అలవాటు ఉందనేది బాహాటంగా తెలిసిన విషయమే!.



### అమెరికా, చైనా తరువాత ఉద్యోగాల కల్పనలో

## భారత్‌దే హవా

### కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ


**న్యూఢిల్లీ:**భారతదేశ ఆటోమొబైల్ పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతోంది. 2014లో రూ. 14 లక్షల కోట్లుగా ఉన్న ఈ పరిశ్రమ.. 2025 నాటికి రూ. 22 లక్షల కోట్లకు చేరిందని..కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. పుదుచ్చేరిలో గ్రేడ్ సెపరేటర్, రోడ్ల విస్తరణ పనులు, కొత్త రోడ్డు ప్రాజెక్టుకు పునాది వేసిన తర్వాత మంత్రి మాట్లాడుతూ.. జపాన్‌ను అధిగమించి మూడవ అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెట్‌గా ఇండియా అవతరించిందని అన్నారు.ఆటోమొబైల్ మార్కెట్ పరిమాణం పరంగా అమెరికా, చైనా తర్వాత దేశం ఇప్పుడు మూడవ స్థానంలో ఉంది. ఈ పరిశ్రమ 4.5 కోట్ల ఉద్యోగాలను సృష్టించింది. ఎగుమతి రంగానికి ఎంతో దోహదపడిందని గడ్కరీ స్పష్టం చేశారు.దేశంలో లాజిస్టిక్స్ ఖర్చు 16 శాతం నుంచి 10 శాతానికి తగ్గిందని, మెరుగైన రోడ్డు మౌలిక సదుపాయాల కారణంగా డిసెంబర్ నాటికి ఇది 9 శాతానికి తగ్గుతుందని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.వివిధ స్థిరమైన పద్ధతులను అవలంబించడం గురించి కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. రోడ్ల నిర్మాణంలో మున్సిపల్ వ్యర్థాలను ఉపయోగిస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు 18 లక్షల టన్నుల మున్సిపల్ వ్యర్థాలను ఉపయోగించామని, రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు వ్యర్థాలను ప్రోత్సహించాలని మంత్రిత్వ శాఖ ప్రణాళిక వేసిందని అన్నారు.

## హరియాణాలో మరో పోలీసు అధికారి ఆత్మహత్య

తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా మరో పోలీసు అధికారి తనను తాను తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడటం చర్చనీయాంశంగా మారింది. పూరన్‌ను లక్ష్యంగా చేసుకుని ఆ అధికారి తన సూసైడ్ నోట్‌లో ఆరోపణలు చేసినట్లు జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి.ఏఎస్సై సందీప్‌కుమార్ రోహ్‌తక్ సైబర్ సెల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. పూరన్ కుమార్‌పై ఉన్న ఓ అవినీతి కేసును ఆయన దర్యాప్తు చేస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ పూరన్ కుమార్‌పై తన సూసైడ్ నోట్‌లో ఆరోపణలు చేశారు. నిజాలు వెలుగులోకి రావడం కోసం తన జీవితాన్ని త్యాగం చేస్తున్నట్లు రాశారు. పూరన్ కుమార్ ఇటీవల చండీగఢ్‌లోని తన నివాసంలో రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుల వివక్ష, వేధింపులు, అవమానాలతోనే బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు ఆయన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. ఇందులో ఎనిమిది మంది అధికారుల పేర్లను చేర్చారు. ఈ కేసుకు సంబంధించి వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను రాష్ట్ర ప్రభుత్వం సెలవుపై పంపించింది. రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజార్నియాను బదిలీ చేసింది.

## యూఎస్ ట్రెజరీ సెక్యూరిటీలను తగ్గించిన భారత్

**న్యూఢిల్లీ:**ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రముఖ ఆర్థిక వ్యవస్థల్లో బ్రిక్స్ కూటమికిప్రత్యేక గుర్తింపు ఉంది. ఇందులోని కొన్ని సభ్య దేశాలు అమెరికాలోని తమ పెట్టుబడులను గణనీయంగా తగ్గిస్తున్నాయి. భారతదేశం, చైనా, బ్రెజిల్ అమెరికా ట్రెజరీ బాండ్లలో తమ ఇన్వెస్ట్‌మెంట్లను ఉపసంహరించుకుంటున్నాయి. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో డీ-డాలరైజేషన్ దిశగా జరుగుతున్న మార్పులకు సంకేతంగా కనిపిస్తోంది.యూఎస్ ట్రెజరీ విభాగం జారీ చేసిన డేటా విశ్లేషణ ప్రకారం.. భారతదేశం, చైనా, బ్రెజిల్, సౌదీ అరేబియా సహా పలు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు (ఎమర్జింగ్ మార్కెట్స్) జులై 2024 నుంచి జులై 2025 మధ్య కాలంలో అమెరికా ప్రభుత్వ సెక్యూరిటీల్లో తమ వాటాలను తగ్గించుకున్నాయి.ఇండియా విషయంలో ఇది కీలకమైన పరిణామం. జులై 2025 నాటికి భారత్ వద్ద ఉన్న అమెరికా ప్రభుత్వ బాండ్ల విలువ 219 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది జులై 2024లో ఉన్న 238.8 బిలియన్ల డాలర్లతో పోలిస్తే 8 శాతం తక్కువ. గతంలో భారత్ అమెరికా ట్రెజరీ సెక్యూరిటీల నిల్వలను క్రమంగా పెంచింది. జులై 2018లో ఉన్న 142.6 బిలియన్ డాలర్ల నుంచి ఏటా 7 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్ తో పెంచుతూ వచ్చింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విదేశీ మారక ద్రవ్య వ్యూహంలో యూఎస్ ట్రెజరీ సెక్యూరిటీలను తగ్గించుకోవడానికి మూడు ప్రధాన కారణాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.బలహీనపడిన డాలర్: డొనాల్డ్ ట్రంప్ యూఎస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి డాలర్ బాగా బలహీనపడింది. ఈ సంవత్సరంలో డాలర్ ఇండెక్స్ దాదాపు 9 శాతం పడిపోయింది.రూపాయికి రక్షణ: డాలర్లను విక్రయించడం ద్వారా రూపాయి విలువ క్షీణించకుండా కాపాడటానికి డాలర్ నిల్వలను ఉపయోగించారు.నిల్వల వైవిధ్యత: ఆర్‌బీఐ తన నిల్వలను వైవిధ్యపరచడంలో భాగంగా బంగారాన్ని కొనుగోలు చేస్తోంది. బంగారం నిల్వలు పెరగడం వల్ల జులై 2024 నుంచి జులై 2025 మధ్య మొత్తం ఫారెక్స్ నిల్వలు 4 శాతం పెరిగాయి.భారతదేశం మాత్రమే కాకుండా ఇతర ఎమర్జింగ్ మార్కెట్లు ఇదే ధోరణిని అనుసరిస్తున్నాయి. చైనా తన బాండ్ హోల్డింగ్‌లను 5.9 శాతం తగ్గించింది. ఈ



విభాగంలో బ్రెజిల్ అత్యధికంగా 12 శాతం తగ్గింపును నమోదు చేసింది. సౌదీ అరేబియా తన హోల్డింగ్‌లను 7.7 శాతం తగ్గించుకుంది. అయితే ఇందుకు విరుద్ధంగా యూఏఈ అసాధారణంగా తన హోల్డింగ్‌లను 56.5 శాతం పెంచి 107.8 బిలియన్ డాలర్లకు చేర్చింది. బలహీనపడిన డాలర్, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కరెన్సీల బలహీనత వంటి అంశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలను డీ-డాలరైజేషన్ వైపు నెడుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే చాలా అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు అమెరికా ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేయడం కొనసాగించాయి. డాలర్‌పై తమ విశ్వాసాన్ని కొనసాగిస్తూ జపాన్ (5.3 శాతం), జర్మనీ (2.7 శాతం), ఫ్రాన్స్ (34.7 శాతం), యూకే (22.6 శాతం) వంటి దేశాలు అదే కాలంలో తమ యూఎస్ ప్రభుత్వ బాండ్ హోల్డింగ్‌లను పెంచాయి.

## తాలిబన్ నేతకు డిన్నర్ ఇస్తారా?

• అవమానంతో తలదించుకున్నట్లుంది



న్యూఢిల్లీ: అఫ్గానిస్తాన్‌లో తాలిబన్ ఏర్పాటైన సుమారు నాలుగేళ్ల తర్వాత ఆ దేశ విదేశాంగ మంత్రి అమిర్ ఖాన్ ముత్తఖీ భారత్ పర్యటనపై ప్రముఖ కవి, రచయిత జావేద్ అక్తర్ విమర్శలు గుప్పించారు.ఒక తాలిబన్ నేతను భారత్‌కు ఆహ్వానించడమే కాదు.. డిన్నర్ కూడా ఇస్తారా? అవమానంతో తలదించుకున్నట్లైంది అంటూ మండిపడ్డారు.ఉగ్రవాదాన్ని వ్యతిరేకించే మనం, ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన తాలిబన్ నేతకు విందు ఇస్తారా? అంటూ ప్రశ్నించారు. అన్ని ఉగ్రవాద సంస్థలపై పోరాటం చేసే మనం, ఇలా వారిని ఆహ్వానించి ప్రత్యేక విందులు ఏర్పాటు చేయడమేంటని నిలదీశారు.కాగా, ఆరు రోజుల భారత పర్యటనలో భాగంగా అమిర్ ఖాన్ ముత్తఖీ.. ఇటీవల ఢిల్లీలో అడుగుపెట్టారు. ఈ మేరకు భారత్ ప్రభుత్వ పెద్దల్ని కలుస్తూ తాము అఫ్గాన్‌ను ముందుకు నడిపిస్తున్న తీరును వివరించారు. అదే సమయంలో తమ దేశంలో ఉగ్రజాడలు లేకుండా చేశామని కూడా చెప్పుకొచ్చారు. భారత్ గడ్డపై నుంచే పాక్ ఉగ్రవాదాన్ని వీడాల్సిందేనని వార్నింగ్ ఇచ్చారు. అయితే ఇలా ముత్తఖీ హెచ్చరించిన గంటల వ్యవధిలోనే పాకిస్తాన్-అఫ్గాన్‌ల మధ్య పోరు రాజుకుంది.తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్తాన్(టీటీపీ) సంస్థ స్థావరమే లక్ష్యంగా పాకిస్తాన్ జరిపిన దాడులు చివరకు తాలిబాన్, పాక్ మధ్య పోరును మరింత ఉధృతం చేశాయి. పాక్-అఫ్గాన్ సరిహద్దు ప్రాంతంలో ఆదివారం సైతం ఇరు దేశాల పరస్పర దాడుల పర్వం కొనసాగింది. శత్రుదేశానికి భారీ నష్టం వాటిల్లజేశామని అటు అఫ్గానిస్తాన్, ఇటు పాకిస్తాన్ ప్రకటించుకున్నాయి.

# గుండాల్లా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- బీజేపీ నేతృత్వంలో పోలీస్ కమిషనర్‌కు వినతిపత్రం
- మధుకర్ ఆత్మహత్యకు కారకులను శిక్షించాలి
- బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు



**గోదావరిఖని, జనంసాక్షి :** అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆగడాలతోనే మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామానికి చెందిన బిజెపి మండల అధ్యక్షులు మధుకర్ ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు అన్నారు.ఏట మధుకర్‌పై కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడడం కాకుండా ఒక మహిళ చేత ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయించడంతో మనస్థాపానికి గురైన మధుకర్ అటవీప్రాంతంలో ఒక చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ముందుగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు నీల్వాయి గ్రామానికి వెళ్లి ఏటా మధుకర్ కుటుంబాన్ని పరామర్శించారు.మధుకర్ కుటుంబానికి బీజేపీ పార్టీ అండగా ఉంటుందని అన్నారు.నీల్వాయి నుంచి డైరెక్ట్‌గా రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి మంగళవారం వచ్చారు.ఏట మధుకర్ ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝాకు రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు వినతిపత్రం అందజేశారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నేతలు గుండల్లాగా వ్యవహరిస్తున్నారని అయన ఆరోపించారు. అధికారం ఉందనే అహంకారంతో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రుద్రపట్ల సంతోష్ సద్దుల బతుకమ్మ రోజు రాత్రి మధుకర్ నివాసానికి వెళ్లి దాడి చేశారు.అంతేకాకుండా ఎస్సీ ఎస్టీ ఆక్ట్ కేసు పెట్టడంతో పాటు పోలీసులు వేధింపులకు గురి చేయడంతో మధుకర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆయన ఆరోపించారు.ప్రజాస్వామ్యంలో దాడులకు, ప్రతిదాడులకు పాల్పడడం కాంగ్రెస్ నీచ సంస్కృతికి ఇది నిదర్శనం అని అన్నారు.సిపి తగిన న్యాయం చేస్తారన్న విశ్వాసం తమకు ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్ర సంజీవరెడ్డి బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి సుభాష్, స్టేట్ సెక్రటరీ భరత్‌ప్రసాద్,మంచిర్యాల జిల్లా అధ్యక్షులు వెంకటేష్‌గౌడ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గొంగడి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీ బోర్లాకుంట వెంకటేష్‌నేత, గోమాస శ్రీనివాస్, రావుల పద్మ, కరీంనగర్ మాజీ మేయర్ సునీల్‌రావు, రావుల రాజేందర్, కోమల్ల మహేష్, కందుల సంధ్యారాణి, ముకేష్‌గౌడ్,మీస అర్జున్‌రావు,సోమరాపు లావణ్య, దుర్గం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- విద్యార్థుల ప్రవర్తనను నిత్యం గమనించాలి
- నశా ముక్త్ భారత్ అభియాన్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 14 (జనంసాక్షి):**
యువత, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాల నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పోలీస్, ఎక్సైజ్ శాఖ, శిశు సంక్షేమ శాఖ, వైద్య , తదితర శాఖల అధికారులతో జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలల్లో, బహిరంగ ప్రదేశాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్, ఎక్సైజ్, విద్యాధికారులు కలిసి రోడ్ల పక్కన పాఠశాలలు, పాన్ షాపుల్లో తనిఖీలు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనను నిత్యం గమనించాలని ఉపాధ్యాయులు , తల్లిదండ్రులకు సూచించారు. అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ మత్తు పదార్థాలతో కలిగే దుష్పరిణామాలపై ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ... మత్తు పదార్థాల నిర్మూలనకు నిత్యం గస్తీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్ళు, ఆర్టీసీ కార్గో, ప్రైవేట్ పార్సిల్ సంస్థలతోపాటు ఆన్లైన్ సంస్థలకు సంబంధించి గోదాములను తనిఖీ చేస్తున్నట్లు వివరించారు. డ్రగ్ డిటక్షన్ కిట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల కేసులను వివరించారు. మాదక ద్రవ్యాలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం నశా ముక్త్ భారత్ అభియాన్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమేష్ బాబు, డీడబ్ల్యూఓ సరస్వతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**అబ్దుల్లాపూర్‌మెట్ :** నగర శివారులో దొంగలు హల్‌చల్ చేస్తుండటంతో ప్రజలు వణికిపోతున్నారు..కాలేజీలు, గేటెడ్ కమ్యూనిటీలను కూడా వదలకుండా వరుస చోరీలు జరుగుతున్నాయి..ఒక కేసును ఛేదించకముందే.. మరో చోరీ ఘటనకు పాల్పడుతూ దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. వరుస దొంగతనాలు చేస్తుంది.

## పాడి కౌశిక్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నాయకులపై పోలీస్‌లకు పిర్యాదు



**జమ్మికుంట, అక్టోబర్ 14 (జనంసాక్షి):** హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపి నాయకులపై టీఆర్ఎస్ నాయకులు జమ్మికుంట పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం పిర్యాదు చేశారు. అనంతరం సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్, మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వర్ రావులు మాట్లాడుతూ నియోజక వర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న కౌశిక్ రెడ్డిపై అవాకులు, చెవాకులు పేలితే సహించేది లేదన్నారు. ప్రజల్లో ఎమ్మెల్యేకు ఉన్న ఆదరణ చూసి ఓర్వలేకనే బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు.మరో మారు తమ నాయకుడి పై ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.ఈ కార్యక్రమంలో చిలుముల రామస్వామి, ఎండి జానీ, మొలుగూరి వసంత్, మంద రాజేష్, పొనగంటి శ్రీధర్,సందీఫ్ తదితరులు పాల్గొన్నారు.



# రూ.27 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్

## అభివృద్ధి పనులు పరిశీలించిన రాజ్‌ఠాకూర్

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ గోదావరిఖని పట్టణ చౌరస్తా ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న రూ.27 కోట్ల విలువైన షాపింగ్ కాంప్లెక్స్ అభివృద్ధి పనులను పరిశీలించారు.ప్రాజెక్టు పురోగతిని అడిగి తెలుసుకున్నారు.పనుల నాణ్యత,నిర్మాణ వేగం, పారదర్శకతపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోదావరిఖని ప్రజలకు ఆధునిక వాణిజ్య సదుపాయాలు కల్పించడమే ఈ షాపింగ్ కాంప్లెక్స్ లక్ష్యమన్నారు.ఇది ఒకవైపు నగర అభివృద్ధికి దోహదం చేస్తే, మరోవైపు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అన్నారు.ఇతర అభివృద్ధి పనులతో పాటు ఈ ప్రాజెక్టు కూడా నగర ముఖచిత్రాన్ని మార్చనున్నదని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు అందించడమే మా ప్రభుత్వ ధ్యేయమన్నారు.సింగరేణి..మున్సిపల్ అధికారులతో సమన్వయం కలిగిన విధంగా ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు.ఈ పర్యవేక్షన కార్యక్రమంలో సింగరేణి అధికారులు, మున్సిపల్ కమిషనర్, స్థానిక కార్పొరేటర్లు, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.పనుల ప్రగతిపై అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు.ప్రజల్లో ఈ ప్రాజెక్టుపై మంచి ఆసక్తి నెలకొందని, ఇది పూర్తయిన తర్వాత గోదావరిఖని ప్రాంతం వ్యాపారాభివృద్ధిలో ఒక ప్రధాన కేంద్రంగా మారుతుందనే నమ్మకం వ్యక్తమవుతుందన్నారు.

# అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

## అభివృద్ధి పనులపై సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష




**పెద్దపల్లి, అక్టోబర్ 14(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరే ట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో రామగిరి, జూలపల్లి, ధర్మారం, మండలాలలో చేపట్టిన అభివృద్ధి పనుల పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రాబోయే 5 నుంచి 10 సంవత్సరాల వరకు అవసరాలను దృష్టిలో ఉంచుకొని పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాల అభివృద్ధి పనులకు ఎస్.ఎం.సి (స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ) తీర్మానాల ప్రకారం పూర్తి చేయాలని అన్నారు.పాఠశాలలో స్పష్టమైన మార్పు కనిపించే దిశగా అభివృద్ధి పనులు జరగాలని, అభివృద్ధి పనులు పూర్తి చేసిన తర్వాత వచ్చే మార్పును ప్రజలకు వివరించాలని అన్నారు. జిల్లాలో జూనియర్ కళాశాల అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులో ఉన్నందున సంబంధిత పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో మంజూరు చేసిన నూతన తహసిల్దార్ కార్యాలయం నిర్మాణ పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, డిసెంబర్ చివరి వరకు తహసిల్దార్ భవనాలు అందుబాటులోకి రావాలని, అవసరమైన మేర నిధులను నేరుగా అందిస్తామని, అనవసరంగా పనులు ఆలస్యం చేయవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు.గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అన్నారు. గ్రామపంచాయతీ తీర్మానం ప్రకారం అభివృద్ధి పనులు ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు పూర్తయ్యేలా చూడాలని, పూర్తి చేసిన పనులకు సంబంధించి ఎంబి రికార్డింగ్స్ నమోదు చేసి వెల్లుల్లి సమర్పించాలని అన్నారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి శాఖ పరిధిలో మంజూరైన వివిధ రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్ చివరి దశలో ఉన్న పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకొని రావాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో మరమ్మతు పనుల పురోగతి వివరాలను తెలుసుకున్న కలెక్టర్ వాటిని సత్వరమే పూర్తి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ, ఈ.ఈ. పి. ఆర్.గిరీష్ బాబు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**థింక్-పేర్- షేర్ విధానంపై ఉపాధ్యాయులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి**

థింక్-పేర్- షేర్ విధానం పై ఉపాధ్యాయులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉపాధ్యాయులకు థింక్-పేర్-షేర్ విధానం పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలో మౌనంగా ఉండేవాళ్ళు, ఇన్ యాక్టివ్ గా ఉండే విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేస్తూ మంచి బోధన అందించేందుకు థింక్ పేర్ షేర్ విధానం అమలకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు.థింక్-పేర్- షేర్ విధానం ప్రభుత్వ పాఠశాలలో అమలు చేయడానికి ముందు ఉపాధ్యాయులు దీనిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, వారికి ఉన్న ప్రతి అనుమానాలను శిక్షణ కార్యక్రమంలో నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. థింక్-పేర్- షేర్ విధానం వల్ల మౌనంగా ఇన్ ఆక్టివ్‌గా ఉండే విద్యార్థులు ఎక్కువ మాట్లాడే వాళ్ళు అందరికీ సమానంగా మాట్లాడే అవకాశం కలిగిస్తుందని అన్నారు. బోధనలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయడం ద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణాలు క్రమంగా మెరుగవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నేడు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆలయ పరిశీలన

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా నేడు దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, దేవాదాయ శాఖ ఇన్చార్జ్ కమిషనర్ శైలజ రామయ్యర్ రాజన్న ఆలయ అభివృద్ధి పనులపై పరిశీలన చేయనున్నారు. రాజన్న ఆలయంలో చేపట్టనున్న పనులు ఏ విధంగా చేయాలని, అధికారులకు దిశ నిర్దేశం చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే రాజన్న ఆలయ అభివృద్ధి పనులలో భాగంగా స్వామి వారి ఉత్సవమూర్తులను గత నాలుగు రోజుల క్రితం భీమేశ్వర ఆలయనికి తరలించారు. భక్తుల సౌకర్యార్థము భీమేశ్వర ఆలయంలో రూ మూడు కోట్ల 50 లక్షల పైచిలుకు నిధులతో పలు అభివృద్ధి పనులను చేపడుతున్నారు. రాజన్న ఆలయంలో స్వామివారికి ప్రతినిత్యం అర్చకులు సుప్రభాత సేవ నుండి నిషి పూజ (ఏకాంత సేవ)వరకు అర్చకులు స్వామివారి కైంకర్యాలు నిర్వహిస్తూ ఉండగా భక్తుల సౌకర్యం కోసం భీమేశ్వర ఆలయంలో భక్తులకు దర్శన సౌకర్యాలు కల్పించారు. ప్రతిపక్ష పార్టీలు రాజన్న ఆలయంలోనే భక్తులకు దర్శనాలు కల్పించాలని ఆందోళనలు చేపట్టడంతో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగము,ఆలయ సిబ్బందితో కులం కుషంగా చర్చలు జరగనున్నట్లు సమాచారం. నేడు ప్రిన్సిపల్ సెక్రెటరీ రాకతో ఆలయ అభివృద్ధి పనులలో స్వామివారి దర్శనాలు ఎక్కడ నిర్వహిస్తారో తెలుస్తుందని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

# విద్యార్థుల సమస్యలకు తక్షణమే పరిష్కరించాలి

- బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ఇబ్బందులకు తావులేదు : డిప్యూటీ సీఎం భట్టి
- ప్రైవేటు పాఠశాలల బకాయిలు క్రమంగా విడుదల చేస్తాం
- జిల్లా అధికారులు, యాజమాన్యాలతో సమీక్ష



జగిత్యాల, అక్టోబర్ 14 (జనంసాక్షి):
రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జగిత్యాల సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వారి ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు వెంటనే పాఠశాల యాజమాన్యాలతో సమావేశమై, విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలకు ఏమైనా సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యా రంగానికి సామాజిక బాధ్యతగా ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రైవేటు పాఠశాలల బకాయిలను క్రమపద్ధతిలో విడుదల చేస్తామని భట్టి తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో పార్యాంశాల బోధన, వసతులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు. ఎంఓయూ చేసుకునే సమయంలోనే ఫీజులకు సంబంధించిన అంశాలను యాజమాన్యాలకు స్పష్టంగా తెలపాలని, ఈ పథకం కింద ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు సమన్వయంతో పాఠశాల యాజమాన్యాలతో చర్చించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజ్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి కిషోర్, విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## తమకు కేటాయించిన గ్రామలలో విధిగా పర్యటించాలి

### గంభిరావుపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**గంభీరావుపేట అక్టోబరు 14 (జనం సాక్షి):** గంభీరావుపేట పోలీస్ స్టేషన్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ పరిసరాలు,స్టేషన్ రికార్డ్స్ పరిశీలించి, పెండింగ్ ఉన్న కేసులపై రివ్యూ చేసి పోలీస్ స్టేషన్ ల పరిధిలోని కేసుల నమోదు,శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన వివరాలని అడిగి తెలుసుకొని,ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని అధికారులకు ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా బరోసా కల్పించాలని అన్నారు.విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాల్లో తరచు పర్యటిస్తు ప్రజలలో తస్సబంధాలు మెరుగు పర్చుకుంటు గ్రామ స్థాయిలో ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్టం చేయాలని ఆదేశించారు. పెట్రోలింగ్ సమయంలో రౌడి షీటర్స్ లని తనిఖీ చేయాలని,ప్రతి రోజు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని, సిబ్బంది కి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలి అని సూచించారు.

# గోదావరి బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలి

- శ్రీపాద రింగ్ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి
- క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా జిల్లా అధ్యక్షుల నియామకం
- సమీక్ష సమావేశంలో ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి) :** గోదావరి బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని, శ్రీపాద రింగ్ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి వేగవంతం చేయాలని అధికారులను, బ్రిడ్జ్ రోడ్డు కంపెనీ ప్రతినిధులను రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని మంథని గోదావరి బ్రిడ్జి పనులను, శ్రీపాద రింగ్ రోడ్డు పనులను సంబంధించి ఆర్ అండ్ బి, రెవెన్యూ అధికారులు, కంపెనీ ప్రతినిధులతో మంత్రి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. 4.50 కోట్లతో మంజూరైన ఆర్అండ్‌బి అతిథిగృహానికి స్థల సేకరణ చేయాలని, వెంటనే పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మంథని మున్సిపాలిటీలో 10 కోట్ల తో మంజూరైన అన్ని కులాలకు సంబంధించిన కమ్యూనిటీ హాల్స్ కు స్థలం లేని వాటికి వెంటనే ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించి వారికి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పనులు చేసుకోవడానికి అందజేయాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. మంథనిలో హమాలీ సంఘం, ఆటో నడుపుకుని ఆటో కార్మికులకు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి వారికి ఇంటి నిర్మాణం చేసుకునే విధంగా ఖాళీ స్థలాలను గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఈఈ, రెవెన్యూ డివిజన్ అధికారి, ఎమ్మార్వో, జేఈ, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా అధిష్టానం జిల్లా అధ్యక్షుల నియామకం తెలిపారు. పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలో పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ఎంపికలో భాగంగా సంఘటన్ శ్రీజన్ కార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకులు డా. జయ్ కుమార్, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు రామగుండం నియోజకవర్గ శాసన సభ్యులు పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రాజ్ ఠాకూర్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రోటోకాల్ చైర్మన్ హర్కర వేణుగోపాల్ రావ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మూడు నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు వారిని ఉద్దేశించి మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పార్టీ బలుపుతానికి కృషి చేయాలని, కార్యకర్తల అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకొని జిల్లా పార్టీ అధ్యక్షులు నియామకం జరుగుతుందని తెలిపారు. కార్యకర్తలు తమ అభిప్రాయాలను అబ్జర్వర్లకు స్వేచ్ఛగా తెలపవచ్చని కార్యకర్తలకు, నాయకులకు మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

# ప్రజలతో సమన్వయకర్తగా వ్యవహరించే నాయకుడి లక్ష్యం

- కరీంనగర్‌లో కాంగ్రెస్ అధ్యక్ష నియామకంపై క్షేత్రస్థాయి సర్వే
- కార్యకర్తల అభిప్రాయ సేకరణకు ప్రాధాన్యం
- ఐదు రాష్ట్రాల్లో విజయవంతమైన నూతన పద్ధతి



**కరీంనగర్, అక్టోబర్ 14 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష నియామక ప్రక్రియలో క్షేత్రస్థాయి కార్యకర్తల అభిప్రాయ సేకరణకు ప్రాధాన్యం ఇస్తూ నూతన పద్ధతిని అవలంబిస్తున్నట్లు ఏఐసిసి పరిశీలకులు, కర్ణాటక హంగల్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీనివాస్ మనె తెలిపారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో టిపిసిసి ఉపాధ్యక్షులు ఆత్రం సుగుణ, చిట్ల సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, పీసీసీ ప్రధాన కార్యదర్శి రహమతు హుస్సేన్, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు, ఊట్కూరు నరేందర్ రెడ్డిలతో కలిసి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పత్రిక విలేకరులు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మనె మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా నూతన ఒరవడిని సృష్టిస్తోందని, జిల్లా అధ్యక్ష నియామకంలో సాంప్రదాయ నామినేషన్ పద్ధతిని విడనాడి, క్షేత్రస్థాయిలో బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, ముఖ్య నేతల అభిప్రాయాలను సేకరించి, ప్రజలకు అందుబాటులో ఉండి, సమన్వయకర్తగా పనిచేయగల నాయకుడిని ఎన్నుకునే లక్ష్యంతో ఈ ప్రక్రియను ప్రారంభించినట్లు శ్రీనివాస్ మనె వివరించారు. ఈ పద్ధతి ఇప్పటివరకు ఐదు రాష్ట్రాల్లో విజయవంతమైందని, ఆరో రాష్ట్రంగా తెలంగాణలో ఈ ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. తెలంగాణలో 22 మంది ఏఐసిసి, పిసిసి పరిశీలకుల సమక్షంలో ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆశిస్తున్న ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రజాభిప్రాయ సేకరణ ముగిసిన తర్వాత ఆ నివేదికను పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ తదితర ముఖ్య నేతలకు సమర్పించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో పిసిసి కోఆర్డినేటర్ మ్యాడం బాలకృష్ణ, నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఎండి తాజ్, పులి ఆంజనేయులు గౌడ్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, మడుపు మోహన్, పత్తి మధు, పురం రాజేశం, పత్తి కృష్ణారెడ్డి, ముస్తాక్, అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలు

- కార్యకర్తల అభిప్రాయాల మేరకే జిల్లా అధ్యక్ష ఎన్నిక
- పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి




**వనపర్తి బ్యూరో అక్టోబర్ 14 జనంసాక్షి :** కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని,వారి అభిప్రాయాల మేరకే జిల్లా అధ్యక్ష ఎన్నిక జరుగుతుందని, ఏఐసీసీ పరిశీలకులు, పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఎంపీ మల్లురవి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మెగారెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా అధ్యక్ష ఎన్నికలు గతంలో లాగా కాకుండా ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకునేలా పార్టీ మార్పులు తీసుకొచ్చిందన్నారు. అధ్యక్ష ఎన్నిక కోసం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో అభిప్రాయాలు స్వీకరిస్తామన్నారు. జిల్లాలోని ఏ మారుమూల ప్రాంతానికి చెందిన కార్యకర్త అయిన డిసిసి అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.కాశీ నుండి కన్యాకుమారి వరకు రాహుల్ గాంధీ చేపట్టిన జోడోయాత్రతో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందని, అందులో భాగంగానే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జిల్లా అధ్యక్ష ఎన్నిక కోసం గత 40 ఏళ్ల క్రితం ఉన్న ఈ సంస్కృతిని మళ్లీ తీసుకొచ్చినట్లు తెలిపారు. పార్టీ నియమల ప్రకారంగానే ఎన్నిక జరుగుతుందని ఎవరు కూడా అపోహకు గురికా వద్దన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అమీర్ ఖాన్,వనపర్తి డిసిసి అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, పిసిసి పరిశీలకులు తదితరులు పాల్గొన్నారు.

## వన్స్ అపాన్ ఏ టైమ్ బై క్యాండీమన్'ను పరిచయం చేసిన ఐటీసీ

**ఖైరతాబాద్, అక్టోబర్ 14 (జనం సాక్షి) :** ఉల్లాసవంతమైన స్ఫూర్తి, ఆకర్షణీయమైన రుచులు, చిలిపి ఆకర్షణ కోసం ప్రసిద్ధి చెందిన మిఠాయి బ్రాండ్ ఐటీసీ క్యాండీమన్ పిల్లల కోసం ఒక విలక్షణమైన కార్యక్రమం 'వన్స్ అపాన్ ఏ టైమ్ బై క్యాండీమన్'ను ప్రారంభించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీసీ లిమిటెడ్ ఫుడ్స్ డివిజిన్ హెడ్ అనుజ్ బన్సల్ మాట్లాడుతూ ఈ వినూత్నమైన ప్లాట్ ఫాంతో ఐటీసీ క్యాండీమన్ లీనమయ్యే, పిల్లలే ప్రధానంగా ఉండే బ్రాండ్ అనుభవాలను భారతదేశంలో ఏర్పాటు చేసే లక్ష్యాన్ని కలిగి ఉందన్నారు.నేటి వేగవంతమైన, డిజిటల్ సాంకేతికతకు ప్రాధాన్యత ప్రపంచంలో, తల్లిదండ్రులు తమ పిల్లలు పాల్గొనేలా చేసే ప్రధానమైన మార్గాలను కనుగొనడంలో తరచుగా సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఈకార్యక్రమంతో, ఈ బ్రాండ్ డిజిటల్ ఆవిష్కరణతో సృజనాత్మక తను మిశ్రమం చేస్తూ తల్లిదండ్రులు, పిల్లల మధ్య శక్తివంతమైన అనుబంధాన్ని నిర్మించే లక్ష్యాన్ని కలిగి ఉందని చెప్పారు. 'వన్స్ అపాన్ ఏ టైమ్ బై క్యాండీమన్', తమ పిల్లల పేరు, ఫోటో కలిగిన వ్యక్తిగత కథల పుస్తకం తయారు చేయడానికి, ఆనందకరంగా చిత్రీకరించబడిన కథల్లో ప్రధానమైన పాత్రను పోషించే వ్యక్తిగత అవసరాలను నెరవేర్చే కథల పుస్తకాలను రూపొందించడానికి తల్లిదండ్రులకు అవకాశం ఇస్తోందన్నారు.

# శాంతి..సామరస్యం..ఉత్తమ సమాజం నిర్మించాలి

- జమాత్ ఇ ఇస్లామీ హింద్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అజారుద్దీన్



**గోదావరిఖని, జనంసాక్షి :** శాంతి..సామరస్యం..నైతిక విలువలతో కూడిన సమాజం ఏర్పడాలని జమాత్ ఇ ఇస్లామీ హింద్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు.గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని జామియా మసీదులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో సామాజిక సంక్షేమం, విద్య, సమాజ అభ్యున్నతికి జమాతే ఇస్లామీ హింద్ నిబద్ధతను నొక్కి చెప్పారు.ఇస్లామిక్ సూత్రాల ద్వారా శాంతి, మత సామరస్యం,మానవ హక్కులను ప్రోత్సహించడానికి జరుగుతున్న ప్రయత్నాలను హైలైట్ చేశారు.సంస్థ పనిని మార్గనిర్దేశం చేసే సమగ్ర జీవన విధానంగా ఇస్లామిక్ విలువల ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు.తెలంగాణలోని సామాజిక సవాళ్లను..సామాజిక దురాచారాలను పరిష్కరించడానికి అన్ని వర్గాల మధ్య ఐక్యత..నిర్మాణాత్మక సంభాషణకు పిలుపునిస్తోందన్నారు.విద్య వృత్తి శిక్షణ కార్యక్రమాల ద్వారా అణగారిన వర్గాలకు సహాయం చేయడంపై జమాత్ దృష్టిని పునరుద్ఘాటించారు.ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్, మౌలానా మహమూద్ అహ్మద్ ఖాన్ ఉమ్రి, సయ్యద్ అలీముద్దీన్ ఇర్షాద్, డైరెక్టర్ ముసైబ్ బిన్ ఉమర్, అబ్దుల్ హై జాజవిద్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, గోదావరిఖని అధ్యక్షుడు సయ్యద్ జావిద్ అక్మల్ హుస్సేనీ, ఖాజీ మహమ్మద్ ఇస్మాయిల్, నిజామీ వైస్ ప్రెసిడెంట్, టెక్రీస్ కౌన్సెలర్, అబ్దుల్ రజాక్ ఉపాధ్యక్షుడు, జామా మసీదు గోదావరిఖని అధ్యక్షుడు, మహ్మద్ ఫసియుద్దీన్,షరియత్ పంచాయతీ చైర్మన్ వైస్ చైర్మన్ ముస్తఫా, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జువైరియ కౌసర్, ప్రెసిడెంట్ సబీరానాజ్, జెలి తంజీమైన్, అనుబంధ సంస్థలు, గర్ల్స్ టెక్రీస్ కౌన్సలర్ ఐషా సిద్దిక్వా, తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయడమే మా లక్ష్యం

- 100 శాతం సబ్సిడీతో రైతులకు వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేశాం
- అన్నదాతకు అన్ని విధాలుగా మా ప్రభుత్వం అండగా ఉంటుంది
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులతో ముఖాముఖి వీడియో కాన్ఫరెన్స్



**తలకొండపల్లి అక్టోబర్14(జనంసాక్షి):** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును రాజు చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.తలకొండపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక లో వీడియో కాన్ఫరెన్స్ లో రైతులను ఉద్దేశించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు.ప్రజా పాలనలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతును కంటికి రెప్పలాగా కాపాడుకుంటూ,వ్యవసాయాన్ని పండుగల చేసుకునేందుకు వీలు కల్పిస్తున్నారని అన్నారు.రైతు సంక్షేమం కొరకు 2 లక్షల రుణమాఫీ,100 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు,రైతు భరోసా,రైతు బీమా,ఉచిత కరెంటు,వ్యవసాయ యాంత్రిక పరికరాలు,మద్దతు ధరతో పాటు బోనస్ అందిస్తూ రైతు పక్షపాతి ప్రభుత్వం అని నిరూపించుకున్నామన్నారు. ఈ సందర్భంగా రైతులు ఇచ్చిన పలు సూచనలను సావధానంగా విని సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని తెలిపారు. అదేవిధంగా పడకల్ గ్రామంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్‌లో తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రమాదేవి రైతుల సమస్యలను వివరించారు.అలాగే రైతులకు సబ్సిడీ కింద ప్రొద్దు తిరుగుడు విత్తనాలను సబ్సిడీ ద్వారా అందించాలని మంత్రికి విన్నవించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉషారాణి, ఏడిఏ శోభారాణి,ఏడిఏ పద్మజ, మండల వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తిని, ఏఈఓలు శ్రీకాంత్, లలిత, సుష్మిత, త్రిలోక్య, అనిత తదితరులున్నారు.



## మంథనిలో 'సంఘటన్ శ్రీజన్ అభియాన్'

**గోదావరిఖని, జనంసాక్షి :** మంథని నియోజకవర్గంలోని నరసింహ శివ కిరణ్ గార్డెన్స్‌లో లోక్‌సభాపక్ష నేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌గౌడ్, తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు మంథని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అధ్యక్షతన 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్, ఏఐసీసీ పరిశీలకులు డాక్టర్ కే.జయ కుమార్, కేతురి వెంకటేష్, ఖాజాఫక్రుద్దిన్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ రాజేష్ కాశీపాక పాల్గొన్నారు. పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు, మంథని, అంతర్గం మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లాలోని ధర్మారం, రామగుండం మండలం అధ్యక్షులు, రామగుండం మున్సిపల్ కార్పోరేషన్ అధ్యక్షులను పార్టీ శ్రేణుల మెజారిటీతో ప్రకటించారు. 'సంఘటన్ శ్రీజన్ అభియాన్ తెలంగాణ' టీపీసీసీ పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు,యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, ఎస్సి,బీసీ సంఘాల నాయకులు, మాజీ ఎంపిపి, జడ్పీటీసీ, సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పోరేటర్లు,భారీ సంఖ్యలో పాల్గొని అభిప్రాయాలను వ్యక్తపరిచారు.

# ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు తావులేదు






- రైతులకు ఇబ్బందులు లేకుండా సాఫీగా సేకరణ
- పారదర్శకంగా, నాణ్యతా ప్రమాణాలతో కొనుగోళ్ళు : అదనపు కలెక్టర్
- అన్ని శాఖలతో సమన్వయంతో సజావు ప్రక్రియ

**నిజాంపేట్, అక్టోబర్ 14 (జనంసాక్షి):** జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు తావీయకుండా, రైతులకు ఇబ్బందులు కలగకుండా సజావుగా సేకరణ ప్రక్రియను నిర్వహించాలని అధికారులకు సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో వానాకాలం పంట ధాన్యం కొనుగోళ్లపై కొనుగోలు కేంద్రాల అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, మిల్లర్స్, సివిల్ సప్లై అధికారులతో జరిగిన అవగాహన సదస్సులో ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం సేకరణలో అక్రమాలకు ఆస్కారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, సమగ్ర ప్రణాళికతో సేకరణ జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 34 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, దాదాపు 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరుగుతుందని, 6 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి, అన్ని శాఖలతో సమన్వయం పెంపొందించుకొని ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా కృషి చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేసి, తాగునీరు, నీడ వంటి కనీస వసతులను అందుబాటులో ఉంచాలని, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం తీసుకొచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పూర్తిగా అందేలా చూడాలని ఆదేశించారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు లోబడి బాగా ఆరబెట్టిన, శుభ్రపరిచిన ధాన్యాన్ని తీసుకురావాలని రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. పచ్చి ధాన్యం కోయకుండా రైతులకు, హార్వెస్టర్ యజమానులకు చైతన్యం కల్పించాలని, రవాణాకు సరిపడా వాహనాలు, హమాలీలు, నిల్వ స్థలాలను ఏర్పాటు చేయాలని, అకాల వర్షాల నుంచి ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. తూకం యంత్రాలు, గ్రెయిన్ క్యాలిపర్స్, తేమ కొలిచే యంత్రాలు సరిపడా అందుబాటులో ఉండాలని, క్రాప్ బుకింగ్, ధాన్యం సేకరణ వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని, ట్రక్ షీట్లలో అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గన్నీ బ్యాగుల పంపిణీలో ఇష్టారీతి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు అనుగుణంగా సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం తరఫున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని, క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సదస్సులో డీఎస్ఓ వనజాత, సివిల్ సప్లైస్ డీఎం హరీష్, డీసీఓ సుధాకర్, జిల్లా వ్యవసాయ అధికారి ఉష, వ్యవసాయ శాఖ అధికారులు, మిల్లర్స్, కొనుగోలు కేంద్రాల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మా భూములు మాకే కావాలి




- తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం
- భూమి వేరొకరికి ధారాదత్తంపై యువకుడి తీవ్ర ఆందోళన
- కోర్టు, కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
- బడా సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు

**నిజాంపేట్, అక్టోబర్ 14 (జనంసాక్షి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ తాండా-2కు చెందిన బానోతు సిద్దు నాయక్ అనే యువకుడు మంగళవారం తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సంచలనం సృష్టించింది. తమ కుటుంబానికి చెందిన భూములను వేరొకరికి ధారాదత్తం చేయకుండా కాపాడాలని, కోర్టు, కలెక్టర్ ఆదేశాల మేరకు పరిరక్షించి న్యాయం చేయాలని కోరుతూ సిద్దు నాయక్, స్వాతి తదితర కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. గాగిల్లాపూర్ సర్వే నెంబర్లు 148, 150లో 14 గుంటల భూమి తమదని, 2006, 2008లో తమ కుటుంబీకులు వ్యవసాయం చేశారని బాధితులు తెలిపారు. ఈ భూములపై కొన్ని తప్పుడు పత్రాలతో ఓ మహిళ విక్రయించిందని, దీంతో 2010లో కోర్టును ఆశ్రయించి తమ పక్షాన తీర్పు సాధించామని వివరించారు. 2015లో భూమి రికార్డులు ఆన్‌లైన్‌కు వెళ్లిన తర్వాత అధికారులు తమ పేర్లు తొలగించారని, కలెక్టర్‌కు విన్నవించినా స్పందన లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించామని చెప్పారు. జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీ చేసి ఈ భూమి భూదాన్ భూమి కాదని తేల్చారని, అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రొహిబిషన్ లిస్టులో చేర్చారని ఆరోపించారు. డబ్ల్యూపీ నెంబర్ 9364తో హైకోర్టు ఆశ్రయించగా, కలెక్టర్ రైతులకు న్యాయం చేయాలని ఆదేశాలిచ్చిందని, ఎల్ఆర్ నెంబర్ ద్వారా నివేదిక ఇచ్చి భూదాన్ భూమి కాదని స్పష్టం చేశారని తెలిపారు. అయినా దుండిగల్ తాసిల్దార్ ఎండి మతిన్ తమ భూమి కాదంటూ దురుసుగా మాట్లాడుతూ, పై అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ బడా కంపెనీలకు అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారని, గతంలో లంచాలు డిమాండ్ చేశారని బాధితులు విలేకరుల ముందు ఆరోపించారు. సిద్దు నాయక్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో దుండిగల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విషయాన్ని తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తాసిల్దార్ ఎండి మతిన్ విచారించి బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# పేదింటి ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకం కొండంత అండ


**వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి**

**35 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ**

**బొంరాస్ పేట,అక్టోబర్ 14 (జనం సాక్షి):** కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకం పెదింటి ఆడబిడ్డలకు కొండంత అండగా నిలుస్తుందని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి అన్నారు.మంగళవారం బొంరాస్ పేట మండల కేంద్రంలో 35 మంది లబ్ధిదారులకు మంజూరు అయిన కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను ముఖ్యఅతిథిగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి హాజరై పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి,పిఎసిఎస్ చైర్మన్ జయకృష్ణ,ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యుడు నర్సింలు గౌడ్,ఎంపీడీవో వెంకన్ గౌడ్,ఆర్ఐ శిరీష, నాయకులు రాంరెడ్డి,వెంకట్ రాములు గౌడ్,అంజిల్ రెడ్డి,మల్లేష్,బాపల్లి సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌సీఏలో నకిలీ జనన ధృవీకరణ పత్రాల కలకలం

- ఫేక్ డాక్యుమెంట్లతో మ్యాచ్‌లు ఆడుతూ మోసాలు
- అనంతరెడ్డి ఫిర్యాదుపై దర్యాప్తు.. ఉప్పల్ సీఐ
- క్రికెట్ రంగంలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి



**ఉప్పల్, అక్టోబర్ 14 (జనం సాక్షి):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్సీఏ)లో నకిలీ జనన ధృవీకరణ పత్రాలతో క్రికెట్ మ్యాచ్‌లు ఆడుతూ మోసాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. కరీంనగర్‌కు చెందిన అనంతరెడ్డి ఈ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని రాచకొండ పోలీస్ కమీషనర్ జి. సుధీర్ బాబుకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు రాచకొండ సీపీ ఆదేశాలపై ఉప్పల్ సీఐ కె. భాస్కర్ దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనంతరెడ్డి వివరాలు వెల్లడించారు. హెచ్సీఏలో కొందరు క్రికెటర్లు వయసు మార్చు కోవడానికి ఫేక్ బర్త్ సర్టిఫికేట్‌లు ఉపయోగించుకుంటూ మ్యాచ్‌లు ఆడుతున్నారని, ఇది పెద్ద మోసానికి దారితీస్తోందని ఆయన ఆరోపించారు. ఈ నకిలీ డాక్యుమెంట్ల వల్ల యువ క్రికెటర్ల అవకాశాలు దెబ్బతింటున్నా యని, అసోసియేషన్ నిర్వాహకులు దీనికి కళ్ళతో చూస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఈ ఫిర్యాదు హెచ్సీఏలో ఇప్పటికే ఉన్న అక్రమాలకు మరో తుది రంది. దర్యాప్తులో ఫేక్ సర్టిఫికేట్‌లు, వాటితో మ్యాచ్‌లలో పాల్గొన్నవారి వివరాలు తేలిస్తే ఈ కేసు మరింత విస్తరిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. క్రికెట్ రంగంలో ఇలాంటి మోసాలు ఆట యువతకు దెబ్బ తీస్తాయని, కఠిన చర్యలు తీసుకోవాలని అనంతరెడ్డి కోరారు. ఈ ఘటన హైదరాబాద్ క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# చట్టాలపై అవగాహనతోనే హక్కుల రక్షణ

- బాలికలు సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి
- ఉన్నత విద్యతోనే బాలికలు ఉన్నత శిఖరాలకు : సీనియర్ సివిల్ జడ్జి విద్య నాయక్
- ఉచిత న్యాయ సహాయం కోసం 15100కు సంప్రదించండి




**నారాయణపేట, అక్టోబర్ 14 (జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, బాలికలు కంటికి రూపం, ఇంటికి దీపం, మమతకు అపురూపం, నిండు గుండెకు మణిదీపమని కొనియాడారు. అమ్మ కావాలి, భార్య కావాలి, సోదరి కావాలి అని అంటారు కానీ కూతురు ఎందుకు వద్దని ప్రశ్నించారు. బాలికల హక్కులు, భద్రతపై అవగాహనతో విద్యార్థులు రేపటి పౌరులుగా సమాజంలో ముందడుగు వేయాలని సూచించారు. బాలికలు కష్టపడి చదివి ఉన్నత విద్యను అభ్యసించి, మంచి హోదాలో నిలదొక్కుకోవాలని, సమాజంలో స్త్రీ పాత్ర కీలకమని, పెళ్లి విషయంలో ఆలోచనాపూర్వకంగా నిర్ణయాలు తీసుకోవాలని ఆమె సూచించారు. బాలలు, మహిళలు, యువత, నిరక్షరాస్యులు మోసాలకు, హింసలకు గురయ్యే ప్రమాదం ఉందని, అటువంటి సందర్భాల్లో టోల్ ఫ్రీ నంబర్ 1098 లేదా 15100కు సంప్రదించి సమస్యలకు పరిష్కారం పొందవచ్చని తెలిపారు. బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, సైబర్ నేరాలు, బాల కార్మిక సమస్యలపై అవగాహన కల్పించారు. వివాహ వయస్సు వచ్చాకే పెళ్లిళ్లు చేసుకోవాలని, విద్యార్థులు అంకితభావంతో చదివి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. పేసా ఆక్ట్, చైల్డ్ ప్రొహిబిషన్ ఆక్ట్, చైల్డ్ లేబర్ ఆక్ట్, ఉచిత విద్య కోసం ప్రభుత్వ పథకాలు, సర్వ శిక్షా అభియాన్, విద్యా హక్కు, బేటీ బచావో-బేటీ పఢావో, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కె. లక్ష్మీపతి గౌడ్, సీనియర్ న్యాయవాది నందు నామాజీ, చిల్డ్రన్స్ డిపార్ట్‌మెంట్ అధికారి తిరుపతయ్య మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన మూడు లక్షల ఆదాయం ఉన్నవారు 15100 నంబర్‌కు సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. సమస్యలను చెప్పడం ద్వారా తగిన పరిష్కారం లభిస్తుందని వివరించారు. తదుపరి, న్యాయమూర్తి వింధ్య నాయక్ హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న వసతులు, భోజన మెనూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందిస్తున్నారా అని ఆరా తీశారు. సిబ్బంది విద్యార్థులను సొంత ఇంటి వారిలా చూసుకోవాలని, 24 గంటలూ అందుబాటులో ఉండి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కె. లక్ష్మీపతి గౌడ్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నందు నామాజీ, ప్రిన్సిపాల్ యామిని, డిసిపిఓ తిరుపతయ్య, పోలీస్ అధికారి బాలస్వామి, పారాలీగల్ వాలంటీర్ రూపిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# విద్యార్థిని ప్రియాంక మృతదేహంతో కుటుంబ సభ్యులు నిరసన

**మల్దకల్ అక్టోబర్ 14(జనం సాక్షి) :** మండల కేంద్రానికి చెందిన ప్రియాంక మహబూబ్‌నగర్ మండలం రామిరెడ్డిగూడ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉరేసుకొని మరణించిన సంగతి తెలిసిందే..తమ కూతురు మరణం వెనుక అనుమానలు ఉన్నాయని తక్షణమే తమ కూతురికి న్యాయం చేయాలని ప్రియాంక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు మంగళవారం మల్దకల్ బస్టాండ్ చౌరస్తాలో నిరసనకు దిగారు.దీనితో గద్వాల నుంచి అయిజ వెళ్ళే ప్రధాన రహదారి వెంట వాహనాలు నిలిచిపోయాయి. ప్రియాంక మృతదేహం దగ్గరికి గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు.ప్రియాంక మరణంవెనక ఎవరున్నా వదిలేది లేదని,ఎమ్మెల్యే ప్రియాంక కేసును పోలీసులతో నిష్పక్షపాతంగా విచారణ చేపిస్తానని కుటుంబ సభ్యులకుఆయన హామీ ఇచ్చారు.ప్రియాంక ఆత్మహత్యకు కారణమైన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సంఘటన ఆ స్థలానికి గద్వాల డిఎస్పి మొగిలయ్య, సిఐ సిఐ టంగుటూరి శీను, ఎస్సై నందీకర్ చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు. ఎమ్మెల్యే హామీతో కుటుంబసభ్యులు నిరసనను శాంతించి విరమించారు.

# ఎస్సీ వర్గీకరణతో సామాజిక న్యాయం

- అన్ని వర్గాలకు సముచితంగా విద్యావకాశాలు
- వర్గీకరణ ఫలితాలు కండ్లముందు కనిపిస్తున్నాయి
- విద్యాశాఖ అధికారులతో సమావేశంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ
- డ్రాప్ అవుట్స్ అవకుండా చర్యలు తీసుకోవాలని సూచించిన మంత్రి
- ఫాకల్టీ, సీనియర్లతో మెంటార్‌షిప్ ప్రోగ్రామ్ నిర్వహించాలని ఆదేశం



హైదరాబాద్ (జనంసాక్షి) : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణతో విద్యావకాశాల్లో సామాజిక న్యాయం సాధ్యపడిందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఇంతకాలం ప్రొఫెషనల్ కోర్సుల్లో నామమాత్రంగా ఉన్న వర్గాలకు, రిజర్వేషన్ల వర్గీకరణతో ఈ ఏడాది సముచిత ప్రాధాన్యం లభించిందని ఆయన పేర్కొన్నారు. ఎస్సీల్లో అత్యంత వెనుకబడిన కులాలకు చెందిన పిల్లలకు కూడా ఈ ఏడాది మెడికల్, ఇంజనీరింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో సముచిత సంఖ్యలో సీట్లు రావడం సంతోషంగా ఉందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణతోనే ఇది సాధ్యమైందని ఆయన తెలిపారు. ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా విభజిస్తూ ప్రభుత్వం రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ రిజర్వేషన్ల ప్రకారమే ఈ ఏడాది ఇంజనీరింగ్, మెడికల్ తదితర కోర్సుల సీట్లను భర్తీ చేశారని తెలిపారు. ఈ మేరకు ఇంజనీరింగ్, మెడికల్ తదితర కోర్సుల్లో ఆయా వర్గాల విద్యార్థులకు వచ్చిన సీట్లు, ఇతర అంశాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష చేశారు. మంగళవారం ఉదయం సెక్రటేరియట్‌లో జరిగిన ఈ సమావేశంలో ఎడ్యుకేషన్ సెక్రటరీ, డాక్టర్ యోగితారాణా, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ కుమార్, జేఎన్‌టీయూ వీసీ కిషెన్ కుమార్ రెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ఘంట చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి బావురి, మెహతర్, మాంగ్, బేడ బుడగ జంగం, మన్నె, కొలుపులవాండ్లు తదితర అత్యంత వెనుకబడిన కులాల పిల్లలకు ప్రభుత్వ మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో సీట్లు వచ్చాయని అధికారులు మంత్రికి వివరించారు. ఎంబీబీఎస్‌లో ఎస్సీ గ్రూప్ 1లో ఉన్న కులాల పిల్లలకు 41 సీట్లు, ఎస్సీ గ్రూప్ 2లో ఉన్న కులాల పిల్లలకు 561 సీట్లు, ఎస్సీ గ్రూప్ 3లో ఉన్న కులాల పిల్లలకు 324 సీట్లు వచ్చాయని అధికారులు తెలిపారు. ఇంజనీరింగ్‌లో ఎస్సీ గ్రూప్ 1లో ఉన్న కులాల పిల్లలకు 378 సీట్లు, ఎస్సీ గ్రూప్ 2లో ఉన్న కులాల పిల్లలకు 8246 సీట్లు, ఎస్సీ గ్రూప్ 3లో ఉన్న కులాల పిల్లలకు 5466 సీట్లు వచ్చాయని అధికారులు వెల్లడించారు. ఫార్మసీలో ఎస్సీ గ్రూప్ 1లో ఉన్న కులాల పిల్లలకు 60 సీట్లు, ఎస్సీ గ్రూప్ 2లో ఉన్న కులాల పిల్లలకు 1603 సీట్లు, ఎస్సీ గ్రూప్ 3లో ఉన్న కులాల పిల్లలకు 898 సీట్లు వచ్చాయని అధికారులు తెలిపారు. గ్రూప్ 2, గ్రూప్ 3 కులాల పిల్లలు తమకు రిజర్వ్ చేసిన సీట్లతో పాటు, ఓపెన్ కేటగిరిలోనూ పెద్ద సంఖ్యలో సీట్లు సాధించారని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమాజంలో అట్టడుగు వర్గాల అభివృద్ధి విద్యతోనే సాధ్యం అవుతుందని తమ ప్రభుత్వం నమ్ముతోందన్నారు. ఇందుకు అనుగుణంగానే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, కుల గణన, బీసీ రిజర్వేషన్ల పెంపు వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రిజర్వేషన్ల వర్గీకరణ ఫలాలు కండ్ల ముందు కనిపిస్తున్నాయన్నారు. రిజర్వేషన్ల వర్గీకరణతో ఇన్నాళ్లు గుర్తింపునకు నోచుకోని వర్గాల పిల్లలకు కూడా ఉన్నత విద్యావకాశాలు రావడం సంతోషంగా ఉందన్నారు. దశాబ్దాల వర్గీకరణ కలను నెరవేర్చుకోవడం, మొదటి ఏడాదిలోనే వర్గీకరణ ఫలాలు ఆయా కులాలకు అందడం మరింత ఆనందాన్ని ఇస్తోందన్నారు. వర్గీకరణ అనేది అత్యంత వెనుకబడిన కులాల వారికి చేయూతనిచ్చి సామాజిక న్యాయాన్ని సాధించడం కోసమే తప్ప, ఏ కులానికి వ్యతిరేకం కాదు అని తాము మొదట్నుంచీ చెబుతున్నామని, ఎంబీబీఎస్, ఇంజనీరింగ్, ఫార్మసీ తదితర సీట్ల కేటాయింపుతో ఇది మొదటి ఏడాదిలోనే నిరూపితం అయిందన్నారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రత్యేక తరగతుల నిర్వాహించాలని, సైకాలజిస్టులతో మోటివేషన్ క్లాసులు చెప్పించాలని సూచించారు. విద్యార్థులను బృందాలుగా ఏర్పాటు చేసి టీచింగ్ ఫాకల్టీని, సీనియర్ స్టూడెంట్లను మెంటార్లుగా నియమించాలని సూచించారు. అకాడమిక్స్‌తో పాటు లాంగ్వేజ్, ఇతరత్ర అవసరమైన స్కిల్స్ నేర్పించేందుకు స్పెషల్ క్లాసులు నిర్వహించాలని సూచించారు. విద్య, వైద్య రంగంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలియజేశారు.



# ములుగు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలి

- మంత్రి సీతక్క విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 14 (జనంసాక్షి) : సచివాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని సాగు నీటి ప్రాజెక్టులపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. సమావేశంలో ములుగు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై చర్చ జరిగింది. ములుగు జిల్లాలో కొనసాగుతున్న ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని మంత్రి సీతక్క కోరారు. ఏటూరు నాగరం, మంగపేట మండలాల్లో గోదావరి నది వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను తక్షణం పూర్తి చేయాలని ఆమె సూచించారు. అలాగే రామప్ప సరస్సుపై పొట్లాపూర్ ఎత్తిపోతల పథకానికి పరిపాలన అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రామప్ప నుండి లక్న వరం వరకు దేవాదుల పైప్‌లైన్ పనులను ప్రారంభించాలని సీతక్క సూచించారు. ములుగు నియోజకవర్గానికి గోదావరి జలాలు అందేలా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని మంత్రి సీతక్క కోరారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ములుగు ప్రాంతంలోని పెండింగ్ ప్రాజెక్ట్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్ట్‌ల పురోగతిపై సమగ్ర నివేదికను సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

# తుమ్మల, పొన్నంలకు మానవత్వం ఉందా?

- మాగంటి సునీతను అవమానపరుస్తారా?
- మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాస గౌడ్

హైదరాబాద్, అక్టోబర్14 (జనంసాక్షి) : మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లకు మానవత్వం ఉందా? వాళ్లు మనుషులేనా? అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఆడబిడ్డ అయిన మాగంటి సునీతను అవమానించడం ఎంతవరకు సమంజసం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్‌లపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గోపన్న అమర్ రహే అంటుంటే, తన భర్త గోపినాథ్‌ను గుర్తు చేసుకొని మాగంటి సునీత ఏడుస్తుంటే డ్రామా అంటారా తుమ్మల నాగేశ్వరరావు? కమ్మ సామాజిక వర్గం ఓటు వేస్తే గెలిచిన తుమ్మల, అదే వర్గానికి చెందిన నేత గోపినాథ్ సతీమణిని డ్రామా అంటారా? అని ప్రశ్నించారు. మాగంటి సునీతకు మంత్రుల వ్యాఖ్యలు తీవ్ర మనస్తాపం కలిగించా



యని, వారు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రుల మాటలను తెలంగాణ ఆడబిడ్డలు గమనించాలి అని ఆయన వ్యాఖ్యానించారు. యువకుడు..అలాగే, ప్రెస్ మీట్ సమయంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి మంత్రుల పక్కనే కూర్చున్నా, ఆడబిడ్డ అవమానింపబడుతుండగా మౌనంగా ఉన్నారని గౌడ్ విమర్శించారు. రాజీవ్ గాంధీ చనిపోయినప్పుడు పార్టీలకతీతంగా అందరం బాధ పడ్డామని, ఇప్పుడు మాగంటి సునీత తన భర్తను గుర్తుచేసుకొని ఏడుస్తుంటే దాన్ని డ్రామా అంటారా? ఇది సిగ్గుచేటు అని మండిపడ్డారు. మాగంటి సునీత భావాలను దెబ్బతీసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లు వెంటనే క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

# హర్యానా కొత్త డీజీపీగా ఓం ప్రకాశ్ సింగ్

- తాత్కలిక బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం
- ఐపీఎస్ అధికారి పూరన్‌కుమార్ హత్య నేపథ్యంలో మార్పు

చండీఘడ్, అక్టోబర్14 (జనంసాక్షి) : హర్యానా కొత్త డీజీపీగా ఓం ప్రకాశ్ సింగ్‌ను ఆ రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నియమించింది. ప్రస్తుతం హర్యానా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా ఓం ప్రకాశ్ సింగ్ విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు రాష్ట్ర డీజీపీగా అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు హర్యానా ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉన్నతాధికారులు కుల వివక్ష, అవమానాలు, వేధింపులు తట్టుకో లేక హర్యానా కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఆయన.. తన సూసైడ్ నోట్‌లో హర్యానా డీజీపీ శత్రుజీత్ కపూర్, రోహ్‌తక్ ఎస్పీ బిజార్ణియా సహా 8 మంది



సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లు రాశారు. వారి వేధింపులే తన ఈ ఆత్మహత్యకు కారణమంటూ ఆయన రాసిన లేఖలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాల నుంచే కాకుండా.. పూరన్ కుమార్ కుటుంబం నుంచి తీవ్ర ఒత్తిడి పెరిగింది. దాంతో రోహ్‌తక్ ఎస్పీ బిజార్ణియాపై ప్రభుత్వం ఇప్పటికే బదిలీ వేటు వేసింది. అలాగే డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను సెలవుపై ప్రభుత్వం పంపించింది. దీంతో కొత్త డీజీపీగా తాత్కాలిక నియామకం అనివార్యమైంది. మరో వైపు అక్టోబర్ 7వ తేదీన ఆత్మహత్య చేసుకున్న పూరన్ కుమార్ కుటుంబం.. తమకు న్యాయం చేయాలంటూ దేశ రాజధాని న్యూఢిల్లీలోని ప్రముఖ రాజకీయ పార్టీల అధినేతలతో వరుస భేటీ అవుతుంది. ఈ ఆత్మహత్య కేసును నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని.. అలాగే పూరన్ కుమార్ మరణించే ముందు పేర్కొన్న ఉన్నతాధికారులను కఠినంగా శిక్షించాలని ఆ కుటుంబం కోరుతుంది. పూరన్ కుమార్ భార్య అమ్నేతి కుమార్.. అదే రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు.

# రిజర్వేషన్లు బీసీల హక్కు

- ఎవరి దయాదాక్షిణ్యాలతో ఇచ్చేవి కావు
- తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం



హైదరాబాద్, అక్టోబర్14 (జనంసాక్షి) : రిజర్వేషన్లు బీసీల హక్కు అని, ఎవరి దయా దాక్షిణ్యాల మీద ఇచ్చేవి కాదని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం అన్నారు. జనాభా దామాషా పద్దతిలో వారికి రావాల్సిన హక్కు ఉందన్నారు. ఎంతోకాలంగా వారు రాజకీయంగా అవకాశాలు అందిపుచ్చుకోలేక పోతున్నారని అన్నారు. రిజర్వేషన్లు మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం చూపగలవని అన్నారు. మానత్వపు పునాదులపై కొత్త సమాజం ఏర్పాటు చేసేందుకే అవి ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రిజర్వేషన్ల సాధన కోసం ప్రొఫెసర్ పీఎల్. విశ్వేశ్వర్‌రావు నేతృత్వంలో ఒక సబ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇతర సంఘాలతో కలిసి ఈ కమిటీ కృషి చేస్తుందన్నారు. రిజర్వేషన్ల అంశంపై కొన్ని పార్టీలు ద్వంద వైఖరి అవలంబిస్తున్నాయి. కేసులు వేసిన వ్యక్తులకు మద్దతు తెలుపుతూ.. బీసీలకు అన్యాయం జరిగిందని ప్రచారం చేస్తున్నాయి. తెజసకి రెండు నాలుకల ధోరణి లేదు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు తెలుపుతుంది. కేంద్రంపైన ఒత్తిడి తీసుకొచ్చి బీసీ బిల్లును ఆమోదించేందుకే మా పోరాటం అని అన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ర్యాలీలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహిస్తామని తెజస ఉపాధ్యక్షుడు పీఎల్. విశ్వేశ్వర్‌రావు అన్నారు. సుప్రీం కోర్టులో న్యాయపరంగా పోరాటం చేస్తామన్నారు. 16న గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ జనసమితి పలు తీర్మానాలు చేసింది. బీసీ సంఘాలు 18న నిర్వహించే బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించింది. మరోవైపు బీసీ రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇవ్వడంలో న్యాయం లేదని ఎంపీ, బీసీ రిజర్వేషన్ల సాధన సమితి కన్వీనర్ ఆర్. కృష్ణయ్య తెలిపారు. స్టే ఇవ్వడం ద్వారా బీసీల నోటికాడ ముద్దను లాక్కుందని వ్యాఖ్యానించారు. బీసీల వాదన వినకుండా కోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చిందన్నారు.

# సామాన్యులకు చుక్కలు చూపుతున్న బంగారం

- సంపన్నులను కలవర పెడుతున్న ధరలు
- లక్షా 30 వేలు దాటేసిన బంగారు తులం ధర



హైదరాబాద్, అక్టోబర్14 (జనంసాక్షి) : సామాన్యులను దూరం చేసుకుంటున్న బంగారం సంపన్నులనూ సవాల్ చేస్తున్నది. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. దేశీయ మార్కెట్‌లో బంగారం ధర చుక్కలు తాకుతోంది. అంతర్జాతీయ పరిణామాలు, పండగల సీజన్ కలిసొచ్చి పసిడి దూసుకెళ్తోంది. హైదరాబాద్‌లో రూ.1.30 లక్షలు దాటి పరుగులు పెడుతోంది.మంగళవారం ఒక్కరోజే తులం రేటు దాదాపు రూ.3,000 ఎగబాకింది. ఫలితంగా తులం బంగారం రూ.1.30 లక్షలు దాటి సరికొత్త రికార్డు సృష్టించింది.మార్కెట్ వర్గాల ప్రకారం.. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో తులం బంగారం ధర రూ.2,720 పెరిగి మునుపెన్నడూ లేనివిధంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,30,830కి ఎగబాకింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,21,150గా ఉంది. ఇక హైదరాబాద్‌లో కిలో వెండి ఒక్కరోజులోనే రూ.3వేలు పెరిగి రూ.1,86,200కి చేరింది. 2025లో బంగారం ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే దాదాపు 50 శాతానికి పైగానే ధరలు పెరిగాయి. 2022తో పోలిస్తే మొత్తం పెరుగుదల 140 శాతానికి చేరుకుంది. ఈ నెల 18న ధనత్రయోదశి వస్తున్నది. ఈ రోజున బంగారం, వెండి కొనుగోళ్లు శుభప్రదమని దేశంలోని మెజారిటీ ప్రజల విశ్వాసం. అయితే మార్కెట్‌లో ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా.. అప్పటికల్లా రేట్లు ఇంకా పెరిగిపోవచ్చున్న అంచనాలైతే ఉన్నాయి. ఇదే జరిగితే 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాములు రూ.1,50,000 దాటిపోవచ్చున్న అభిప్రాయాలైతే బలంగా వినిపిస్తున్నాయి. అటు వెండి ధర కూడా భారీగా పెరుగుతోంది. దాదాపు రూ.2 లక్షలకు చేరువైంది. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.1,85,763గా ఉంది. అంతర్జాతీయ విపణిలోనూ పసిడి ధర విపరీతంగా పెరుగుతోంది. ఔన్సు ధర 4,115 డాలర్లుగా ఉంది. ఔన్సు వెండి ధర 51 డాలర్లు దాటింది. అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, యూఎస్-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు వంటి పరిణామాలతో బంగారంలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. ఈక్రమంలోనే గోల్డ్ ఈటీఎఫ్‌లకు గిరాకీ విపరీతంగా ఉంటోంది. సెప్టెంబరులో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (గోల్డ్ ఈటీఎఫ్)లో నిధుల ప్రవాహం పెరిగింది. ఆగస్టులో వీటిలోకి రూ.2,190 కోట్ల పెట్టుబడులు రాగా, సెప్టెంబరులో ఈ మొత్తం నాలుగింతలై రూ.8,363 కోట్లకు చేరింది. మరోవైపు, ధనత్రయోదశితో పాటు రాబోయే పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడికి మరింత డిమాండ్ ఉంటుందని బులియన్ వర్గాలు అంచనా వేశాయి. వచ్చే ఏడాది ఆరంభం నాటికి బంగారం ధర రూ.1.50 లక్షలకు చేరొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# గురుకుల కాలేజీ విద్యార్థిని ఆత్మహత్య

జోగులాంబ గద్వాల, అక్టోబర్14 (జనంసాక్షి) : జిల్లాలో విషాదం నెలకొంది. ఈ చదువు చదవలేక పోతున్నానని నోట్ రాసి గురుకుల కాలేజీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. అయితే ప్రేమ వేధింపులతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గద్వాల జిల్లా మల్దకల్‌కు చెందిన ఉప్పరి నగేశ్ కుమార్తె ప్రియాంక (17) మహబూబ్‌నగర్ జిల్లా రాంరెడ్డిగూడ సోషల్ వెల్ఫేర్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. సోమవారం నాడు బాత్‌రూంలోని కిటికీకి ప్రియాంక ఉరివేసుకుంది. ఇది గమనించిన తోటి విద్యార్థులు కాలేజీ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వెంటనే వారు ఆస్పత్రికి తరలించారు. కానీ పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున ప్రియాంక మృతిచెందింది. హాస్టల్‌లో ఉండటం తనకు ఇష్టం లేదని మూడు రోజుల క్రితం ప్రియాంక తన తల్లిదండ్రులకు ఫోన్ చేసింది.. అయితే అక్కడకే ఉండి చదువుకోవాలని ఆమె తండ్రి చెప్పాడని పోలీసులకు తోటి విద్యార్థులు తెలిపారు.

## ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య



హైదరాబాద్, అక్టోబర్14 (జనంసాక్షి) : హైదరాబాద్ బాలానగర్ ప్రాంతంలో విషాద ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల కారణంగా ఓ తల్లి తన ఇద్దరు చిన్నారులను హత్య చేసి, ఆ తర్వాత భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో మృతురాలును చల్లారి సాయిలక్ష్మి (27)గా గుర్తించారు. ఆమె భర్త అనిల్ కుమార్ తో కలిసి పద్మారావు నగర్ ఫేజ్-1, బాలానగర్ లో నివాసం ఉంటోంది. సాయిలక్ష్మికి ఇద్దరు కవల పిల్లలు చేతన్ కార్తికేయ, లాస్యతవల్లి ఉన్నారు. తాజాగా అందిన సమాచారం మేరకు గత కొంతకాలంగా భర్తతో వచ్చిన కుటుంబ విభేదాలు, వ్యక్తిగత సమస్యల నేపథ్యంలో తీవ్ర మనస్థాపానికి గురైన సాయిలక్ష్మి, ఆవేశంతో తన ఇద్దరు పిల్లలను చంపి అనంతరం బిల్డింగ్ పై నుంచి దూకి ప్రాణాలు తీసుకుంది. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ఏసీబీకి చిక్కిన విద్యుత్ లైన్‌మెన్

- ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు లంచం డిమాండ్



నాగర్‌కర్నూల్, అక్టోబరు14 (జనంసాక్షి) : నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ అవినీతి అధికారి ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. జిల్లాలోని వంగూర్ మండలం మాచినోనిపల్లి గ్రామం టీజీఎస్‌పీడీసీఎల్‌కు చెందిన లైన్‌మెన్ తోట నాగేంద్ర మంగళవారం రూ.15 వేలు లంచం తీసుకుంటూ చిక్కాడు. వ్యవసాయానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం రైతులు లైన్‌మెన్‌ను సంప్రదించగా లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధిత రైతు మహబూబ్‌నగర్ పరిదిలోని ఏసీబీని ఆశ్రయించగా మంగళవారం అధికారులు పట్టుకున్నారు. అవినీతికి పాల్పడ్డ లైన్‌మెన్‌పై కేసు నమోదు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని అధికారులు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అవినీతికి పాల్పడే వారి సమాచారాన్ని ఏసీబీ టోల్ ఫ్రీ 1064 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. వాట్సప్ నంబర్ 9440446106కు తెలంగాణ ఏసీబీ ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా గాని ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు.

# శ్రీసన్ ఫార్మసీ కంపెనీ లైసెన్సు రద్దు

- తగ్గు మందు మరణాలతో తమిళనాడు నిర్ణయం

చెన్నై, అక్టోబర్ 14 (జనంసాక్షి) : శ్రీసన్ ఫార్మసీ కంపెనీ లైసెన్సును తమిళనాడు డ్రగ్స్ కంట్రోల్ శాఖ రద్దు చేసింది. కోల్డ్‌రిఫ్ దగ్గు మందు తయారీ చేస్తున్న ఆ కంపెనీ లైసెన్సును రద్దు చేస్తున్నట్లు డ్రగ్స్ శాఖ వెల్లడించింది. కోల్డ్రిఫ్ దగ్గుమందులో ప్రాణాంతకమైన డైఇథలీన్ గ్లైకాల్ ఉన్నట్లు గుర్తించారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో 21 మంది చిన్నారుల మృతికి కారణమైన ఆ ప్రాణాంతక ఔషధం ఆ దగ్గుమందులో ఉన్నట్లు గుర్తించారు. తమిళనాడు సర్కారు 2011లో శ్రీసన్ ఫార్మసీ కంపెనీకి దగ్గుమందు తయారీకి లైసెన్సు జారీ చేసింది. 2016లో ఆ లైసెన్సుకు రెన్యూవల్ చేశారు. శ్రీసన్ కంపెనీ లైసెన్సు రద్దు చేసి, దాన్ని పూర్తిగా మూసివేసినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇతర డ్రగ్ తయారీ కంపెనీలపై తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. మరో వైపు శ్రీసన్ ఫార్మసిట్యూకల్స్‌తో పాటు కొందరు డ్రగ్ అధికారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు చేపట్టింది. మధ్యప్రదేశ్ డ్రగ్స్ కంట్రోల్ శాఖ అక్టోబర్ ఒకటో తేదీన తమిళనాడు అధికారులకు ఆ దగ్గుమందుపై అలర్ట్ జారీ చేసింది. కోల్డ్రిఫ్‌తో పాటు అయిదు రకాల ఉత్పత్తులను చెన్నై ల్యాబ్‌లో పరిశీలించారు. దగ్గు సిరప్‌లో ప్రాణాంతకమైన డీఈజీ ఉన్నట్లు గుర్తించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370